# జానపదుల ఆధ్యాత్మికత

రచయిత

**ఆచార్య పులికొండ సుబ్బాచారి**

**తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.**

**2025**

# JANAPADULA ADHYATHMIKATHA

**By**
**Prof. Pulikonda Subbachari**

**Editor**
**Dr. Akella Vibhishana Sarma**
Special Officer
Publications Division

T.T.D. Religious Publications Series No.1515

© All Rights Reserved

First Edition : 2025

Copies : 500

*Published by*
**Sri J. Syamala Rao,** I.A.S.,
Executive Officer
Tirumala Tirupati Devasthanams
Tirupati - 517 507.

***DTP***
Publications Division
T.T.D, Tirupati.

*Printed at*
Tirumala Tirupati Devasthanams Press
Tirupati - 517 507.

# ముందుమాట

తిరుమల తిరుపతి దేవస్థానం ధర్మప్రచారంలో భాగంగా ఆర్షవిజ్ఞానానికి సంబంధించిన గ్రంథాలను చిరకాలంనుండి ప్రచురిస్తున్నది. తిరుమల తిరుపతి ఆధ్యాత్మిక క్షేత్రం కావడంవల్ల ఆబాలగోపాలనికి సంబంధించిన క్షేత్రకావ్యాలు, స్తోత్రాలు, మహనీయులయిన వారి చరిత్రలను ప్రజానీకానికి అందిస్తున్నది. ఈ కోవలో ప్రస్తుతం వెలువరిస్తున్న పుస్తకం "జానపదుల ఆధ్యాత్మికత".

భారతదేశంలో ఎన్నో మతాలున్నాయి. ఆయా మతాలకు సంబంధించిన సిద్ధాంత గ్రంథాలున్నాయి. అదే సందర్భంలో సామాన్యులకు అర్థమయ్యే సాహిత్యం కూడా ఉంది. అలాంటి సాహిత్యంలో జానపద సాహిత్యమొకటి.

ఒకప్పుడు జానపద సాహిత్యమంటే పల్లెప్రాంతాలలో గ్రామీణుల మధ్య వాగ్రూపకంగా ప్రచారమయిన సాహిత్యం. కాని గడచినశతాబ్దం నుండి పండితులలో, పరిశోధకులలో 'జానపద వాఙ్మయం' పై అభిరుచి పెరగడంతో ఈ వాఙ్మయ పరిశోధన 'మఱ్రిచెట్టు ఊడలా' పెరిగింది. జానపదుల విశ్వాసాలు, జానపదుల ఆచారవ్యవహారాలపై ఎందరో పరిశోధకులు గ్రంథరాజాలు వ్రాశారు. అసలు జానపదులంటే పల్లెటూరి జనం మాత్రం కాదు. నాగరికులలో కూడా జానపద భావాలున్నాయని నిరూపించినవారున్నారు. ఇలాంటిదే జానపదుల ఆధ్యాత్మికతాభావం. ఈ అంశానికి సంబంధించి నిర్మాణాత్మకమయిన, విశ్వసనీయమయిన పుస్తకం సామాన్యులకు అందుబాటులో లేదు. ఈ దృష్టితో జానపదుల ఆధ్యాత్మికతకు సంబంధించి ఆచార్య పులికొండ సుబ్బాచారి గారు రచించిన గ్రంథాన్ని తి.తి.దే. అందిస్తున్నది.

విశ్వాసాల మీద ఆధారపడిందే ఆధ్యాత్మికత. వీటిని కొట్టిపడేయడం విజ్ఞుల లక్షణం కాదు. జానపదుల ఆధ్యాత్మికత 'పురాణదేవతారాధన' అందుకు సంబంధించి వివిధ కులాల విశ్వాసాలు చిత్రాతిచిత్రం. కేవలం పురాణ దేవతలపై జానపదుల భక్తి క్రమంగా మానవదేవతలపై కూడా ప్రసరించడం ఆధ్యాత్మికతయే. అలాగే నాగరిక కుటుంబాలలో కూడా బలీయమైన అమ్మతల్లుల ఆరాధన, నాగదేవతారాధనలు ఆధ్యాత్మికతలో భాగాలు. ఇంతేగాక జానపద సంప్రదాయంలో సరికొత్త దీక్షలు సామాన్య ప్రజలను ఆధ్యాత్మికతారంగంలో ప్రవేశింపజేశాయి.

ఈ పుస్తకంలో 'వేంకటేశ్వరస్వామి జానపద అవతారాల' గురించిన చర్చ ఆసక్తిజనకం. తిరుమలకు విచ్చేసి తమిళులు, కన్నడిగులు, మహారాష్ట్రులు, ఔత్తరాహుల భక్తిప్రకటనంలోని విశేషాలు ఈ ప్రకరణంలో విశదీకరింపబడ్డాయి.

పల్లెలు, గ్రామాలు, పట్టణాల రూపురేఖలు మారినా 'గ్రామీణ దేవతల ఆరాధన' లలో మాత్రం మార్పులేమీ లేవు. నేడు గిన్నీస్‌బుక్‌లో నమోదు చేసుకోవడానికి తహతహపడుతున్నాయి.

ఇలాంటి ఎన్నో అంశాలపై ఆచార్య పులికొండ సుబ్బాచారి గారు సరళమైన భాషలో రచన సాగించారు, వారికి హృదయపూర్వక అభినందనలు.

ఈ పుస్తకం బహుళ ప్రచారానికి నోచుకొంటుందని ఆశిస్తున్నాను.

సదా శ్రీవారి సేవలో...

కార్యనిర్వహణాధికారి

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.

# ఒక్కమాట

మనం నిత్యజీవితంలో పల్లెటూరి జనాన్ని, గ్రామీణుల్ని జానపదులంటాం. వీరికి సంబంధించిన అనేకాంశాలు జానపద వాఙ్మయమవుతుంది. మారుతున్న సామాజిక చైతన్యం పల్లెలను, గ్రామాలను మార్చివేస్తుంది. ఆకాశవాణి, దూరదర్శన్, చలనచిత్రాలు, చరవాణులు ప్రభావం శక్తివంతమవుతుంది. అలాగే పల్లెటూళ్ళు క్రమంగా తగ్గిపోయి నగరవాసం పెరగడంతో జానపద వాఙ్మయప్రభావం నాగరీకులలో కూడా పెనుమార్పును తీసుకువచ్చింది. అలాంటి వాటిని గురించి పరిశోధన ఆసక్తిదాయకం. విజ్ఞానప్రదం.

నాగరీకులలో గాని, జానపదులలో గాని ఆధ్యాత్మికత భిన్నరూపాలలో కనిపిస్తుంది. కులాలలోని ఆచారవ్యవహారాలు, విశ్వాసాలు భిన్నం అయినా వాటిలోను 'విశ్వాసం' ఉంది. ఆరాధనాక్రమం వుంది. నాగరీకులు కూడా ఆశ్చర్యపడే జానపద కళాతీరులున్నాయి. వీటన్నిటికి సంబంధించిన పరిజ్ఞానాన్ని తి.తి.దే. సామాన్య ప్రజలకు అందజేయాలనుకొన్నది. ఈ ప్రయత్నంలో భాగమే ఆచార్య పులికొండ సుబ్బాచారి గారి 'జానపదుల ఆధ్యాత్మికత' పుస్తకం.

జానపదుల ఆధ్యాత్మికత ప్రవాహం లేని నదికాదని ఆ ఆధ్యాత్మికత సరికొత్త దీక్షలకు పురుడు పోసిందని అంతేగాక జానపదుల ఆధ్యాత్మికతలో మానవదైవాలున్నారని రచయిత అనేక ఉదాహరణలతో సరళమయిన భాషలో రచించారు.

ఇంతటి చక్కని గ్రంథాన్ని రచించిన రచయిత ఆచార్య పులికొండ సుబ్బాచారి గారికి హృదయపూర్వక ధన్యవాదాలు.

**– డా॥ ఆకెళ్ళ విభీషణశర్మ**

# విషయసూచిక


| | | పుట సంఖ్య |
|---|---|---|
| 1. | జానపదులు అంటే ఎవరు? జానపద విజ్ఞానం అంటే ఏమిటి? | 1 |
| 2. | ఆధ్యాత్మికత అంటే ఏమిటి? జానపదుల ఆధ్యాత్మికత అంటే ఏమిటి? | 6 |
| 3. | జానపదుల ప్రాక్తన ఆధ్యాత్మికత | |
| 4. | జానపదుల ఆధ్యాత్మికత తీరుతీయాలు | 14 |
| 5. | పూర్వపితృదేవతారాధన | 22 |
| 6. | జానపదుల ఆధ్యాత్మిక పురాణదేవతారాధన | 30 |
| 7. | వేంకటేశ్వరస్వామి జానపద అవతారాలు | 39 |
| 8. | పురాణదేవతలు - జానపదుల భక్తి | 50 |
| 9. | జానపద సంప్రదాయంలో సరికొత్త దీక్షలు | 70 |
| 10. | అమ్మతల్లుల ఆరాధన | 78 |
| 11. | నాగదేవతారాధన | 100 |
| 12. | శనిదేవతారాధన | 106 |
| 13. | వీరదేవతారాధన సంప్రదాయం | 111 |
| 14. | వీరారాధన - పల్నాటి వీరుల ఆరాధన | 118 |
| 15. | జానపదుల ఆధ్యాత్మికతలో మానవదైవాలు | 125 |

## జానపదులు ఎవరు?
## జానపద విజ్ఞానం అంటే ఏమిటి?

జానపదులు అంటే ఎవరు? జానపదవిజ్ఞానం అంటే ఏమిటి? అనే విషయాలపైన దాదాపు 70 సం॥లుగా మన దేశంలోనే కాదు ప్రపంచంలోని చాలా దేశాలలో విస్తృత చర్చ జరిగింది. దీనిపైన ప్రపంచ ప్రసిద్ధ విద్వాంసులు చాలా లోతైన సిద్ధాంత చర్చలు చేశారు. ఈ గ్రంథకర్త ఈ సిద్ధాంత చర్చలపైన ఒక ప్రత్యేక పుస్తకమే రచించాడు. అంత విస్తృత చర్చలు చేసి ఇక్కడ జానపదులు అంటే ఎవరు? అని చెప్పడం ఇక్కడి పరిమితుల ప్రకారం సాధ్యంకాదు. అయినా జానపదులు అంటే ఎవరు? ఎవరు జానపదులు కారు? అని ఇక్కడ క్లుప్తంగానైనా చెప్పాలి. అంతేకాదు, శతాబ్దాల క్రితమే అభివృద్ధి చెందిన, పారిశ్రామిక పాశ్చాత్య దేశాలలో ఉండే జానపదులు అనే భావన, భారతదేశంలో ఉండే జానపదులు అనే భావన ఒకటి కాదు. మన దేశంలో జానపదులు జానపద విజ్ఞానం, అక్కడి జానపదులు జానపద విజ్ఞానం కొంత భిన్నంగా ఉంటాయి. కానీ నిర్వచనాలు అన్ని దేశాలలో ఉన్న జానపదులకు జానపద విజ్ఞానులకు సర్వసాధారణంగా వర్తిస్తాయి. ఎవరు జానపదులు ఏది జానపద విజ్ఞానం అనే మాటలు పరస్పర ఆధారితాలు. ఎవరు జానపదులో నిర్ధారించకుండా వారి జానపదం ఎలా ఉంటుందో చెప్పడం సాధ్యం కాదు. పాశ్చాత్య దేశాలలో పందొమ్మిదో శతాబ్దిలో జానపదుల గురించి వచ్చిన ఆలోచనలు వేరు ఆ తర్వాత ఇరవైయవ శతాబ్ది మలిదశలో వచ్చిన ఆలోచనలు వేరు. వాటిని పరిశీలన చేద్దాం.

జానపదులు అంటే పల్లెలలో ఉండేవారని విద్యాగంధం లేనివారని, వారు ఆచరించే ఆచారాలు, వారు చెప్పుకునే కథలు, వారు పాడుకునే పాటలు, వారి ఆటలు, పండుగలు, పబ్బాలు అన్నీ కలిపి జానపదం అని

లేదా జానపద విజ్ఞానం అని ఒక భావన. 19వ శతాబ్ది వరకు 20వ శతాబ్ది తొలిరోజుల వరకు ఉండేది. ఇంగ్లీషులో ఫోక్, ఫోక్లోర్ అనే పదాలపైన కూడా విస్తృత చర్చ జరిగింది. జానపదం అనే భావనకు ఈ అధ్యయనానికి Fokllore అనే పదం మొదటిసారిగా 1846లో వినియోగంలోనికి వచ్చింది. అదేవిధంగా తెలుగులో జానపదానికి ఈ పేరు 20వ శతాబ్దిలోనే విశ్వవిద్యాలయాలలో ఈ సాహిత్యంపైన పరిశోధన జరగడం మొదలు కావవడంతోనే వినియోగంలోనికి, వ్యాప్తిలోనికి వచ్చింది. అప్పటిదాకా ఈ అధ్యయన విభాగానికి పదవాఙ్మయం, ప్రజావాఙ్మయం, మధురకవితలు, పల్లెపదాలు ఇలాంటి పదాలు ఆనాటి విద్వాంసులు వినియోగించారు. కానీ వీరందరూ జానపదులు అంటే పల్లెటూరివారు అని మౌఖిక సాహిత్యాన్ని సృష్టించేవారని విద్యాగంధంలేని వారు అని ఇలాంటి భావాలు సమాసంగా కలిగి ఉన్నారు.

విశ్వవిద్యాలయాలలో జానపదం పైన పరిశోధన 1952లో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఆచార్య బిరుదురాజు రామరాజుగారి పిహెచ్.డి పరిశోధనతో మొదలయింది. ఆ పరిశోధనలో భాగంగానే ఈ అధ్యయనానికి అప్పటిదాకా విద్వాంసులు పెట్టిన పేర్లను అన్నింటిని పరిశీలించి అవి అన్నీ కూడా జానపదానికి ఉన్న కొన్ని కొన్ని లక్షణాలను చెప్పగలిగాయని కానీ మౌలికతత్త్వాన్ని అవి చెప్పలేకపోయాయని ఆయన భావించారు. జానపదానికి ప్రాణభూతమైనది అందులో ఉండే ప్రాక్తనత్వమే అని, విద్యాగంధంలేని వారు మాత్రమే కాదు విద్యాధికులలో కూడా ఈ ప్రాక్తనత్వం ఉండవచ్చునని ప్రాక్తనత్వం ఉన్నవారు పల్లెలలోనే కాదు సగరాలలో కూడా ఉండవచ్చునని వారంతా కూడా జానపదులే అని చెప్పారు రామరాజుగారు. వీరు తమ పరిశోధన గ్రంథాన్ని మూడోసారి ప్రచురించిన సందర్భంలో అప్పటిదాకా ఉన్న పాశ్చాత్య భావనలను కూడా పరిగణనలోనికి

తీసుకున్నారు. జనపదం అంటే గ్రామం అని మాత్రమేకాక నగరం అనే అర్థం కూడా ఉందని ఆయన భావించారు. అంతేకాదు జానపదులు అంటే విద్యాగంధంలేని అమాయకులు అని మాత్రమే అనుకోవలసిన పని లేదని జానపదులు అంటే విద్యావంతులు అనే అర్థం సంస్కృతభాషలో ఉందని ఆయన ఉటంకించి చూపారు. "కృతయజ్ఞశ్చ మేధావీబుధో జానపదశ్శుచిః"[1] అనే వ్యాసభారతంలోని వాక్యాన్ని ఉటంకిస్తూ జానపదులను యజ్ఞము చేసినవారితోను పండితులతోను సమానంగా భావించినట్లు చెప్పారు.

పాశ్చాత్యులు చేసిన ప్రతి నిర్వచనంలో కూడా తరతరాలుగా వస్తున్న సంప్రదాయం అనే అంశం, ప్రధానంగా లేకుంటే జానపదం కానేరదు అనే భావం గట్టిగా ఉంది. ఈ రచయిత రాసిన గ్రంథం (జానపద శాస్త్ర నిర్వచనాలు – సిద్ధాంతచర్చ)లో పాశ్చాత్యులు చేసిన ప్రసిద్ధ నిర్వచనాలు అన్నింటిని తెలుగులో అనువదించి వాటిపైన సిద్ధాంత చర్చ చేశాడు. స్టాండర్డ్ డిక్షనరీ ఆఫ్ ఫోక్లోర్ మిథాలజీ అండ్ లెజెండ్ గ్రంథంలో అప్పటికి అందుబాటులోనికి వచ్చిన 21 నిర్వచనాలు ఒకచోట ఇచ్చారు. వీటి అన్నింటినీ తెలుగులో అనువదించి చర్చించాడు. ఈ అన్నింటిలోను జానపదం అంటే తరతరాలనుండి సాంప్రదాయికంగా వస్తున్న విజ్ఞానమే జానపద విజ్ఞానం అని భావించారు. అలన్ డండెస్, డాన్ బెన్ అమోస్ చేసిన నిర్వచనాలు ఈనాడు ప్రపంచవ్యాప్తంగా ఈ అధ్యయన రంగంలో విస్తృతంగా వినియోగంలో ఉన్నాయి. ఈ రెండింటిలో కూడా tradition అనే భావనకు గట్టి ప్రాధాన్యాన్ని ఇచ్చారు. వీటిని అన్నింటిని పరిశీలించినప్పుడు జానపదంలో ప్రాక్తనత్వం అనే భావన చాలా ప్రాముఖ్యం కలిగినది అని మనకు స్పష్టం అవుతున్నది. ఈ ప్రాక్తసత్వాన్ని నింపుకున్నదే 'జానపదం' అని ఆచార్య రామరాజుగారు చెప్పిన నిర్వచనం ప్రాచ్య పాశ్చాత్య భావనలలో ఉన్న సామ్యాన్ని తెలుపుతున్నది. కన్నడభాష వారు కూడా జనపద, జానపద అనే పారిభాషిక పదాలనే వినియోగిస్తారు.

అయితే ప్రాక్తనత్వ భావనలు వ్యక్తుల ఆచార వ్యవహారాలలో నిత్యజీవితంలోని పనులలో ఉంటే ఆ వ్యక్తి జానపదత్వాన్ని కలిగి ఉన్నాడనే భావించాలి. ఇంతటి అత్యాధునిక నాగరికతలో కూడా జానపద నమ్మకాలు చాలా బలీయంగా వ్యక్తుల జీవితాన్ని నియంత్రించి అదుపులో పెడతాయి. ఒక చిన్న ఉదాహరణ – ఏదైనా పనికి బయల్దేరినప్పుడు ఎవరైనా తుమ్మితే ఏదో అనర్థం జరుగుతుందని కాస్సేపు ఆగి కూర్చొని మంచినీళ్ళు తాగితే ఆ దోషం పోతుందని ఒక ఆచారం ఉంది. అంతేకాదు పనిమీద బయటికి రాగానే పిల్లి ఎదురైతే అది పెద్ద ప్రమాదానికి దారితీస్తుందని నేటికి ఎంతటి విద్యావంతులైనా నమ్ముతారు. ఈ జానపద నమ్మకాలు రాజశాసనం కన్నా బలీయమైనవి. ఇది ఆధునికతలో నిలిచిన ప్రాక్తనత్వం. ఇదే జానపదవిజ్ఞానం అని మనం అంటున్నాము.

అయితే జానపదం అనేది ఒక విజ్ఞాన పేటిక, ఒక కళ అని ఒక ప్రసార మాధ్యమాన్ని కలిగి ఉంటుందని ప్రముఖ శాస్త్రజ్ఞులు అందరూ చెప్పారు. కళారహితమైన వ్యక్తీకరణలు అన్నీ జానపదంలోనికి రావు. వృత్తి విద్యలు అన్నిరకాల కళలు జానపద సాహిత్యం అన్నీ కూడా మౌఖిక మాధ్యమం నుండే తరం నుండి తరానికి అంది వస్తాయి. మౌఖిక మాధ్యమం కాకుండా ఇతర మాధ్యమాలలోనికి చేరినది జానపదం కాకుండా పోతుంది. విద్యావంతులైనవారు లిఖిత పూర్వకంగా సృష్టించేది జానపదం కాదు. ఈ గ్రంథరచనలో మనం గ్రహించేది అంతా కూడా మౌఖిక ప్రసారంలో అలిఖితంగా ఉండే ఆధ్యాత్మిక సంప్రదాయాలనే అనే విషయాన్ని ఇక్కడ గుర్తు పెట్టుకోవాలి. అంతే కాదు జానపద సాహిత్య సృష్టి అనేది ఒక వ్యక్తితో మాత్రమే జరిగేది కాదు. ఒక గేయం కానీ కథ తొలుత ఎవరు సృష్టించారో తెలియదు. అంటే జానపద సాహిత్యం అంతా అజ్ఞాత కర్తృత్వం అనే విషయం కూడా గుర్తు పెట్టుకోవాలి. ఒక వ్యక్తి పాడిన భక్తిపాట మరో వ్యక్తి, ఇంకో వ్యక్తి ఇలా వందలాదిమంది ద్వారా పునఃసృజనం పొందుతూ

సామూహిక పునఃసృజనం అనే లక్షణాన్ని జానపద సాహిత్యం కలిగి ఉంటుంది. ఇలాంటి సాహిత్యాన్ని ఇక్కడ ఈ గ్రంథంలో పరిశీలనకు వస్తుందని ఇక్కడ పాఠకులు గ్రహించాలి.

జానపదుల ఆధ్యాత్మికత అనే అంశాన్ని ఇక్కడ పరిశీలించి అధ్యయనం చేసేటప్పుడు ఇక్కడ పైన చెప్పుకున్న జానపదులకు సంబంధించిన ఆధ్యాత్మికతను గురించి అధ్యయనం చేస్తామని ఇక్కడ గ్రహించాలి. అంతేకాదు ఇలాంటి జానపదులు కేవలం పల్లెలలోనే కాకుండా పెద్ద నగరాలలో కూడా ఉండవచ్చు. భారతదేశంలో జానపదాన్ని అధ్యయనం చేసేవారికి మానవశాస్త్రజ్ఞులకు మన పెద్ద నగరాలన్నీ పెద్ద పల్లెలతోనే సమానం అని భావిస్తారు. మనకున్న పెద్దనగరాలు ఢిల్లీ, ముంబాయి, కోల్‌కతా, మద్రాసు, హైదరాబాదు నగరాలలో సైతం పల్లెలలో ఉన్నంత జానపదం ఉంది. ముఖ్యంగా ఆచారకాండకు సంబంధించి జానపదవిజ్ఞానం నగరాలలో చాలా విస్తృతంగా ఉంది. బోనాలపండుగ కానీ బతుకమ్మ పండుగ కాని పల్లెలలో ఎంత భక్తిశ్రద్ధలతో చేస్తారో హైదరాబాదు నగరంలో కూడా అదే జానపదత్వంతో బోనాలపండుగ ఆచరిస్తారు. పల్లెలో వాడే మట్టి కుండకు బదులు ఇక్కడ ఇత్తడి పాత్రని వాడుకోవచ్చు. నగలు ఎక్కువగా పెట్టుకోవచ్చు. ఇంకా కొన్ని పైపై మార్పులు ఉండవచ్చు. కానీ ఆచారం తత్త్వం అంతా ఒకటే. పల్లెలలో బలి ఎలా ఉంటే నగరాలలో కూడా అలాగే ఉంటుంది. కరీంనగర్ జిల్లా గ్రామంలో ఇచ్చే బలి, కలకత్తా కాళికకు ఇచ్చే బలి రెండూ ఒకటే రెండూ సమానంగా జానపదమే. ఇతర అభివృద్ధి చెందిన దేశాలలో ఉన్న జానపదానికి మన భారత దేశంలో ఉన్న జానపదానికి ఉన్న తేడా ఇదే. అక్కడ జానపద ఆచారాలు అంతమై ఎక్కడో అంతర్గతంగా నమ్మకాల వ్యవస్థలో భాగంగా అవశేషాలుగా అక్కడ మిగిలి ఉండగా మన దేశంలో ఇంకా పటిష్ఠమైన నమ్మకాలతో ఈ ఆచార కాండ కొనసాగుతున్నది. అందుకే ఇక్కడ 21వ శతాబ్ది ఆధునిక నగరాలలో కూడా ప్రాక్తనత్వాన్ని నింపుకున్న

జానపదం అంతరస్థాయిలోనే కాక బహిర్ విషయికంగా కూడా జానపదం గట్టిగా నిలిచి ఉంది.

## ఆధ్యాత్మికత అంటే ఏమిటి

## జానపదుల ఆధ్యాత్మికత అంటే ఏమిటి?

అధి+ఆత్మ= అధ్యాత్మ ఈ పదానికి 'తద్ధితరూపం' ఆధ్యాత్మికత అవుతుంది. ప్రస్తుత సందర్భంలో ఆత్మ అధ్యాత్మ వంటి లోతైన వేదాంత విషయాలు గహనంగా చర్చించడం వీలు కాదు కానీ ఆధ్యాత్మిక అంటే మనస్సుకు శరీరానికి సంబంధించినది అని ఈ రెండింటి సమ్మేళనం అని ఈ మనస్సు శరీరం వల్ల కలిగే సుఖం దుఃఖం అన్నింటిని ఆధ్యాత్మిక అని అంటారు. దీనికి సమానంగా ఇంగ్లీషులో spirituality అనే పదానికి సమానార్థకంగా వినియోగంలో ఉంది. ఇవి నైఘంటిక అర్థాలు. కానీ సాధారణ వ్యవహారంలో ఆధ్యాత్మికము అన్నా, ఆధ్యాత్మిక చింతన అని అన్నా భక్తి అని పరమాత్మగురించిన చింతన అనే భావాలు వ్యాప్తిలో ఉన్నాయి.

జీవుడు భౌతిక దేహం కాదని ఆధ్యాత్మిక కణమని భగవద్గీత రెండో అధ్యాయంలో ఉన్నది. పరతత్త్వమే ఆధ్యాత్మిక పూర్ణతత్త్వము. జీవుడు ఆ పూర్ణతత్త్వము యొక్క అంశమని అతడు తన శ్రద్ధనంతా పూర్తిగా ఈ తత్త్వము వైపునకే మళ్లించాలని గీతాచార్యుడు ఏడవ అధ్యాయంలో చెప్పాడు. దేహాన్ని విడిచే సమయంలో పరమాత్మని లేదా శ్రీకృష్ణుని స్మరించేవాడు శీఘ్రమే ఆధ్యాత్మికాశానికి చేరుకుంటాడని అంటే కృష్ణలోకానికి చేరుకుంటాడని ఎనిమిదో అధ్యాయంలో చెప్పబడింది. ఆత్మలో తననే (పరమాత్మనే నిరంతరం తలచేవాడు యోగులందరిలో పరిపూర్ణుడని ఆరవ అధ్యాయంలో వక్కాణించబడింది. సాకార రూపానికే మనిషి ఆసక్తుడై ఉండాలని గీత ప్రతి అధ్యాయంలో చెప్పింది. అదే అత్యున్నతమైన ఆధ్యాత్మిక అనుభూతి.[2] ఆధ్యాత్మిక అనుభూతి అంటే భక్తియే అని భగవద్గీత స్పష్టంగా చెబుతున్నది.

మోక్షచింతన, ఆధ్యాత్మిక చింతన, పరమాత్మ చింతన ఇది మూడు మార్గాల ద్వారా పొందుతారని హిందూ వేదాంతము చెబుతున్నది. అవి భక్తి, జ్ఞాన కర్మలు అని అంటారు.

"భారతదేశంలోని హిందూమతంలో సంపూర్ణమైన మతస్వాతంత్ర్యాన్ని విస్తారంగా చూడవచ్చు. మతసాధనలను స్వేచ్ఛగా అనుష్ఠించే యోగులు భారతదేశంలో అడుగడుగునా కనిపిస్తారు. ముక్తి కలగాలంటే పరమాత్మ యొక్క అపరోక్షానుభూతి ఎంతో అవసరం. హిందూమతం ప్రకారం ముక్తి అంటే అజ్ఞాన దుఃఖాలు ఏమాత్రం దరిజేరని స్థితి. ముక్తి లభించనంత కాలం మనిషి మళ్ళీ మళ్ళీ పుట్టి జీవితం ఇచ్చే తీపి, చేదు అనుభవాలను పొందుతుంటాడు. ఆధ్యాత్మిక పరిపూర్ణత కోసం వివిధ మార్గాలను లోతుగా శోధించి, ఆధ్యాత్మికతను ఒక శాస్త్రంగా రూపొందించింది హిందూ మతంలోనే. ఆధ్యాత్మిక అనుభూతి కోసం హిందూమతం నాలుగు ముఖ్యమార్గాలను ప్రతిపాదిస్తుంది. వీటిని యోగాలు అంటారు. ఇవి కర్మయోగం, రాజయోగం, భక్తియోగం, జ్ఞానయోగం.[3]

**కర్మయోగం :** దీనిప్రకారం మనం చేసే కర్మలను అంటే సంకల్పాన్ని కర్మఫలాల నుండి వేరు చేయడమంటే ఇదే. అయితే ఇది అనుకున్నంత సులభం కాదు. దీనికి ఎంతో సంకల్ప శక్తి కావాలి. దీని అనుష్ఠానానికి ఒక సులభమైన ఉపాయం ఉంది. అది ఏమిటంటే కర్మఫలాలను పరమాత్మకు అర్పించడమే. మొత్తం విశ్వం పరమాత్మకు చెందినదే. కాబట్టి మనం అనని కోర్కెలను పూర్తిగా త్యజించాలి. వైరాగ్యం ప్రపత్తుల ద్వారా మనస్సు పవిత్రమైనప్పుడు అంతరాత్మ బహిర్గతమై ప్రకాశిస్తుంది.[4] ఈ కర్మయోగం పరిణతి పొందిన సాధకులకు సాధ్యం అని తెలుస్తుంది. ఇది జానపదులకు చెందిన ఆలోచన కాదు.

**రాజయోగం :** దీన్నే ధ్యానమార్గం అని కూడా అంటారు. మనస్సులో ఇంద్రియార్థాలను గురించి వచ్చే ఆలోచనలను నిగ్రహించి, మనస్సును

ఉన్నత మార్గంలో పయనించేలా చేయడమే దీనిలోని ముఖ్యసాధన. అత్యధిక సంఖ్యాకులకు ఇది ఒక అసంభవమైన అద్భుతకృత్యం. ఈ సాధన చేయడానికి ముందుగా శరీరాన్ని సమాయత్తం చేయాలి. అలా చేయకుండా సాధన చేయడంవల్ల విపరీత పరిణామాలు కలుగవచ్చు. కాబట్టి యోగశాస్త్ర నిర్మాతలలో ముఖ్యుడైన పతంజలి దీనిని క్రమంగా హెచ్చుతూ పోయే అనుక్రమణిక రూపంలో తయారు చేశాడు. ఈయన రూపొందించినదే యమ నియమాలతో కూడిన అష్టాంగయోగం. అహింస, సత్యపాలన, బ్రహ్మచర్యం, అస్తేయం, అపరిగ్రహం అనే విలువలను ఎల్లప్పుడూ పాటించాలి. శారీరక, మానసిక పరిశుభ్రతలను పాటిస్తూ ఆత్మసంతృప్తితో మనమీద మనం ఆధారపడడం నేర్చుకోవాలి. ఆధ్యాత్మిక గ్రంథపఠనం, అలా పఠించిన భావాలను చింతన చేసి జీర్ణించుకోవడం కర్మఫలాలను సంపూర్ణంగా భగవదర్పితం చేయడం సాధన చేయాలి. బాహ్యమైన ఆకర్షణలనుండి మనస్సును వెనక్కు మళ్ళించడం, ఆధ్యాత్మిక భావన మీద ధ్యాస నిలపడం అనేవి ఈ సాధనా క్రమంలో తర్వాతి రెండు మెట్లు. ఏకాగ్రత గాఢమైనప్పుడు ఆత్మానుభవం కలుగుతుంది.[5] ఈ రాజయోగమార్గం జానపదులకు చాలా దూరమైనది. జానపద సంప్రదాయంలోని వ్యక్తులలో ఈ మార్గాన్ని అనుసరించేవారు మృగ్యం అనే చెప్పాలి.

**జ్ఞానయోగం :** దాన్ని సాధారణంగా భక్తియోగం తర్వాతనే చెబుతారు. జ్ఞానయోగం ద్వారా ఆధ్యాత్మికానుభూతిని సాధించడానికి ఉన్నతమైన నైతిక విలువలు, యోగ్యతలు అవసరం. అత్యధికమైన ఆత్మసంయమనం, అనంతమైన ఓరిమి, అఖండమైన విశ్వాసం, అవిచ్ఛిన్నమైన ఏకాగ్రత అవసరం. ఏది శాశ్వతమో, ఏది అశాశ్వతమో తన వివేచనతో ఎఱిగి ఇహపరాలలో దొరికే అన్ని సుఖాల మీద ఏమాత్రం కోరిక లేకుండా, ముముక్షుత్వాన్ని అంటే మోక్షం కోసం పడే తపన కలిగి ఉండాలి. ఈ విధమైన సాధకులు బహు కొద్దిమంది మాత్రమే ఉంటారు. జానపద సమాజంలో అత్యంత అరుదుగా కనిపిస్తారు.

జ్ఞానం అంటే పాండిత్యం కాదు. ఉపనిషత్తులలో రెండురకాల విద్యలను గురించి వివరించబడింది. ఒకటి తక్కువ స్థాయిలో ఉన్న అపరావిద్య. రెండు హెచ్చుస్థాయిలో ఉన్న పరావిద్య. ఇంద్రియాలకు దృగ్గోచరమయ్యే జ్ఞానం, ఆ జ్ఞానం ఇచ్చే సూచనలను అపరావిద్య అంటారు. పరమసత్యం యొక్క అపరోక్షానుభూతినే పరావిద్య అంటారు. జ్ఞానయోగం యొక్క గమ్యం ఈ అపరోక్షానుభూతి మాత్రమే కానీ తత్త్వశాస్త్రంలో ఉండే వివిధ విషయాలపైన వాదోపవాదాలు కాదు.[6]

**భక్తియోగం :** భక్తియోగంలో కూడా క్రమశిక్షణ చాలా అవసరం. మానవ మస్తిష్కంలో చెలరేగే భావప్రకంపనలను భగవంతుని వైపు మళ్ళించే ప్రక్రియకు దీనిలో ప్రాముఖ్యం హెచ్చుగా ఇవ్వబడింది. ప్రాపంచిక విషయాలపైనున్న మమతానురాగాలను దైవం మీద ప్రేమ భక్తి పరివర్తనం చేయాలి. భగవంతుడిని అన్ని కాలాలలో అన్ని అవస్థలలో స్మరిస్తూ ఉండాలి. దీన్ని సాధించడం కోసం భక్తుదు భగవంతుని జ్ఞప్తికి తెచ్చే పాటలు పాడాలి. మంత్రాలు ఉచ్చరించాలి, సంకీర్తన చేయాలి. ఇవన్నీ కూడా భగవత్ స్మరణకే ఉపయోగపడతాయి. వీటి సహాయంతో ఎల్లప్పుడూ దైవచింతన చేయాలి. అప్పుడు భగవత్కృప వలన ఆధ్యాత్మిక జీవితంలోని అన్ని అడ్డంకులు తొలగిపోతాయి. భగవత్సాక్షాత్కారం పొందుతారు భక్తులు.[7]

భగవద్గీత భక్తిమార్గమే శ్రేష్ఠమార్గమని చెప్పింది. అర్జునునకు ఉపదేశించిన మార్గంలో సాకార భక్తిమార్గము ఉత్తమమైనదని “నిత్యం తనను సేవించేవారు భక్తిమార్గాన్ని పాటించినవారు తనలో ఐక్యమౌతారని భక్తియోగం వేర్వేరు శ్లోకాలలో చెబుతున్నది. భగవంతుని భక్తియుత సేవ ద్వారా ప్రత్యక్షంగా పూజించేవారు సాకారవాదులని అంటారు. నిరాకార బ్రహ్మ ధ్యానములో ఉండేవారు నిరాకారవాదులని పిలువబడతారు. వీటిలో ఏది ఉత్తమమైనది అని అర్జునుడు పరమాత్మని అడిగినప్పుడు పరతత్త్వానుభూతికి నానా మార్గాలు ఉన్నా భక్తియోగమే, భక్తియుత సేవయే

అన్నింటికన్నా ఉత్తమమైనదిని శ్రీకృష్ణపరమాత్మ భక్తియోగంలో చాలా స్పష్టంగా చెప్పాడు. ఇది ప్రత్యక్షమైనది భగవత్సాంగత్యానికి అత్యంత సులభమైన మార్గం.[8]

భగవద్గీతలోనేకాక భక్తికి సంబంధించిన చాలా నిర్వచనాలు మన ఆధ్యాత్మిక సాహిత్యంలో కనిపిస్తాయి. ఇందులో నారదభక్తి సూత్రాలు ప్రముఖమైనవి. భగవంతుని గురించి నిజమైన నిష్కళంకమైన అన్వేషణయే భక్తియోగం. ఇది ప్రేమలో జనించి, ప్రేమలో వికసించి, ప్రేమలో లయిస్తుంది. ఉత్కృష్టమైన ఇలాంటి భగవతేమోన్మాదం క్షణమాత్రం లభించినా అది మనకు శాశ్వత మోక్షాన్ని ఒనగూరుస్తుంది. భక్తి సూత్రాలను ఉగ్గడిస్తూ నారదుడు భగవంతుని పట్ల పరమమైన ప్రేమయే భక్తి **(సా త్వస్మిన్ పరమ ప్రేమరూపా)** అని నిర్వచించాడు. (నారద భక్తిసూత్రము 12.)

అలాంటి భక్తి లభించిన వ్యక్తి సమస్తాన్ని ప్రేమిస్తాడు. దేన్నీ ద్వేషించడు. నిత్యసంతుష్టుడౌతాడు. ఈ ప్రేమను ఏ ఐహిక లాభస్థాయికి దింపలేము. లౌకిక విషయ వాంఛలున్నంతవరకు అలాంటి భగవత్ప్రేమ ఎన్నటికీ జనింపదు. కర్మకంటే, జ్ఞానంకంటే, యోగంకంటే భక్తి అత్యున్నతం. కారణం ఇవన్నీ ఏదో ఒక ప్రయోజనాన్ని ఉద్దేశించేవి. భక్తి అంటే దానికదే ప్రతిఫలం. అదే సాధన అదే సాధ్యమూ.[9]

భక్తి మార్గంలోని గొప్ప లాభం ఏమిటంటే అది పరమావధిని పొందడానికి ఎంతో సహజమైన సులభమైన మార్గం. భక్తి మార్గాలు తొమ్మిది మార్గాలు అని హిందూ వేదాంతం ఆధ్యాత్మిక సాహిత్యం తెలుపుతుంది. వ్యాసభాగవతం వీటిని చెప్పింది.

**శ్రవణం కీర్తనం విష్ణోః, స్మరణం పాదసేవనం ।**
**అర్చనం వందనం దాస్యం సఖ్యమాత్మ నివేదనమ్ ॥**[10]

పోతన ఈ తొమ్మిది భక్తి మార్గాలను తన భాగవతంలో వివరించాడు. భాగవతం అంతా కూడా ఈ భక్తిమార్గాన్ని అనుసరించిన మహాభక్తుల కథలే అని వేరే చెప్పవలసిన పనిలేదు. ఈ భక్తి మార్గాలను కింద గమనించవచ్చు.

**తనుహృద్భాషల సఖ్యమున్ శ్రవణమున్ దాసత్వమున్ వందనా**
**ర్చనముల్ సేవయు నాత్మలో నెఱుకయున్ సంకీర్తనల్ చింతనం**
**బను నీ తొమ్మిది భక్తిమార్గముల సర్వాత్మున్ హరిన్ నమ్మి స**
**జ్జనుఁడై యుండుట భద్రమంచుఁ దలతున్ సత్యంబు దైత్యోత్తమా!**[11]

తనువు, హృదయము, మాట్లాడే భాషకు మధ్య ఐకమత్యం అంటే దేహము, ఆలోచన, మాట్లాడే మాట ఒకటిగా ఉండడం, శ్రవణము అంటే భగవంతుని గురించి ఔన్నత్యం గురించి వినడం, దాసుడుగా మారడం, వందనం, అర్చనం, సేవ, ఆత్మలో భగవంతునికి చెందిన జ్ఞానం, సంకీర్తన, చింతనం అనే ఈ తొమ్మిది విధాలైన మార్గాలు అనుసరించే పద్ధతులు అన్నీ భక్తికి చెందిన మార్గాలు.

భగవద్భక్తి అంటే ఏమిటో ఈ గ్రంథ పరిమితిని బట్టి ఇంతకన్నా వివరంగా చూడవలసిన అవసరం లేదు. జానపదులలో ఉన్న ఆధ్యాత్మికత ఈ భక్తి యోగానికి చెందినదే. అది ఎన్నో విధాలుగా ఉంటుంది. సాకార నిరాకార భక్తిమార్గాలు కూడా జానపదులలో ఉన్నాయి. అంతేకాదు కర్మమార్గాన్ని జ్ఞానమార్గాన్ని కూడా అనుసరించి ముముక్షువులైన యోగులు కూడా జానపదులలో జానపద సమాజంలో ఉన్నట్లు ఎందరో యోగులకు చెందిన కథలు మనకు తెలుస్తున్నాయి. ఆంధ్రయోగులు అనే పేరిట జానపద సమాజంలో ఉన్న కొన్ని వందలమంది యోగుల చరిత్రలను ఆచార్య రామరాజు గారు రచించారు. ఎనిమిది సంపుటాలుగా ఇవి ప్రచురితం అయినాయి. యోగులు జానపద సమాజాన్ని బాగా ఆకర్షించి వారికి ఆధ్యాత్మిక చింతన బలంగా కలగడానికి తోడ్పడ్డారు. కర్మయోగం జ్ఞానయోగం

సంన్యాసయోగం అనేవి జానపద సమాజంలో ఉన్నా అత్యధికులు జానపదులు అయిన వారు అనుసరించే మార్గం భక్తి మాత్రమే. దేవి, దేవతలు గ్రామదేవతలు, భగవంతుని అవతారంగా చెప్పే మానవులు, త్యాగం చేసి అమరులైన పుణ్యస్త్రీలు, పురుషులు, యోగులు, చెట్లు, పుట్టలు ప్రకృతి శక్తులు అన్నీ కూడా జానపదుల భక్తికి యోగ్యమైనవే.

దాసభక్తి. ముగ్ధభక్తి, మూఢభక్తి, జ్ఞానభక్తి. సంపూర్ణ శరణాగతికి చెందిన భక్తి ఇవన్నీ కూడా జానపదులలో కనిపిస్తాయి. ఇలాంటి భక్తి కలిగిన వారు పురుషులేకాక స్త్రీలు కూడా కనిపిస్తారు. తనకు తానే దేవి దేవతలుగా మారిన స్త్రీలు పురుషులు కూడా జానపద సమాజంలో ఉన్నారు. ఈ భక్తిమార్గాలు జానపదులకున్న మోక్షమార్గాలు అన్నీ కూడా జానపదుల ఆధ్యాత్మికతనే తెలియజేస్తాయి. ఈ గ్రంథంలో ఇలాంటి జానపదుల ఆధ్యాత్మికతను అధ్యయనం చేద్దాం.

జానపదుల ఆధ్యాత్మికత అత్యంత ప్రాక్తనమైనది. అది ఎంత ప్రాచీనమైనది అంటే అది మానవుడు ఎంత ప్రాచీనుడో అంత ప్రాచీనమైనది. ఇంకా భాష కూడా రాని ప్రాఙ్మానవుడికి కూడా ఒక ఆధ్యాత్మిక భావన ఉన్నది. తనచుట్టూ ఉన్న ప్రకృతి శక్తులు వాటిపల్ల అతనికి లేదా ఆమెకు కలిగిన సుఖము, దుఃఖము, సౌకర్యము అసౌకర్యము ఇవన్నీ కూడా అతని అత్మకు మించి అది ఆత్మను గురించి ఆలోచింపజేసినాయి.

గాలి, నీరు, నిప్పు, భూమి (తనకు, ప్రాణికి ఆధారము) నింగి (వర్షాన్నిచ్చే శక్తి అని భావించాడు) ఇవి అన్నీ తనకు అతీతంగా ప్రవర్తించేవి అని వీటినే తొలినాటి ప్రకృతి శక్తులనే దేవతలు అని భావించి ఆరాధించాడు ప్రాక్తన మానవుడు. సూర్యచంద్రులను పూజించడం, వర్ష దేవతను పూజించడం, వర్షం రాకుంటే రావాలని పూజించడం. నదులు పొంగి, సముద్రాలలో బడబానలం ఎగసి మానవాళి పైన విధ్వంసం చేస్తుంటే అదే

గంగని శాంతించమని పూజించడం, భూమిని తల్లిగా పూజించడం, చెట్టుని పూజించడం, చెట్టునే దేవతగా ఆరాధించడం, చనిపోయిన తల్లిదండ్రులను మనుషులను పూజించడం నేటికీ జానపదులు చేస్తున్న ఆచారకాండలో భాగం. ఈ ప్రకృతి శక్తుల ఆరాధన అత్యంత ప్రాక్తన మానవుడు చేసిన ఆరాధనే. తన ఆత్మశక్తికి అతీతమైన ఈ శక్తులను మనిషి అధి ఆత్మగా భావించి పూజించాడు. ఇదే తొలి ఆధ్యాత్మికత లేదా మానవశాస్త్రం ఇతర శాస్త్రాలు చెప్పే spirituality. మానవ శాస్త్రజ్ఞుల ఆలోచనల ప్రకారం ఈ అత్యంత ప్రాక్తనమైన ఈ ఆధ్యాత్మిక ఆలోచనలు ఇటీవలి 500 సం॥ల క్రితం దాకా కూడా ఐరోపా ఇతర ఖండాలలో ఉన్నాయి అని చెప్తారు.[12] కానీ భారతదేశంలో ఈ ప్రాక్తన ఆచారకాండ నేటికీ కనిపిస్తూ ఉంది. అందుకే ప్రపంచ మానవ శాస్త్రజ్ఞులు ఎందరో భారతీయ సమాజాన్ని ఇక్కడి మతవిశ్వాసాలను అధ్యయనం చేయడానికి ఆసక్తి కనబరిచారు. ప్రాముఖ్యాన్నిచ్చి ఇక్కడ మానవశాస్త్ర అధ్యయనాలు చేశారు. ప్రాక్తన మానవుని ఆచారకాండను తెలిపే ఆచారకాండ నమ్మకాలు నేటికీ మన జానపదుల ఆచారకాండలో ఎలా ఉన్నాయో తెలిపే ఉదాహరణలు కొన్నింటిని మనం పరిశీలన చేద్దాం. ప్రాక్తన అంశాల అవశేషాలు, ఎలా నేటికీ కనిపిస్తాయో తెలిస్తే చాలా ఆశ్చర్యం కలుగుతుంది.

నియాండర్ల్స్ అని పిలిచే ప్రాచీన మానవులు 30,000 నుండి 2,50,000 సంవత్సరాల వెనుక ప్రాంతంలో ఐరోపాలోను మధ్య ప్రాచ్యంలోను నివసించారని పురాతత్త్వశాస్త్రజ్ఞులు వివరించారు. ఈ కాలంలో కూడా స్త్రీ పురుషులను మరణానంతరం సమాధి చేయడాన్ని గమనించారు. అయితే ఆనాటికే ఆ స్త్రీ పురుషులు బతికి ఉన్నప్పుడు వినియోగించిన రాతి పనిముట్లు, రాతి ఆయుధాలు వారితోపాటు బొందలో వేయడం వారు గమనించారు.

మానవులు చనిపోయినప్పుడు వారిని ఖననం చేసేటప్పుడు పాటించిన ఆచారాల ఉనికిని పురాశాస్త్రజ్ఞులు గుర్తించారు. నియాండర్తల్ కాలంలో సాపేక్షంగా 30,000 సంవత్సరాల నుండి 60,000 సంవత్సరాల వెనుక కాలంలో కూడా ఖననం చేసినప్పుడు కొన్ని ఆచారాలు పాటించినట్లు ఆధారాలు ఉన్నాయని పురాతత్త్వవేత్తలు చెప్పారు.[13]

వేల సంవత్సరాలకు చెందిన గుహాచిత్రాలలో కూడా కొన్ని వేట చిత్రాలు వేటసమయంలో పాటించే ఆచారాలకుచెందిన చిత్రాలను శాస్త్రజ్ఞులు గుర్తించారు.

ఇక్కడ చెప్పిన ఈ నమ్మకాలు ఆచారాలు అన్నీ కూడా కనీసం నాలుగు వేల సంవత్సరాల క్రితం ఆచారాలుగా ప్రాచీన మానవుల ఆచారాలతో సరిసమానంగా ఉండడాన్ని మనం గమనించవచ్చు. దీన్నిబట్టే ప్రాచీన మానవుల ఆచారకాండ ఆధ్యాత్మికత జానపదుల ఆధ్యాత్మికతలో నేటికీ దాగి ఉండడాన్ని మనం గమనించవచ్చు.

దీన్నిబట్టి జానపదులు ఆత్మను గురించిన పరాత్మను గురించిన చింతన అత్యంత ప్రాక్తనమైనదని ఈ ఆధ్యాత్మిక చింతన నేటికీ అవశేషాలుగా మన జానపద సంస్కృతిలో నిలిచి ఉందని అర్థం చేసుకోవచ్చు. ఇంకా జాతరలు, గ్రామదేవతల ఆరాధన ఇతర ఆచార కాండలలో విస్తృతంగా జానపదుల ఆధ్యాత్మికత భక్తి ఎలా ఉందో విపులంగా చూద్దాం.

## జానపదుల ఆధ్యాత్మికత తీరుతీయాలు

పట్టణాలలో అక్కడక్కడా కానీ ప్రయాణాలలో బస్సులు రైళ్ళలో కానీ కాగితాలను కనీసం న్యూస్ పేపర్లలో తడి తినుబండారాలు కట్టడం, అవాంఛనీయంగా తుడుచుకోవడానికి వాడడం, బెర్తులమీద న్యూస్ పేపర్ దుప్పటిలా పరుచుకొని దానిపైన పడుకోవడం ఇలాంటి పనులు మనకు కనిపిస్తుంటాయి. కానీ నేటికీ పల్లెలలో నడిచేటప్పుడు కానీ ఇతర

సందర్భాలలో కాని చిన్న కాగితం ముక్క కాలికి తగిలితే అయ్యే అని దీన్ని చేతికి తీసుకొని కళ్ళకు అద్దుకొని చెంపలు వేసుకుంటారు. పిల్లలు తెలియక అలా చేయకుండా, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే పక్కనున్న పెద్దలు వారించి కాగితం సరస్వతీదేవి చేత్తో తీసుకొని కళ్ళకు అద్దుకో లేకపోతే కళ్ళుపోతాయ్ పాపం తగులుద్ది అని చెప్తారు. ఇది నేటికీ బలమైన నమ్మకం. ఇది జానపద సమ్మకాలవ్యవస్థ folk belief system లో ఒక భాగం.

దేవుళ్ళ పేర్లను తప్పుగా పలికినా ఎగతాళిగా పలికినా కించపరిచినా పెద్దలు పిన్నలను చాలా తీవ్రంగా హెచ్చరిస్తారు. 'చెంపలేసుకో వెధవా. దేవుణ్ణి అలా అంటే కళ్ళు పోతాయ్ పాపం' అని హెచ్చరిస్తారు. కుత్రతరాన్ని వారిస్తారు. ఇలాంటి నమ్మకాలు ఎన్నెనా ఉంటాయి. దేవుడు అనే భావన చుట్టూ ఇలాంటి ఎన్నో సందర్భాలలో చాలా బలమైన నమ్మకాల వ్యవస్థ ఉంది.

జానపదుల ఆధ్యాత్మికత అంటే ప్రధానంగా భక్తి. అయితే ఈ భక్తి అనేది సంస్కృత సాహిత్యంలో కానీ అలంకార శాస్త్రం చెప్పిన రీతిలో కానీ కేవలం నవవిధ భక్తిమార్గాలే కాక ఇంకా చాలా విధాలుగా ఉంటుంది.

ఈ తొమ్మిది విధాలైన భక్తిమార్గాలు ఏమిటో ఉపోద్ఘాతం అధ్యాయంలో చూచాము. ఒకే దేహము, ఆలోచన, మాట్లాడే మాట ఒకటే ఉండడం, శ్రవణము అంటే భగవంతుని గురించి ఔన్నత్యం గురించి వినడం, దాసుడుగా మారడం, వందనం, అర్చనం, సేవ, ఆత్మలో భగవంతునికి చెందిన జ్ఞానం, సంకీర్తన, చింతనం అనే ఈ తొమ్మిది విధాలైన మార్గాలు. ఈ తొమ్మిది విధాలైన భక్తి తీరులలో భగవంతునికి చెందిన జ్ఞానంలో విషయంలో వ్యక్తికి వ్యక్తికి మధ్యన స్థాయీభేదాలు ఉండవచ్చు. ఇక మిగతా ఎనిమిది భక్తిమార్గాలు జానపదుల ఆధ్యాత్మికతలో కనిపిస్తాయి. ఈ ఎనిమిది భక్తిమార్గాలు నేటి జానపదుల ఆధ్యాత్మికతలోనే కాక చారిత్రకంగా చూచినా శతాబ్దాలనాటి జానపదుల గిరిజనులలో కూడా ఈ భక్తిమార్గాలు ఉన్నట్లుగా కావ్యస్థ

ఆధారాలు మనకు చెబుతాయి. దాసభక్తి కలిగిన ఎందరో భక్తుల కథలు మనకు పురాణ కావ్యప్రబంధ సాహిత్యంలో కనిపిస్తాయి.

జానపదుల భక్తి మార్గాలను గురించి చర్చించడానికన్నా ముందుగా జానపదుల ప్రాచీనమైన ఆధ్యాత్మికత ఎన్నివిధాలుగా ఉంటుంది అదిసంస్కృత దేవతల భక్తిమార్గాలకన్నా ఎలా భిన్నంగా ఉంటుందో కూడా చూడాలి.

మానవశాస్త్రం జానపదుల, గిరిజన లేదా ఆదివాసీల ఆధ్యాత్మిక జీవితం గురించి ప్రపంచ వ్యాప్తంగా విస్తృతమైన పరిశోధన చేసింది. ఏంత్రోపాలజీ primitive లేదా ప్రాక్తన ఆధ్యాత్మకతను కొన్ని విధాలుగా వర్గీకరించి అధ్యయనం చేసింది. అవి : 1. Animisim ఆత్మారాధన, 2. Fetishism భూతారాధన, 3. Manisim or Ancestral Worship 4. to femism గణచిహ్నారాధన లేదా జంతుజాల ఆరాధన, 5. Mother Goddess Worship. 6. Hero Worship వీరారాధన ఈ పద్ధతులు ఆరు ఆరాధనా సంప్రదాయాలు ప్రాక్తన సమాజం నుండి నేటికీ అటు జానపద ఇటు గిరిజన ఆదివాసీసంప్రదాయాలలో కొనసాగి వస్తున్నాయి. ప్రకృతి శక్తులను ఆరాధించడం కూడా ఇందులో కలిసి ఉంటుంది.

తెలుగు నేలపైన జానపద గిరిజన సంప్రదాయాలలో ఆదివాసీ సంప్రదాయాలలో ఈ ఆరాధన సంప్రదాయాలు ఎలా ఉన్నాయో క్లుప్తంగా చూద్దాం.

**ఆత్మారాధన Animism**

తెలుగు జానపదులలో ఆత్మారాధన చాలా విస్తృతంగా ఉన్న ఆరాధనా సంప్రదాయం. ఇదికూడా కొన్ని ప్రత్యేక విధానాలలో ఉంటుంది. చనిపోయిన తమ పూర్వీకులను ఆరాధించడం వారికి పూజలు చేయడం వారి స్మృతిని కలకాలం వారికుటుంబంలో కొనసాగించడం పూర్తిగా ఆత్మారాధన ప్రక్రియే. తెలుగువారిలో తాత పేరును మనవడికి పెట్టడం అనాదిగా వస్తున్న

సంప్రదాయం. తాత చనిపోయినవాడు అయితే పేరును ఉన్నది ఉన్నట్టుగా మనవడికి పెడతారు. పుట్టినది మనవరాలు అయితే అప్పుడు కూడా తాత పేరును తగినవిధంగా స్త్రీ పేరుగా మార్చిపెడతారు. ఒకవేళ చనిపోయినది నాయనమ్మ అయితే మనపడికి స్త్రీ పేరును పురుష పేరుగా మార్చిపెడతారు. ఇక్కడ ఉదాహరణలు తాత పేరు తిరుపతయ్య అయితే పుట్టినది మనవరాలు అయితే ఆ మనవరాలికి తిరుపతమ్మ అనిపెడతారు. అదేవిధంగా నాయనమ్మ చనిపోతే పుట్టిన మనవరాలికి అదే పేరును యథాతథంగా పెడతారు. ఒకవేళ మనవడు పుట్టినప్పుడు నాయనమ్మ పేరును మగ పేరుగా మార్చిపెడతారు. ఉదాహరణకు నాయనమ్మ పేరు దుర్గమ్మ అయితే మనవడి పేరు దుర్గారావు అని కాని దుర్గయ్య అని కానీ లేదా దుర్గారెడ్డి అని కానీ పెట్టవచ్చు.

పుట్టిన పిల్లలు కొద్దిరోజులే వయస్సు ఉన్న పిల్లలు తల్లి దగ్గర పాలు తాగకుండా ఎక్కువగా ఏడుస్తూ ఉంటారు. ఎంత బుజ్జగించినా ఫలితం ఉండదు. దీనికి కారణాన్ని కూడా ఇంట్లో పెద్దలు ఎలా ఊహిస్తారంటే తాత పేరు కాని నాయనమ్మ పేరు కాని పిల్లలకు పెట్టకుండా వేరే పేరు పెట్టడం పల్లనే తాతకు కాని నాయనమ్మకు కానీ అది నచ్చక పిల్లలో ప్రవేశించి ఇలా ఈ రూపంలో కోరుకుంటారని ఇంట్లో ఉన్న వృద్ధులు భావించడం ఉంది. అలా జరిగినప్పుడు వారు అంటే చిన్నపిల్లల తల్లిదండ్రులు లేని తమ పెద్దల ఫోటోల దగ్గరికి వెళ్ళి దండం పెట్టుకొని నీ పేరు పెట్టకపోవడం పొరపాటు అని" చెంపలు వేసుకొని తిరిగి నీ పేరే పెడతామని మొక్కుకుంటారు. దీని తర్వాత పసిపాపలు ఎప్పటిలాగా పాలు తాగుతారు. ఇది సాధారణంగా జరుగుతుంది. పిల్లల్లో జీర్ణక్రియలో ఉన్న ఇబ్బందుల కారణంగా తాగకపోవడం జరుగుతుంది. అది సరి అయినప్పుడు తిరిగి చక్కగా పాలు తాగుతారు. ప్రక్రియ ఇదే అయినా జానపదుల నమ్మకాలు ఇలా ఉండవు. పెద్దలు పసిబిడ్డల రూపంలో ఆగ్రహిస్తారని దాన్ని అర్థం చేసుకొని తప్పులు సరిదిద్దుకోవాలని తెలుగు జానపదులు

నమ్ముతారు. ఈ నమ్మకం నేటికీ తెలుగు జానపదులలో చాలా సజీవంగా ఉంది.

దీని తత్త్వం చనిపోయిన పెద్దలు తిరిగి మనవడు మనవరాలుగా తిరిగి జన్మిస్తారని, కనుకనే ఆ పేర్లుపెట్టి వారిని తిరిగి తమ సంతానంలో చూచుకొని ఆనందిస్తారు. తెలుగువారు ఇది పైన చెప్పిన ఆత్మారాధనలో భాగమే. పెద్దలు ఆత్మను ఆరాధించడం ఇది.

వ్యక్తి చనిపోయిన తర్వాత అతని ఆత్మ బతికి ఉంటుందని హిందు సంప్రదాయంలో చాలా గట్టి నమ్మకం. ఆత్మని నిప్పు తగలపెట్టలేదని. గాలి శుష్కింపజేయలేదని నీరు తడపలేదని, ఆత్మ నిత్యమని దేహం అనిత్యమని. ఆత్మ చొక్కాలు మార్చినట్లుగా దేహాలను మార్చుకొని ఒక దేహనుండి మరొక దేహానికి ప్రయాణం చేస్తుందని భగవద్గీతలో గీతాచార్యుడే ఉపదేశించాడు. భగవద్గీతను ఏమాత్రం తెలియని జానపదులు కూడా ఇదే నమ్ముతారు. ఆత్మకు మరణం లేదని వ్యక్తి చనిపోయిన తర్వాత అతని లేదా ఆమె కోరికలు తీరకుండా చనిపోతే ఆ ఆత్మ అక్కడక్కడే తిరుగుతుంటుందని తెలుగు జాసపదులు విశ్వసిస్తారు. అందుకే చనిపోయిన వ్యక్తి ఆత్మ సంతృప్తి చెంది ఊర్ధ్వలోకాలకు వెళ్ళడానికి అవసరమైన అన్ని పూజలు క్రతువులు చేస్తారు. తెలుగు వారికి ఈ పని చేయడానికి చాలా విస్తృతమైన ఆచారకాండ ఉన్నది.

కొన్ని కుటుంబాలలో దశదినకర్మ నిర్వహిస్తారు. పదకొండో రోజుకు ఉత్తరక్రియలు పూర్తి అవుతాయి. ఇది సంస్కృతం తెలిసిన పురోహితుడు వచ్చి చేసినా జానపద సంప్రదాయాలు ఇంకా చాలా ప్రాచీనమైనవని మనం గ్రహించాలి. చనిపోయిన వ్యక్తికి పిండం పెట్టడం అనేది చాలా పవిత్రమైన కార్యంగా నాలుగు వర్గాల వారిలో నేటికీ చాలా బలంగా నిలిచి ఉన్న ఆచారకాండ. చనిపోయిన వ్యక్తి ఆత్మ కాకిరూపంలో వస్తుందని తన వారసులు పెట్టిన పిండాన్ని అంటే ఆయన తినే ఆయనికి ఇష్టమైన పదార్థాలు

వడ్డించిన పవిత్ర భోజనాన్ని ఆరగించడానికి ఆ కాకి ఆరగిస్తే తమ పూర్వికులు ఆరగించినట్లుగానే భావిస్తారు. అలా కాకి ఆరగించకపోతే. కాకులు రాకుంటే బతికి ఉన్న వారసులు తమ పితృదేవతలకు అపచారం చేసినట్లుగా తప్పు చేసినట్లుగా అందుకే తమ పితృదేవతలకు ఆగ్రహం వచ్చినట్లుగా అందుకే పిండాన్ని స్వీకరించడం లేదని చాలా గట్టిగా నమ్ముతారు. అంతేకాదు పెద్దల పట్ల తాము చేసిన అపచారాన్ని సరిదిద్దుకునే ప్రయత్నం చేస్తారు.

ఇక సంస్కృత సంప్రదాయంతో సంబంధం లేకుండానే జానపదులలో పితృదేవతల పైన మరికొన్ని నమ్మకాలున్నాయి. హఠాత్తుగా చనిపోయిన పెద్దలు తమ కోరికలు తీరకుండా చనిపోయిన పెద్దలు. లేదా దుర్మార్గంగా హత్యకు గురైన పెద్దలు లేకుంటే తమ కుటుంబ సభ్యుల వల్లనే హత్యకు గురైన వారు వారి ఆత్మలు బతికున్న పెద్దలను ఇంకా ఊరి వారిని కూడా ఆవహించి వారికి తీరని నష్టం కలిగిస్తారని. వారి కుటుంబాన్ని ధ్వంసం చేయడానికి కూడా వెనుకాడరని జానపదులు విశ్వసిస్తారు. చచ్చిపోయిన దుర్గమ్మ లేదా చచ్చిపోయిన నర్సయ్య దెయ్యంగా మారి పగ తీర్చుకుంటున్నాడని కూడా నమ్ముతారు. ఇలాంటి సందర్భంలో ఎలా ప్రతిక్రియ చేయాలి చనిపోయిన ఆత్మ శాంతించి తమ పైన పగని చల్లార్చేది ఎట్లా అని ఆలోచిస్తారు.

అలా చేయడానికి కొన్ని క్రతువులు పూజలు ఆచారాలు ఉన్నాయి. దీన్ని నిర్వహించేవారు భూతవైద్యులు కొందరు ఉంటారు. లేదా పూజారులు కూడా ఈ ఆచారకాండని నిర్వహిస్తారు. ఇంట్లో చనిపోయిన వ్యక్తులు దేవతలుగా మారతారని అందువల్లనే చనిపోయిన వ్యక్తి ఎంత దుర్మార్గుడు అయినా అతనిని తిట్టకూడదని తప్పుగా మాట్లాడకూడదని ఒక నమ్మకం జానపదులలో ఉంది. చచ్చిపోయిన వారిని తిడితే పాపం తగులుతుంది కళ్ళు పోతాయి వద్దు అని పెద్దలు చెబుతారు.

పితృదేవతలను ఆరాధించడానికి మనకు జానపద సంప్రదాయం ప్రకారం కూడా కొన్ని ప్రత్యేకమైన రోజులు ఉన్నాయి. అందులో మహాలయ అమావాస్య చాలా ప్రముఖమైనది. ఆ రోజునే పెత్తర అమాస అని పెత్తరమాస అని జానపదులు పిలుస్తారు. తెలుగు క్యాలెండర్ ప్రకారం ఆశ్వయుజ మాసంలో వచ్చే అమావాస్యని మహాలయ అమావాస్య అని అంటారు. ఈరోజునే అన్ని వర్ణాల వారు తమ పెద్దలకు తర్పణం చేస్తారు. సముద్రానికి కాని ఇతర జల నిధులకు అంటే ఏర్లు తటాకాల వద్దకు పోయి పితృదేవతలకు పిండాలు పెట్టి తర్పణలు వదలడం చేస్తారు.

ఈ పితృదేవతారాధన అంతా కూడా 'ఎనిమిజమ్' కిందికే వస్తుంది. ఎనిమిజమ్ లేదా ఆత్మారాధన ఇంకా వేరే కోణాలలో కూడా ఉంటుంది. ఆత్మలకు సాక్షిగా చెట్లను ఆరాధించడం, చెట్టునే దేవతగా భావించడం నదులను ఇతర ప్రకృతి శక్తులను ఆరాధించడం కూడా ఆత్మారాధనే అవుతుంది. అందుకే పిత్రారాధన, భూతారాధన, ఆత్మారాధన సంపూర్ణంగా వేరువేరుగా ఉండవు. ఒకదానితో ఒకటి సంబంధం లేకుండా విడివిడిగా ఉండేవి కావు. కాని ఒక్కో సందర్భంలో కేవలం ఒక ఆరాధనగానే అవి కనిపిస్తాయి.

తెలుగు రాష్ట్రాలలో గిరిజన లేదా ఆదివాసీ సంప్రదాయాలలో చెట్లకు పూజలు చేసే ప్రత్యేకమైన పండుగలు ఉన్నాయి. భూదేవి పండుగలు చేసే సందర్భాలున్నాయి. కోయ, కొండరెడ్డి తెగలవారు భూదేవి పండుగ చేస్తారు. ఇక్కడ చెట్టుకు పూజచేసే సందర్భం జానపదులలో భిన్నవిధాలుగా ఉంటుంది. చెట్టును తమ పూర్వీకుల ఆత్మకు మారుగా పూజించడం ఒక విధం అయితే చెట్టును ప్రకృతి శక్తిగా ఆరాధించడం మరొక కోణం. చెట్టును అమ్మదేవతలకు లేదా అమ్మతల్లులకు మారుగా పూజించడం ఒక పద్ధతి అయితే చెట్టుని దెయ్యానికి ప్రతిరూపంగా భావించడం కూడా ఉంది. రావిచెట్టు పైన దెయ్యాలు ఉంటాయని అవి మనుషులపై దాడి చేస్తాయని

కూడా నమ్ముతారు. రావిచెట్టుపైన ఉండే దెయ్యాల కథలు జానపదకథలలో చాలా విరివిగా కనిపిస్తాయి. అంతేకాదు రావిచెట్టును పవిత్రవృక్షంగా భావించడం కూడా జానపద సంప్రదాయంలో ఉంది. సంతానం ఇచ్చే దేవతగా కూడా రావిచెట్టును భావించడం ఉంది. రావిచెట్టుకు ప్రదక్షిణలు చేయడం జానపద సంప్రదాయంలో విడదీయరాని భాగం.

**భూతారాధన Fetishism**

భూతం అనేమాటకు తెలుగులో ఉన్న అర్థం కాస్త వేరుగానే ఉంటుంది. దెయ్యం అనే అర్థంలోనే ఎక్కువగా వాడతాం. ప్రకృతిశక్తులైన పంచభూతాలు అనే అర్థంలో చదువుకున్న వారిలో కొద్దిమంది వాడే పదం. సాంప్రదాయికంగా మానవశాస్త్రంలో Fetishism అనే మాటను మరికొంత పరిమిత అర్థంలోనే వాడతారు. ఈ మాటని కేవలం భూతారాధన అనే విషయంలోనేకాక విస్తృతంగా వాడతారు. మ్యాజిక్ చేయడాన్ని కూడా ఫెటిసిసమ్ అనే అంటారు. మ్యాజిక్ అంటే ఐంద్రజాలికుడు చేసే మ్యాజిక్ కాదు. జానపదంలోను గిరిజన సంస్కృతిలోను ఉన్న మంత్ర తంత్ర విద్యలు క్షుద్రశక్తులు వాటిచుట్టూ ఉన్న సంప్రదాయాలు వీటన్నింటి విషయంలో ఫెటిసిసమ్ అనే పదాన్ని వినియోగిస్తారు. ఈ క్రతువులు లేదా ఆచార ఆచారకాండని నిర్వహించే వ్యక్తిని ఫెటిస్ట్ అని అంటారు.[14] అసాధారణ రతి కోరికలు ఉన్న వ్యక్తిని కూడా ఫెటిష్ అని చెప్పడం మానవశాస్త్రంలో ఉంది. కానీ ఇక్కడి సందర్భంలో కేవలం భూతారాధనకు చెందిన ఆచారాలను చేసే వ్యక్తి అనే అర్థంలోనే వినియోగిస్తాము.

తెలుగు నేలమీద భూతాన్ని ఆరాధించే అంటే పూజించే సంప్రదాయం లేదు. భూతానికి లేదా దయ్యానికి భయపడడం ఉంది. దాన్ని బంధించడం లేదా పారదోలడం అనే క్రియలు మనవారు చేస్తారు. తెలుగు రాష్ట్రాలలో దీనిచుట్టూ చాలా విస్తృతమైన జానపద సంప్రదాయాలు ఉన్నాయి. చనిపోయిన వ్యక్తులు కోరికలు తీరకుండా చనిపోయినవారు లేదా అక్రమంగా

అనూహ్యంగా హత్యకు గురైన వారు ఆత్మశాంతి లేకుండా తిరుగుతూ కొందరిని వేధిస్తూ లేదా తమ కోరికలు తీర్చి ఫలానా పనిచేయి అని చెప్పడం కానీ చేస్తారు. లేదా వ్యక్తులను ఆవహించి హింసించడం, ఇళ్ళు తగలబెట్టడం, ఇంకా ఆస్తి నష్టం చేయడం, పంటలకు నష్టం చేయడం పిల్లలకు అనారోగ్యం కలిగించడం దయ్యాలు చేస్తాయని తెలుగునేలపైన బలమైన జానపద నమ్మకాల వ్యవస్థ ఉన్నది. భూతారాధనకు సంబంధించిన ఈ ప్రస్తావన కొంత పైన ఏనిమిజమ్ గురించి చర్చించినప్పుడు వచ్చింది.

తెలుగులో రెండు జాతీయాలు లేదా నానుడులు ఉన్నాయి. "దెబ్బకు దెయ్యం వదులుతుంది" అని లేదా "ముగ్గులోనికి దింపడం" అని ఈ రెండు పలుకుబడులు జానపదులు చేసే" ఈ భూతవైద్యపు రిచువల్స్ (క్రతువులు) నుండే వచ్చాయి. వాడిని ముగ్గులోనికి దింపారు అంటే అప్పటి దాకా విషయానికి బయటికి ఉన్నవాడిని కొత్త విషయంలోనికి తెచ్చారు అని భావన. మొదటి పలుకుబడి కూడా చాలా విస్తృతంగా వ్యవహారంలో ఉన్నదే. తప్పుచేసిన వారిని దండిస్తేనే తప్పు కుదురుతుందని వ్యక్తి బాగుపడతాని చెప్పడానికి ఈ పలుకుబడి వాడతారు.

## పూర్వ పితృదేవతారాధన

Ancestral worship అనే అర్థంలో ఈ పారిభాషిక పదం "పూర్వపితృదేవతారాధన"ని తెలుగు జానపద శాస్త్రంలో వినియోగిస్తున్నాము. పైన ఆత్మారాధన గురించి చర్చించిన సందర్భంలో మనం పితృదేవతారాధన గురించి చర్చించాము. ఇక్కడ కూడా అదే విషయాలు చర్చించవలసి ఉంది. కుటుంబంలో గతించిన వారిని అంటే కుటుంబ పూర్వికులను దేవతలుగా భావించి ఆరాధించే సంప్రదాయం జానపద సంప్రదాయంలోను సంస్కృత సంప్రదాయంలోను అంటే వైదిక సంప్రదాయంలోను శతాబ్దాలుగా ఉంది. మన పురాణాలలో ప్రాచీన కావ్యసాహిత్యంలో కూడా పితృదేవతారాధన గురించిన ప్రసక్తి ఉన్నది. జానపద సంప్రదాయంలో

పితృదేవతారాధన చాలా బలంగా ఉన్న నమ్మకం. చనిపోయిన తల్లిదండ్రులు తాతముత్తాతలు మరణానంతరం జీవించి ఉంటారని వారి లక్షణాలు పిల్లలలో వస్తుంటాయని నమ్ముతారు. తాత పేరు మాత్రమే కాకుండా కుటుంబంలో అనువంశికంగా వస్తున్న పేర్లను పిల్లలకు పెట్టడానికి ముందుగా ఎంచుకుంటారు. దీనికి కారణం పితృదేవతలు ఆశీర్వదిస్తారని వారు తమ వారసుల రూపంలో తిరిగి జన్మిస్తారని ఉన్న బలమైన నమ్మకమే కారణం. దేవుళ్ళ పటాలు పెట్టేచోటనే గతించిన కుటుంబీకుల ఫోటోలు పెట్టడం వారికి దేవుడి స్థానాన్ని ఇవ్వడమే. ఒక ఇంట్లో ఒక శుభకార్యం జరిగినప్పుడు ముందుగా పితృదేవతలకు పూజ చేస్తారు. ఒక ఇంట్లో ఆ ఇంటి ఆడపడుచు అకాలంగా చనిపోతే ఆమె తప్పకుండా దేవతగా మారుతుందని విశ్వసిస్తారు. పెండ్లి కాని, వ్రతం కాని మరే శుభకార్యం జరిగినా ఆ ఆడపడుచు దేవతకు పూజించి ఆమె పేరుతో వస్త్రాలు పెట్టి ఆ తర్వాత శుభకార్యం జరుపుకుంటారు. అలా పూజించకపోతే ఆమె ఆగ్రహిస్తుందని కూడా భావిస్తారు.

ఏడాదికి ఒకసారి చనిపోయిన పెద్దలకు తద్దినాలు పెట్టడం వైదిక సంప్రదాయం ప్రకారం కొన్ని వర్ణాల వారు చేస్తారు. తండ్రికి కుమారుడు తద్దినం చేయడం సంప్రదాయం.

బతుకమ్మ కథలో అత్తవారింటి ఆరళ్ళతో చనిపోయిన బతుకమ్మ తన అన్నలు చూడడానికి వచ్చినప్పుడు ఊరిబయట ఉండి తన అన్నలతో తనకు జరిగిన అన్యాయం గురించి చెబుతుంది. ఈ ఆత్మనే బతుకమ్మగా నేటికీ ఆరాధిస్తారు జానపదులు, బతుకమ్మ తంగేడు చెట్టుదగ్గరే ఉండి అదృశ్యంగా మాట్లాడిందని కథ ఉంటుంది. అందుకే బతుకమ్మ దేవతగా ఆమె ఆత్మని తంగేడు పూలరూపంలో నేటికీ ఆరాధిస్తున్నారు. ఎందరో ఇలాంటి పేరంటాళ్ళను నేటికీ జానపద సంప్రదాయంలో ఆరాధిస్తున్నారు.

చనిపోయిన వ్యక్తి ఆత్మ ఇలా అదృశ్యంగా ఉండి తన వారసులను రక్షిస్తుందని కాపాడుతుందని చెప్పే జానపద నమ్మకం చాలా బలంగా మన జానపద కథాసాహిత్యంలో కూడా కనిపిస్తుంది. అందుకే ఆత్మారాధన పూర్వ పితృదేవతారాధన జానపద సంప్రదాయంలో చాలా బలంగా నేటికీ నిలిచి ఉంది.

### టోటెమిజమ్ (totemism) గణచిహ్నారాధన

పాశ్చాత్య దేశాలలో ఐరోపా దేశాలలో ఒక్కో ఎత్నిక్ గ్రూపునకు సంబంధించిన చిహ్నగా ఉన్న లేదా గణచిహ్నంగా ఉన్న పక్షిని కానీ జంతువును కాని టోటెమ్ అని అంటారు. దీనిచుట్టూ ఉన్న సంస్కృతిని దీని ఆరాధనను టోటెమిజమ్ అని అంటారు. ఇదే భారతదేశ సందర్భంలో వేర్వేరు వర్ణాలు కులాలు ఉన్నాయి. ఆయా నాలుగు వర్ణాలకు విడిగా గణచిహ్నాలు లేవు కానీ వేర్వేరు కులాలకు గణచిహ్నాలుగా పక్షులు పశువులు, చేపలు కూడా ఉండడాన్ని పరిశోధకులు ఇప్పటికే గ్రహించి చెప్పారు. ఆచార్య నాయని కృష్ణకుమారి గారు తొలిసారిగా తెలుగులో టోటమిజమ్ పైన పరిశోధించి వారి పరిశోధనలో ఒక అధ్యాయాన్ని ప్రత్యేకంగా టోటెమిజమ్ పైన రచించారు. అయితే ఆమె ఈ పారిభాషిక పదాన్ని అనువదించే పని చేయకుండా దాన్ని ఉన్నది ఉన్నట్లు టోటెమ్ అని వాడారు. దీనికి సంబంధించిన విషయాలు చెప్పడానికి టోటెమికము అనే కొత్త పదబంధాన్ని తయారు చేశారు. ఈ అంశాలను టోటెమికాంశాలు అని కూడా చెప్పారు.[17] కానీ ఇక్కడి భావాన్ని పూర్తిగా గ్రహించిన తర్వాత భారతీయ సందర్భంలో టోటెమిజమ్ అనే పదాన్ని గణచిహ్నారాధన అని కానీ కులచిహ్నారాధన అని కానీ చెప్పవచ్చు. గణచిహ్నారాధన అనే పదం ఎక్కువ అర్థవంతంగా ఉంటుంది కనుక ఈ పదాన్ని క్రమంగా వ్యాప్తిలోనికి తీసుకురావచ్చు.

టోటెమికారాధన కూడా ప్రాథమికంగా ఆత్మారాధనకు పూర్వ పితృదేవతారాధనకు సంబంధించినదే. అయినా దీని వ్యక్తీకరణ చాలా భిన్నంగా ఉంటుంది. ఇది జానపదుల ఆధ్యాత్మిక చింతనలో ముఖ్యమైనది. చనిపోయిన వారి ఆత్మలు భూమిమీదనే తిరుగుతూ ఉంటాయని వారికి మనుషులలాగే ఆకలి ఉంటుందని దాన్ని తీర్చాలనే ఈ భావన కేవలం తెలుగు జానపదులలో మాత్రమే కాదు ప్రపంచవ్యాప్తంగా వేర్వేరు దేశాలలో ఉన్నట్లు మానవశాస్త్ర పరిశోధనలు చెబుతున్నాయి. మలయాద్వీపంలో ఉండే సెమాంగులు చనిపోయిన మనిషి ఆత్మ పక్షిరూపంలో ఎగిరిపోతుందని నమ్ముతారు. మన మేడారం జాతరకు ప్రధాన దేవత అయిన సమ్మక్క యుద్ధరంగంలో సాహసాలు ప్రదర్శించి గాయపడిన ఆమె (కొన్ని అభిప్రాయాల ప్రకారం చనిపోయిన) ఆమె ఒక పక్షిరూపంలో చిలుకల గుట్టవైపునకు వెళ్ళిపోయిందని సమ్మక్క ఇతిహాసంలో వస్తుంది. ఆచార్య నాయని కృష్ణకుమారి గారు ఉటంకించిన దానిప్రకారం సెమాంగ్ జాతి స్త్రీ గర్భవతిగా ఉన్నప్పుడు తన గోత్రానికి సంబంధించిన చెట్టును చక్కగా అలంకరించి అక్కడే ఎదురు చూస్తుంటారు. ఆ చెట్టుమీద వాలిన పక్షి ఏదైనా సరే అది తన పూర్వుల ఆత్మగా భావించి దాన్ని పట్టుకొని తింటారు. అలా తినడంవల్ల తన గర్భంలో ఆత్మ లేకుండా ఉన్న పిండానికి ఆత్మ వస్తుందని భావిస్తారు. నమ్ముతారు. ఆస్ట్రేలియాకు చెందిన అబాఒరిజినల్స్ కూడా చనిపోయిన మనిషి ఆత్మ పక్షి రూపం ధరించి తిరుగుతుంటుందని నమ్ముతారు.

ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఆదివాసీ తెగలలో చనిపోయిన ఆత్మ పక్షిగా, సర్పంగా, వేరువేరు జంతువుల రూపాలు పొందుతుందని నమ్ముతార. అలా పాములకు గుడి కట్టి పూజించి ఆ సర్పాన్ని కులదేవతగా భావిస్తారని ప్రఖ్యాత మానవశాస్త్రవేత్త జి.పి. మర్డోక్ అంటారు. భారతీయ యోగశాస్త్రం ఏడు చక్రాలతో ఉన్నకుండలినీ శక్తిని ఆరూపాన్నిసర్పంగానే భావిస్తారు. ఇదే ఆత్మకు

చిహ్నంగా భావిస్తారు. ఈ విధంగా వేరువేరు దేశాలలో చనిపోయిన. వారి ఆత్మ వివిధ పక్షి జంతురూపాలు ధరిస్తుందని భావిస్తారు. ప్రాఙ్మానవ మత పరిణామ దశలో జంతు ఆరాధన అలా ఏర్పడింది. వీటినే కుల చిహ్నాలు అని అనవచ్చునని నాయని కృష్ణకుమారి గారు భావించారు. అంతేకాదు దీని ఆధారంగా చేసుకునే టోటెమిజమ్ అనే పారిభాషిక పదానికి తెలుగులో కులచిహ్నారాధన అని గణచిహ్నారాధన అని అనువాదం చేసుకోవచ్చు.

నాయని కృష్ణకుమారి గారు కులచిహ్నంగా ఈ పక్షి జంతువులను చెప్పవచ్చునని చెప్పినా వారు టోటెమిజమ్ పారిభాషిక పదానికి సమానార్థకంగా తెలుగుపదాన్ని ఉంచే ప్రయత్నం చేయలేదు. బహుశా పూర్తి భావం తెలుగు పదాలలో రాకపోవచ్చుననే సందేహం కావచ్చు. కానీ ఇక్కడ వారే సూచించిన విధంగా కులచిహ్నారాధన అని కానీ గణచిహ్నారాధన అని కానీ అనువాదం చేసుకోవచ్చు. ఈ రెండింటి కులచిహ్నారాధన అని అన్నప్పుడు ఆదివాసీలలో ఉండే టోటెమిజమ్ కలిసిరాదు. అందువల్ల గణచిహ్నారాధన అనే అంటే పూర్తిగా అన్ని మానవబృందాలలో ఉన్న టోటెమికాంశాలను చెప్పడానికి వీలవుతుంది. కనుక తెలుగులో ఇకపైన గణచిహ్నారాధన అని దీనికి అనువాద పదాన్ని వినియోగించుకోవచ్చు.

సుప్రసిద్ధ మానవశాస్త్రవేత్త జి.జె. ఫ్రేజర్ దీనికి సంబంధించి రాసిన తొలి వ్యాసంలో చెబుతూ టోమ్ అంటే ప్రధానంగా ఒక వస్తువు అది సాధారణంగా జంతురూపంలో ఉంటుంది. అక్కడక్కడా వృక్షరూపాన్ని పొందుతుంది. ఎప్పుడైనా నిర్జీవ వస్తువుగా కూడా ఉండవచ్చు. వీటిని అన్నింటినీ టోటెమ్లు అని లేదా గణచిహ్నాలు అని కూడా అనవచ్చు. ఇలాంటి టోటెమ్ లేదా గణచిహ్నాల లక్షణాలను ఆచార్య నాయని కృష్ణకుమారిగారు తమ పరిశోధనలో విపులంగా ప్రస్తావించారు." అవి ఈ సందర్భంలో అంత విస్తృతంగా ఇక్కడ చర్చించవలసిన అవసరం లేదు. తెలుగు నేలలో ఈ గణచిహ్నారాధన ఎలా ఉందో చాలా క్లుప్తంగా ఇక్కడ పరిశీలన చేద్దాము.

మన పురాణ కథలలో ఎందరో పురాణపురుషులు జంతువుల నుండి పుట్టినట్లు మనకు కనిపిస్తుంది. మన వినాయకుడు గణనాయకుడుగా కూడా పేరుఉన్నవాడు. ఆయన ఏనుగుముఖం కలిగినవాడుగా జంతుపూజలో ఒక భాగంగానే ఉన్నాడు. శాతవాహన వంశపురుషుడు సింహంనుండి పుట్టాడని, శంతనునికి భార్యగా మారిన సత్యవతి చేపనుండి పుట్టినదని మత్స్యవల్లభుడు ఆంజనేయుని చెమటను స్వీకరించిన చేపనుండి పుట్టాడని మనకు పురాణ కథ ఉంది.

రెండు తెలుగు రాష్ట్రాలలో నాగులచవితి నాడు నాగుపాముకు పూజించడం ఉంది. ద్రావిడ జాతిని నాగజాతిగా పరిగణించడం ఉంది. నాగజాతి అంటే నాగుపాములు కాదు అని సర్పాన్ని గణచిహ్నంగా కలిగిన జాతి అని ఇప్పటికే పరిశోధకులు చెప్పారు. ఈ నాగారాధన దక్షిణాది అంతా చాలా విస్తృతంగా ఉంది. ఈ నాగుపామును ఆరాధించడం స్పష్టంగా గణచిహ్నారాధన అని టోటెమిజమ్ అని చెప్పాలి. తెలుగు రాష్ట్రాలలో నేను చాలా విస్తృతంగా పర్యటించాను. ప్రతి గ్రామంలో నాగ దేవతకు చెందిన శిల్పాలు గనిపించాయి. వాటికి పూజాపునస్కారాలు చేయడం కనిపించింది. Serpent worship అంశంపైన మానవశాస్త్రంలో విస్తృతంగా పరిశోధన గ్రంథాలు దొరుకుతాయి. మన దశావతారాలలో కూడా టోటెమిక చిహ్నాలుగా చూచే వీలుందని కృష్ణకుమారిగారు భావించారు.

తెలుగు రాష్ట్రాలలో కొన్ని కులాలవారి పెండ్లిండ్లలో పోలు అనే ముగ్గుని రాస్తారు. కొన్ని కులాలలో నాకబలి అనే కార్యక్రమం ఉంటుంది. దీన్నే నాగవల్లి అని కూడా అంటారు.

బలిజవారి పెండ్లిలో గీసే పోలుబొమ్మలో గాడిదబొమ్మ గీస్తారని అది ఆ కులంవారి గణచిహ్నమని కృష్ణకుమారిగారు చెప్పారు. అలాగే కురుమలు వారికి జీవనాధారమైన గొర్రెను పోలులో గీస్తారని ఈ గొర్రెలు దేవుని ఆశీర్వాదం కారణంగానే భూమిపైన పుట్టాయని భావిస్తారు. గొర్రె వారికి

గణచిహ్నంగా ఉంటుంది. బీరప్ప గుడులు ఉన్నచోట ఈ గొర్రె విగ్రహం కూడా గుడిపైన కనిపిస్తుంది. దీన్ని బీరప్పలవారు కురమలు ఆరాధించడం ఉంది. ఇది వారి కులదైవతగానే వారు భావిస్తారు. కలుకోడి అనే కోడి గౌడపురాణంలో ప్రధానపాత్రగా మనకు కనిపిస్తుంది. ఈ కలుకోడి గౌండ్ల వారికి ఆరాధ్య వస్తువు. దీన్ని వారు పవిత్రంగా భావిస్తారు.

ఈ గణ చిహ్నాలను దేవతగా భావించిన సందర్భాలలో దానికి హాని కలిగించరు. దాన్ని దేవతగానే భావిస్తారు. కానీ మరికొన్ని సందర్భాలలో అదే గణచిహ్నాన్ని అప్పటిదాకా ఆరాధించినదాన్నే చంపి తింటారు. అలా దాన్ని ఆ కులంవారు తినడం వల్ల వారి పూర్వీకుల శక్తి ఆత్మశక్తి వారికి సంక్రమిస్తుందని భావిస్తారు.

జానపదగేయ సాహిత్యంలో ఈ గణచిహ్నారాధనకు సంబంధించిన ఈ ఆధారాలు చాలా కనిపిస్తాయి. కొన్ని గోత్రాలవారు ఆ గోత్రానికి సంబంధించిన పక్షిని కానీ జంతువును కానీ తినరాదనే ఒక 'ట్యాబూ' అంటే నిషేధం ఉంది. ఈ విషయం గేయరూపంలో కూడా మనకు లభించింది.

**"కొండ్యాల గోత్రాము మనది**
**ముక్కొర వంశాదులము మనము**
**కొర్రబువ్వ భోంచెయ్యరాదు మనకు**
**పైగాలికి కొర్రచేను ఉంటే**
**దిగువగాలికి నడువరాదు మనము**
**కొర్ర చేను పెట్టవద్దు తండ్రి"**

అని తండ్రిని మందలించుటమే కాకుండా అలా చేస్తే

**"ఏటికి ఎద్దులు మునిగి పోతవయ్యా**
**పాడిబర్లు పాడై పోతావి**
**వద్దు వద్దు కొర్రచేసు పెట్టబోకు"[19]**

ఇది పిచ్చుకుంటి వారు చెప్పే పర్వతాల మల్లారెడ్డి కథలోని భాగం.

ఈ కథనాన్నిబట్టి ముక్కొర వంశస్థులు, కొర్ర అన్నం తినకూడదు. కొర్రచేను గాలికూడా వారికి సోకరాదు అని కథకుడు వివరిస్తాడు. ఈ నమ్మకాలు చాలా బలంగా ఉంటాయి. వీటిని నేటికీ రెడ్డి కులస్థులు ఆ గోత్రం ఉన్నవారు పాటిస్తారు.

కొన్ని కులాలలో కొన్ని కుటుంబాల వారికి జంతువులు పక్షుల పేర్లతో గోత్రనామాలు ఉంటాయి. ఏ జంతువు పేరుతో గోత్రం ఉంటే ఆ జంతువును తినరాదని నేటికీ గట్టి నమ్మకం ఉన్నది ఆయా గోత్రాలు వారు ఆ జంతువులను నేటికీ తినరు. మేకల గోత్రం ఉన్నవారికి మేక మాంసం నిషేధం. గొర్రె కొందరికి నిషేధం.

గణచిహ్నానికి సంబంధించిన వస్తువుని ఆరాధించే పద్ధతిని ఒకదాన్ని పరిశీలిద్దాము. కొందరి ఇంట్లో పెళ్ళి జరిగిన తర్వాత బండిలో ఊరేగింపుగా ఊర్లోనికి వస్తారు. వారికి వృత్తి మిరాసి ఉన్నవారి ఇంటికి వెళ్తే అక్కడ వారికి ధాన్యం, డబ్బు ఇచ్చి యజమాని ఆశీర్వదిస్తాడు. కానీ అంతకన్నా ముందు వారు వడ్లవారి దాతి వద్దకి వచ్చి అక్కడున్న కొలిమి దాకలికి పసుపురాసి, కుంకంబొట్లు పెట్టి, కొబ్బరికాయ కొట్టి పూజ చేస్తారు. ఆ తర్వాతనే ఊరేగింపుకు వెళతారు.

దీనికి జాంబపురాణం కథ వివరణ ఇస్తుంది. జాంబవుడు తన కొడుకును చంపి అతని వేర్వేరు శరీర భాగాలతో విశ్వకర్మలకు పనిముట్లు చేసి ఇస్తాడు. చేతులను పట్టుకార్లుగా, ఊపిరితిత్తులను కొలిమి తిత్తులుగా, గొంతును కొలిమిసరంగా అతని ఎదురు రొమ్మును దాకలిగా చేస్తాడు. అలా చేయగా ఒక డొక్క మాత్రమే మిగిలింది. ఆ డొక్కయే తిరిగి ఇంకో కొడుకుగా మారుతుంది. అతనేడక్కలి కులానికి మూలపురుషుడు. అయితే ఇక్కడ దాకలి జంతువు కానీ, ఏ ప్రాణి కానీ కాదు. నిర్జీవ వస్తువు. కానీ

ఇది జాంబవంతుడు అంటే హరిజనుల మూలపురుషుడు అతని కొడుకు రూపంలో గణచిహ్నంగా నిలిచింది. ఈ కారణంగానే గణచిహ్నాన్ని హరిజనులు ఆరాధిస్తున్నారు.

చెట్టు పేరుతో గోత్రం ఉన్నవారు కాని ఇంటిపేరు ఉన్నవారు కానీ ఆ చెట్టును కొట్టరు కాని అలా కొట్టవలసి వచ్చి కొట్టినప్పుడు దానికి అంత్యక్రియల సూచనగా కొట్టిన వ్యక్తి కొట్టిన చెట్టు మొదట మూడు పిడికిళ్ళ మట్టి వేస్తాడు.

పాము గోత్రం ఉన్నవారు పామును చంపితే దానికి అంత్యక్రియలు నిర్వహిస్తారు. ఇవి అన్నీ నేటికీ నిలిచి ఉన్న బలమైన జానపద నమ్మకాలు. ఇవే గణచిహ్నారాధనకు సూచికలు.

## జానపదుల ఆధ్యాత్మికత పురాణ దేవతారాధన

పురాణదేవతలు అన్నా, సంస్కృత దేవతలు అని అన్నా జానపదులు పూజించే గ్రామదేవతలకు భిన్నమైనవారు అనే అర్థంలోనే ఇక్కడ ఈ పదాలను ప్రయోగిస్తున్నాను. ఇక్కడ పురాణ దేవతలు అంటే వేంకటేశ్వరుడు, రాముడు, సీత, లక్ష్మణుడు, హనుమంతుడు, కృష్ణుడు, విష్ణువు, శివుడు, వినాయకుడు, కుమారస్వామి, అయ్యప్ప లేదా సుబ్రహ్మణ్యేశ్వరుడు మొదలగువారు.

తీర్థయాత్రలకు వెళ్ళడం, క్షేత్రాలను దర్శించడం, పురాణ దేవతలను పూజించడం, ఆరాధించడం జానపద సంప్రదాయంలో విడదీయరాని భాగమైంది. అందుకే జానపదులను, నాగరికులను ఇలాంటి సందర్భంలో వేర్వేరుగా చూడడం సాధ్యంకాదు. అయినా కూడా దేవుని భావనలో పాపభీతి విషయంలో జానపదులకు నాగరికులకన్నా భక్తి అధికంగా ఉంటుంది. ఇది వేర్వేరు వ్యక్తులను అడిగి పరిశీలించి తెలుసుకున్న విషయం.

## జానపదుల ఆధ్యాత్మికతలో వేంకటేశ్వరస్వామి

తెలుగు జానపదులకు పురాణ దేవతలు అందరికన్నా కూడా వేంకటేశ్వర స్వామిపైన భక్తిప్రపత్తులు చాలా ఎక్కువ. తెలుగు వారికి ఇలవేల్పు

వేంకటేశ్వరుడు. జీవితంలో ఒక్కసారైనా తిరుమల వేంకటేశ్వరుని చూడని తెలుగు కుటుంబం ఉంటుందా అని ప్రశ్నించుకుంటే ఉండదనే సమాధానం రావచ్చు. తెలుగువారి పేర్లలో ఈ స్వామి పేరు పెట్టుకునేవారు చాలా ఎక్కువ.

వేంకటేశ్వర-రావు-రెడ్డి-శర్మ-శాస్త్రి గుప్త ఇలా వేంకటేశ్వర పైన ఉపపదంగా రేక నామప్రత్యయాలుగా ఎన్నో పేర్లు వస్తాయి. వెంకమ్మ, వెంకటనర్సు, వెంకటరావమ్మ, వెంకటరమణి, వెంకాంబ, వెంకుమాంబ, వెంగమాంబ, వెంకటలక్ష్మి ఇలా అసంఖ్యాకంగా పేర్లు స్వామి పేరుతో ముడిపడి కనిపిస్తాయి. అంతేకాదు వేరే పేరు నక్షత్రం ప్రకారం పెట్టుకున్నా, దానికి ముందు కానీ వెనుక కాని వేంకట అనే పదాన్ని చేర్చి పెట్టుకునే పేర్లు చాలా ఉన్నాయి. వెంకట్రాముడు, వెంకట్రామారెడ్డి, వెంకటకృష్ణ, వెంకటశివుడు, వెంకటముని, వెంకటనాథుడు, వెంకటస్వామి వెంకటనాథయ్య, బాలవెంకటయ్య, బాలవెంకట్రెడ్డి వెంకటాచలం, వెంకటాచలపతి, చలపతి... ఇలా ఎన్నో ఉన్నాయి. స్వామి పేరు పైనే కాదు స్వామిచుట్టూ ఉన్న సంస్కృతి చుట్టూ తిరిగే పేర్లు కూడా చాలా ఉన్నాయి.

ఉదాహరణ చూడండి. తిరుపతి పైన వచ్చేవి... తిరుపతయ్య, తిరుపతి రెడ్డి, తిరుపతిరావు, తిరుపతి, తిరుపతమ్మ, తిరుమూర్తి, తిరుపతిశాస్త్రి, తిరుపతిశర్మ, ఇలా ఇంకా వెదికితే దొరుకాతాయి.

కొండయ్య, కొండలరావు, కొండమ్మ, కొండన్న, కొండుభట్లు, కొండయ్యశాస్త్రి, కొండలరాయుడు, ఏడుకొండలు, ఎళుమలె, ఏడుకొండల రావు ఇలా కొన్ని...

ఇక తిరుమల మీద... తిరుమలయ్య, తిరుమలరావు, తిరుమలి, తిరుమల్రెడ్డి, తిరుకళ్యాణ్, తిరుపతమ్మ, తిరుమలాంబ, పెదతిరుమలయ్య, చినతిరుమలయ్య, చినతిరుమలమ్మ, ఇలా కొన్ని...

కోనేటిరావు, కోనేటిరెడ్డి, కోనేటప్ప, కోనేటమ్మ, ఇలా కొన్ని ఉన్నాయి.

బాలాజీ పేరుతో కొన్ని వేంకటబాలాజి.. మలయప్ప, కొన్ని...

తెలుగువారికి అటు తమిళం వారికి కన్నడం వారికి వెంకన్న పేరుతో, ఆయన చుట్టూతాను ఇలా వందల సంఖ్యలో పేర్లు కోట్ల మందికి ఉన్నాయి. దీన్నిబట్టే జానపదులలో వేంకటేశ్వరస్వామిపట్ల ఎంతటి భక్తి ప్రపత్తులు ఉన్నాయో తెలుసుకోవచ్చు.

ఏడుకొండలవాడా! వెంకటరమణా! గోవిందా! గోవిందా! అని ప్రతిరోజు లేవగానే చెప్పే కుటుంబాలు కోట్లలో ఉంటాయి. భక్తిప్రత్తులతో కొండకు పోవాలని కోరుకోని తెలుగు కుటుంబం ఉండదు. వేంకటేశ్వర స్వామిపటం లేని ఇల్లు వెదకవలసిందే. పిలిచిన పలికే దేవుడని కోరిన వరాలిచ్చే కొండంత దేవుడని అన్నమయ్యకి ముందు ఆ తర్వాత నేటికీ కూడా తెలుగు ప్రజలు వెంకన్నస్వామిని ఆరాధిస్తారు. కోరిన వారికి కొంగు బంగారం అని తలుస్తారు జానపదులు నేటికీ.

జానపద సంస్కృతిలో కొన్ని అభివ్యక్తులు మనకు ప్రత్యేకంగా కనిపిస్తాయి. నిలువుదోపిడీ ఇవ్వడం, ముడుపులు కట్టడం మీదెత్తడం అలాంటి ఆచారకాండ వెంకన్నస్వామి చుట్టూతా ఉన్నాయి. వచ్చే ఏడాది తిరుపతి పోయి మొక్కు తీర్చుకుంటా అని పలానా పని జరగాలని మా పిల్లలకు పెళ్ళి కావాలని లేదా ఉద్యోగాలు రావాలని. న్యాయమైన మా కేసు గెలవాలని ఇలా ఎన్నో కోర్కెలతో వెంకటస్వామికి తెలుగు ప్రజలు మొక్కుకుంటారు. తాము మొక్కుకున్న దగ్గరనుండి జుట్టు, గడ్డం పెంచుకునేవారు కూడా వేలు, లక్షలలో ఉంటారు. స్త్రీలు కూడా తమ కోరిక తీరితే నీ కొండకు వచ్చి తలనీలాలు ఇస్తా

స్వామీ! అని వేంకటేశ్వరునికి మొక్కుకుంటారు. మరికొందరు కాలినడకన వచ్చి నీ కొండ ఎక్కి మొక్కు చెల్లిస్తానని మొక్కుకుంటారు. అదే

ప్రతిజ్ఞ ప్రకారం ఎంత అనారోగ్యం ఉన్నా కాలినడకన కొండ ఎక్కి మొక్కు చెల్లిస్తారు. అనుకున్న ప్రకారం మొక్కు చెల్లించకపోతే పాపం తగులుతుందని, కళ్ళు పోతాయని పెద్దవారు ఇంటివారికి చెప్తారు. అలాగే ప్రజలు విశ్వసిస్తారు.

తిరుపతి తెలుగు జిల్లాలకు చాలాదూరంలో ఉంటుంది. ఖమ్మం జిల్లావారు పోవాలన్నా బస్సు, రైళ్ళలో పోవడానికి ఒకరోజు ప్రయాణం. చాలా ఖర్చుతో కూడుకున్నది. ఇక పైనుండే తెలంగాణ జిల్లాలకు మరింత దూరం. తిరుపతి పోవడానికి సామాన్యులు, పేదప్రజలు, కూలి నాలి చేసుకొని బతికేవారికి తిరుపతి పోవడం, వెంకన్నను దర్శించుకోవడం చాలా పెద్ద కష్టమైన పనే. అప్పు చేసేవారు చేస్తుంటారు. ఏదైనా వస్తువో, నగో అమ్ముకోని పోయేవారు కూడా ఉంటారు. జీవితంలో ఒక్కసారైనా వెంకన్న దేవుణ్ణి తమ ఇలవేల్పును దర్శించుకోవాలనే బలమైన కోరిక తెలుగు జానపదులలో గట్టిగా ఉంటుంది. ఏ పురాణ దేవతలైనా వారిని ఏ ఊర్లోనైనా చూస్తారు. వేంకటేశ్వరస్వామి గుడులు ఎక్కడైనా ఉంటాయి. అయినా వెంకన్నని తిరుమలలో చూడడం చాలా ముఖ్యం. వేర్వేరు జిల్లాల నుండి యాభై, అరవై సంవత్సరాల క్రితమే బస్సు కంట్రాక్టర్లు తిరుమల యాత్ర అని పేరు చెప్పి ఐదారు క్షేత్రాలు చూపిస్తామని మనిషికి ఇంత అని వసూలు చేసి తీసుకుపోయేవారు. సత్రం చూపించడం, దర్శనం చేయించడం వారిపని. అందుకుగాను మనిషికి ఇంత అని వసూలు చేసేవారు. నమ్మకంగా ఇస్తారనుకున్న వారివద్ద అప్పుగా కూడా సీటు ఇచ్చేవారు. మొక్కులున్న వారికి, ముడుపులు కట్టినవారికి ఇది చాలా గొప్ప సౌకర్యంగా ఉండేది. అంతేకాకుండా రైళ్ళలో పోయేవారు చాలామంది ఉండేవారు. ఒక బస్తాలో వారి బట్టలు, వంటసామాన్లు వేసుకొని బయల్దేరేవారు. ఎక్కడ దిగితే అక్కడే మూడురాళ్ళు పెట్టుకొని వండుకొని తిరిగి ఇంకో ఊరికి బయల్దేరడం ఇలా ఉండేది వారి పద్ధతి. తిరుమలకు వెళ్ళినా ఆ రోజుల్లోనే సత్రాలు ఉండేవి. వెంకన్న దర్శనం కావాలంటే మనం అనుకున్నప్పుడు కాదని స్వామి తమకు ఎప్పుడు దర్శనం ఇవ్వాలని అనుకుంటే అప్పుడే తిరుమలకు పోవడం సాధ్యం

అవుతుందని జానపదులు నేటికీ భావిస్తారు. “నువ్వనుకుంటే పోటం కుదురతాదిరా! స్వామి తన కొండకు తానే రప్పించుకుంటాడు రా...” అని అంటుంటారు.

తెలుగు జానపదులలో తిరుమలకు పోవడానికి మరొక పద్ధతి కూడా ఉంది. దాన్ని జోగి అడగటం అని అంటారు. ఇది డబ్బులున్న సంపన్నులకు, నిరుపేదలకు కూడా ఈ జోగి అడిగే సంప్రదాయం ఉంది. దాన్ని గురించి చూద్దాం.

ఒక వ్యక్తి తిరుమల వేంకటేశ్వరుని కొండకు వచ్చి మొక్కు చెల్లించుకుంటా స్వామీ! నా కొడుకుకు జబ్బు తగ్గించు అని మీదెత్తుతాడు. తన మొక్కు చెల్లించుకోవడానికి ఆ యేడే కుదుర్చుకోవాలని ప్రయత్నం చేస్తాడు. మొక్కు మొదలుపెట్టిన దగ్గరనుండి తన ఇంట్లోవారు ఎవరూ క్షవరం చేయించుకోరు. ఇంట్లో మగవారు అందరూ ఒకేరోజు జుట్టు కత్తిరించుకోకూడదు అనే నియమం ప్రకారం ఇంట్లో చిన్నవాడు ఈ తలనీలాలు ఇచ్చే నియమానికి దూరంగా ఉంచుతారు. (ఇంట్లో ఒక వ్యక్తి పోయినప్పుడే మగవారు అందరూ గుండు చేయించుకోవలసి వస్తుంది. అందుకే ఈ నియమం ఉంటుంది).

ఇలా మొక్కుకున్న వ్యక్తి ఆర్థికంగా తిరుమల వెళ్ళడానికి డబ్బు ఉండవచ్చు లేదా లేకపోవచ్చు. కానీ ఇలా మొక్కుకున్నవారు జోగు అడిగే సంప్రదాయం కొంతమంది పాటిస్తారు. అలా జోగు అడగడం అంటే తిరుపతికి బయల్దేరేముందు నాలుగైదు రోజులముందు ఒక మంచి తిథి చూసుకొని ఊరిలో భిక్షం అడగడానికి వెళతారు. అప్పటికి ఆ మగవ్యక్తికి జుట్టు బాగా పెరిగి ఉంటుంది. గడ్డం కూడా బాగా పెరిగి ఉంటుంది. అతని ప్రవర్తనలో ఏ దుష్టచింతన లేకుండా ఈ మొక్కు కాలం అంతా గడుపుతాడు. ఇతను మోతుబరి రైతు కావచ్చు లేదా పూటకూడా సరిగ్గా

గడవని రైతు కూలీ కూడా కావచ్చు. జోగి అడగడం అందరికీ ఒకే పద్ధతిలో ఉంటుంది.

జోగి అడిగే రోజున పొద్దున్నే లేచి శుచిగా స్నానం చేసి కొత్త పంచె కట్టుకొని పైన చొక్కా తొడుక్కోకుండా ఉంటాడు. అతని ఇల్లాలు కూడా శుచిగా తయారై ఉన్నదాంట్లో మంచి చీరకట్టుకుంటుంది. అలా తయారై ఒక పెద్ద తాంబాళం తీసుకుంటారు. అందులో పసుపుకుంకాలు పెట్టుకుంటారు. పళ్ళెంలో వేంకటేశ్వరస్వామి, పద్మావతి ఉన్న పటం పెట్టుకుంటారు. ఇంటి యజమాని ఆ తాంబాళం రెండు చేతులతో తన నడము వరకు కనిపించేలాగా పట్టుకొని ఇంటినుండి బయటికి వస్తాడు. అంతకుముందు ఇంట్లోనే స్వామికి పూజ చేస్తారు. అతని భార్య కూడా అతని పక్కనే తాను కూడా పటం పట్టుకొని పక్కపక్కన ఉండి బయటికి నడుస్తారు. వారికిముందు సన్నాయి మేళం పెట్టుకొని అలా వీధుల్లో నడుస్తారు. ప్రతి ఇంటిముందు కొద్దిసేపు ఆగుతారు. ఆ ఇంటినుండి అలా జోగు అడిగే పనిని అతి పవిత్రంగా భావిస్తారు. స్వామివారు అలా వారి ఇంటిమందుకు వచ్చినట్లు భావిస్తారు. ఇంటినుండి బయటికి వచ్చి అలా జోగి అడిగే ఇంటి యజమాని పట్టుకున్న దేవుడిపటంలో తమకు తోచిన డబ్బు వేస్తారు. అది రూపాయి కానీ, వంద కానీ, వేయి కానీ, ఎన్నో వేలు కానీ కావచ్చు. అది వారి స్థాయినిబట్టి, భక్తినిబట్టి ఉంటుంది. కొందరు చిన్న బంగారు ఆభరణం కూడా కానుకగా వేయవచ్చు.

అలా జోగి అడిగే వ్యక్తి తిరుపతి వెళ్ళి రావడానికి స్థోమత కలిగినవాడు అయితే అయ్యా! ఈ డబ్బు స్వామివారి హుండీలో కానుకగా వేయి అని చెప్తారు. అలాకాక తిరుపతి వెళ్ళడానికి అవసరమైన డబ్బు కూడా లేని పరిస్థితిలో జోగి అడగడానికి వచ్చాడు అని భావిస్తే అతనికి సహాయంగా పళ్ళెంలో డబ్బు వేస్తారు. అయ్యా మిగిలింది ఉంటే స్వామివారి హుండీలో వేయమని చెప్తారు దానం చేసే భక్తులు పళ్ళెంలో ఏది వేసినా అది స్వామి

కార్యానికే అని భావిస్తారు. మరికొందరు ఈ డబ్బు మీకు మరి ఈ రూపాయలు స్వామివారి హుండీలో వేయి అని వేస్తారు.

ఇలా జోగి అడిగే వ్యక్తి ఊరిలోని ప్రతి వీధికి పోయి అడుగుతారు. ప్రతి ఇంటివారు మేళతాళాల మోత విని బయటికి వచ్చి స్వామివారిని చూస్తారు. నమస్కారం చేస్తారు. కొంతమంది అయితే ఇంటిముందుకు స్వామి వచ్చాడని నీళ్ళు వారు పోసి అతి భక్తితో దండం పెట్టుకుంటారు. వీధి వీధి తిరగడం అయిన తర్వాత ఊరేగింపుతోనే ఇంటికి వెళతారు. దానితో దీక్షపూర్తి అవుతుంది. వచ్చిన డబ్బును కానుకలను స్వామివారి వద్ద పెడతారు. ఆ డబ్బుతోనే తిరుపతికి పోయి మొక్కు తీర్చుకుంటారు. సొంత ఖర్చు పెట్టుకోగలిగినవారు తమ డబ్బుతోనే అక్కడి ఖర్చులు పెట్టుకొని జోగు అడగగా వచ్చిన డబ్బు అంతా స్వామివారి హుండీలో వేస్తారు. అలా వేయడం అంటే ఊరిలో తమకు కానుకలు ఇచ్చిన ప్రతివారి భక్తిని స్వామివారికి అర్పించినట్లు భావిస్తారు. పోయిన ఇంటి వ్యక్తి తన తలనీలాలు సమర్పించి భార్య కూడా తలనీలాలు ఇస్తుంది. తర్వాత స్వామివారి దర్శనం చేసుకొని తర్వాత ప్రసాదం తీసుకొని వస్తారు. ఒక లడ్డు అయినా కొనగలిగినన్ని లడ్డూలు అయినా తీసుకొంటారు. అలా ఇంటికి వచ్చిన తర్వాత బొంగు పేలాలు దాదాపు రెండు డేగిశాలలో పెట్టుకొని తిరుపతి నుండి తెచ్చిన స్వామివారి లడ్డూలను ఆ పేలాలలో కలిపి వేస్తారు. అంటే ఉన్న ఒకటి రెండు లడ్డూలు మూడు నాలుగు ఇళ్ళ వారికి కూడా చాలవు అని ఇలా చేస్తారు. తర్వాతి రోజున ప్రతి ఇంటికి వెళ్ళి ఈ ప్రసాదాన్ని అందిస్తారు. స్వామివారి ప్రసాదాన్ని ప్రతివారు భక్తితో కళ్ళకు అద్దుకొని తింటారు. వారు కూడా స్వామిని చూసిన తృప్తిని పొందుతారు. తిరుమల స్వామిని దర్శించి వచ్చిన వారిని చూడడం వారిని తాకడం కూడా పుణ్యం అని భావిస్తారు.

అలా జోగి అడగడం వెనుక తాత్త్వికత ఒకటి ఉన్నది. బాగా డబ్బులున్న ధనవంతులు కూడా కొందరు జోగి అడిగి తర్వాతనే తిరుమలకు వెళతారు. ఇలా జోగి అడగడంలో ఉన్నది వ్యక్తులు తమలో ఉన్న అహాన్ని వదిలిపెట్టడం. పేదవారు వారికి సహాయం కోసం జోగి అడిగినా కూడా అందులో కూడా తమలో ఉన్న ఏ కొద్దిపాటి అహాన్నైనా వదిలిపెట్టడం. అంటే చేయి చాపి అడగడంలో అహాన్ని వదిలిపెట్టడం ఉంటుందా అనే సందేహం రావచ్చు. ఇది ఒకరకంగా భిక్షాటనవంటిదే తనకు గతిలేదని ఒకరిని యాచించడం తనవ్యక్తిత్వాన్ని చంపుకోవడంగా భావించేవారు ఎందరో ఉంటారు. అలా ధనవంతుడైనా దైవకార్యం కోసం భక్తికోసం యాచించడం అంటే భక్తిని యాచించి దాన్ని తిరిగి దైవానికి సమర్పించడమే ఇందులో మనకు కనిపిస్తుంది. అందుకే ఎవరైనా ఏదైనా ఇచ్చినప్పుడు కాని దానం చేసినప్పుడు కానీ 'కృష్ణార్పణం' అని కానీ 'దైవార్పణం' అని కానీ అంటుంటారు. అంటే ఇచ్చేది నేను కాదు ఇచ్చేది నీకు కాదు అని చెప్పడం. అలాగే గ్రహీత కూడా కృష్ణార్పణం అంటే కూడా ఇదే భావన వస్తుంది. జోగి అడగడం ద్వారా ఊరిలోని ఎందరో వ్యక్తులు స్వామివారిపట్ల వారు ప్రదర్శించిన భక్తిని గ్రహించడమే ఇక్కడ కనపిస్తుంది. ఇచ్చినవారి కానుకలు గ్రహించి తిరిగి వాటిని స్వామి వారి హుండీలో వేయడం కూడా తన గ్రామం వారి భక్తిని తాను మోసుకోపోయి స్వామివారికి అందించడమే ఇక్కడ కనిపిస్తుంది. ఈ జోగి అడిగే సంప్రదాయం తెలుగు జిల్లాలలో కొద్దిగా తేడాతో అన్ని గ్రామాలలో కనిపిస్తుంది.

ఇక తమిళనాడు వారు మరో పద్ధతిలో తమ దేహాన్ని క్లేశానికి గురిచేస్తు స్వామివారి దర్శనానికి వస్తారు. తమిళనాడులోనే ఎక్కడో మారుమూల గ్రామం నుంచి కొన్ని వందల కి.మీ. దూరమైనా సరే వారు మొక్కుకుంటారు. అదేమంటే కాలినడకన కొండకు వచ్చి తాము మొక్కు తీర్చుకుంటామని. తిరుమలలో నేటికీ తమిళం వారి మొగ్గు బాగా కనిపిస్తుంది. గుడిలో కూడా

వారి ప్రాముఖ్యం తక్కువేం కాదు. ఈ భక్తులు తమిళనాడు కింది దక్షిణాది జిల్లాలనుండి కూడా వస్తారు. వీరు అతితక్కువ సామాను అంటే ఒంటిమీద ఒక జతబట్టలు ఇంకా అవసరమైతే ఒక నీటిసీసా తీసుకొని బయల్దేరతారు. చేతిలో ఒక కర్ర ఉంటుంది. అలా పసుపుపచ్చ బట్టలు కట్టుకుంటారు. ఒక అడ్డధోతి, ఒక చొక్కా లేదా బనీను ఇదే అవతారం. రోడ్డు కుడివైపున నడుస్తుంటారు. దీనివల్ల ఎదురుగా వచ్చే వాహనాలు చూసుకుంటూ నడవవచ్చునని. వారు ఎవరినీ డబ్బు అడగరు. ఎదురుగా వచ్చే వ్యక్తులను కానీ దారిలో ఉన్న గ్రామాలలో కానీ ఎవరైనా భక్తులు వారికి భోజనం పెడితే స్వీకరిస్తారు. కానీ డబ్బు అడగరు. నీళ్లబాటిళ్ళు ఇవ్వమని నీరు ఉంటే ఇవ్వమని కూడా అడుగుతారు. ఇక తిరుమల తిరుపతి దేవస్థానం వారు అక్కడక్కడా చిన్న చిన్న పట్టణాలలో ఇలా వచ్చే భక్తులకోసం చిన్నచిన్న షెడ్లు గదులు కట్టారు. రాత్రికల్లా ఈ భక్తులు ఈ టిటిడి సత్రాలకు చేరుకుంటారు. అక్కడ పడుకోవడానికి స్నానం చేసి తయారు కావడానికి వసతులు ఉంటాయి. ఇక కొన్ని సత్రాలలో రాత్రిభోజన వసతిని కూడా కల్పించారు. తెలుగు జిల్లాలనుండి కూడా ఇలా చాలామంది కాలినడకన వారి ఊరినుండి తిరుమల కొండదాకా ఇలా నడిచిపోవడం ఇటీవల కనిపిస్తున్నది.

ఇలా వందలకొద్ది మైళ్ళ దూరం నడిచి తిరుమలకు వచ్చి స్వామిని దర్శించుకోవడంలోను రైల్లో, బస్సుల్లో విమానాలలో వచ్చి స్వామిని దర్శించుకోవడానికి తేడా ఏమిటి అని అనిపిస్తుంది. రెండింటిలోను భక్తి ఉన్నది. ఇలా కాలినడకన వందల మైళ్ళు నడిచి రావడంలో ఉన్నదేమంటే ఒక రకమైన ఆత్మహింసకు తన దేహాన్ని గురిచేయడం. ఇలా తనను తాను స్వామికి సమర్పించుకునే తత్త్వం దాగి ఉన్నది. ఆత్మహింస చేసుకొని దాన్ని ఒక సేవగా స్వామికి సమర్పించడం వీరశైవంలో చాలా ప్రధానమైన భక్తి. స్వామిపట్ల జానపదుల ఆధ్యాత్మికత ఇలా భిన్నభిన్న రూపాలలో ఉంటుంది.

## వేంకటేశ్వర స్వామి జానపద అవతారాలు

జానపద సంప్రదాయంలో వేంకటేశ్వరస్వామి ఆరాధన చాలా విస్తృతంగా ఉంది. జానపదులు తమ స్వామిని తమకు నచ్చిన రీతిలో చూడటం కథలు చెప్పుకోవడం ఆయనకు వారికి నచ్చిన రీతిలో పూజలు చేసుకోవడం కూడా ఉంది. జానపద దేవుడుగా కూడా తిరుమల వెంకన్న మనకు వేరువేరు ప్రదేశాలలో కనిపిస్తాడు. ఆయనకు అక్కడ భిన్న భిన్నమైన రీతుల్లో తిరునాళ్ళు జరగడం కూడా ఉంది.

అసలు తిరుమల వేంకటేశ్వరస్వామి ఇతిహాసం ఆయన పవిత్ర పురాణంలో ఆయన కలియుగంలోనికి ఈ తెలుగునేలపైన వెలసిన ఆ పవిత్రకథ కూడా జానపద కథారూపంలోనే ఉంటుంది. ఆ ఇతిహాసంలో లేదా పురాకథలో జానపదకథాంశం చాలాస్పష్టంగా ఉంటుంది. పురాకథ అంటే పవిత్ర కథ (a myth is a sacred narrative) అని ప్రత్యేకంగా చెప్పవలసిన పనిలేదు. ఆ కథని చూద్దాం.

తిరుమలలో తెల్లవారురఘామున అంటే తొలి మేలుకొలుపు చేయడానికి అంటే స్వామివారి ద్వారం తెరవడానికి సన్నిధి గొల్ల వస్తాడు. ఆయన వచ్చి తాళం తీసి తలుపు తీసి కాగడా పట్టుకొని గర్భాలయం వైపు వెళ్ళిన తర్వాతనే పూజారులు స్వామిసన్నిధికి చేరుకొని ఇతర పూజా కార్యక్రమాలు సేవా కార్యక్రమాలు మొదలవుతాయి. ఆ తర్వాతనే దర్శనాలు మొదలు అవుతాయి. ఈ సన్నిధిగొల్ల ఎందుకు ఇలా తీయాలి అని ప్రశ్నిస్తే దీనివెనుక ఉన్న పురాకథ బయటికి వస్తుంది. కొన్ని శతాబ్దాలుగా అంటే స్వామికి అక్కడ ఆలయం నెల కొన్న దగ్గరనుండి ఈ సన్నిధి గొల్ల వచ్చి తలుపులు తెరవడం ఆనవాయితీగా వస్తున్నది నేటికీ స్వామి ఆలయాన్ని తీసే హక్కు ఈ సన్నిధిగొల్ల వంశీకులకే ఉంది. ఇది కొనసాగుతున్న విధం తెలుసుకోవలసి ఉన్నది.

పురాకథ చెప్పడాన్ని గురించి వివరించేవారు A myth is told when the validity of a ritual is questioned? చెబుతుంది. అంటే ఒక క్రతువు జరిగే పద్ధతిని గురించి అడిగినప్పుడు అది అలా ఎందుకు జరుగుతుంది అని అడిగినప్పుడు సమాధానంగా చెప్పేదే పురాకథ అని అంటారు. ఇక్కడ సన్నిధి గొల్ల మాత్రమే ఎందుకు ఇలా తలుపుతీసే ఆచారం వచ్చింది అని అడిగినప్పుడే ఈ పురాకథ మనకు వ్యక్తం అవుతుంది.

“వైకుంఠంలో స్వామి వారిని భృగువు తన్నిన నేపథ్యంలో ఆయన దేవేరి లక్ష్మీదేవి అవమానంగా భావించి వైకుంఠాన్ని వీడి భూలోకానికి కొల్లాపురికి వస్తుంది. ఆ తర్వాత స్వామి ఆమెను వెదుకుకుంటూ భూలోకానికి వస్తాడు. తిరుమలలో ఒక అడవి ప్రాంతంలో ఒక పుట్టలో నివసిస్తాడు. ఆ ప్రాంతంలో ఒక పసులకాపరి తన ఆవులను కాస్తూ ఉంటాడు. ఆయన గోవులలో అన్నింటికన్నా ఎక్కువగా పాలిచ్చే గోమాత ఇంటికి వచ్చేసరికే పొదుగు ఖాళీగా కనిపిస్తుంది. ఏమైంది అని ఆ పశువులకాపరి దంపతులు ఆశ్చర్యపోతారు. ఆ తర్వాతి రోజు కూడా ఇలాగే జరుగుతుంది. ఇలా అయితే ఈ పాలు లేకపోతే తమ జీవనాధారం ఎలా అని బాధపడి ఒక రోజున ఆ గొల్ల ఆ ఆవును కనిపెట్టి ఎవరు పాలు దొంగతనంగా పితుకుతున్నారో పట్టుకోవాలని జాగ్రత్తగా చూస్తుంటాడు. సాయంత్రం కాబోయేముందే కాస్త అతను కన్నుపక్కకు తిప్పిన క్షణాన ఆవు తప్పించుకొనిపోయింది కొద్ది క్షణాలలో తిరిగి వచ్చింది. అప్పటికే ఆవు పొదుగు చీకివేసిన మామిడి టెంకెలాగా కనిపించింది అతను ఆశ్చర్యపడ్డాడు ఇంటికి వచ్చిన తర్వాత తన ఇల్లాలికి జరిగినది చెప్పాడు. ఆతర్వాతి ఎలాగైనా తెలుసుకో ఏం జరుగుతుందో పట్టుకోవాలి అని ఇద్దరూ భావించారు. ఆతర్వాతి రోజున బాగా కాపలా కాస్తూ ఆవు ఎటు పోతున్నదో గమనించి దాని వెనుకనే వెళ్ళాడు గొల్ల, అది ఒక పుట్ట దగ్గరికి వచ్చింది. పుట్టమీదికి తన పొదుగు వచ్చేలాగా నిలబడి పాలు ధారగా వదలడం మొదలు పెట్టింది. ఆ పుట్టలో ఏదో శక్తి ఉందని భావించిన గొల్ల ఆ ఆవును కర్రతో గట్టిగా

కొట్టబోతాడు. పుట్టకింద ఉన్న స్వామి ఆ ఆవును తప్పించి ఆ దెబ్బని తాను గ్రహిస్తాడు. తలకు గాయం అయి రక్తం ఓడుతుంది. స్వామి ప్రత్యక్షం అవుతాడు. అప్పటికే మూర్ఛపోయిన ఆ గొల్ల తేరుకొన్న తర్వాత క్షమించమని కాళ్ళమీద పడతాడు. అప్పుడు స్వామి అతనిని లేపి నాకు ప్రతిరోజు ఆహారం నీవల్లనే దొరికింది కనుక నీకు ఏ దోషంలేదు పాపం లేదు. ఈ కలియుగంలో నన్ను మొదట చూచినది నీవే కనుక నీకే నా ఆలయంలో మొదటి దర్శనం లభిస్తుంది అని వరం ఇచ్చాడు. అందుకే అతని వంశీకులైన గొల్లలకే నేటికీ తొలిదర్శనం చేసుకునే అధికారం ఉంది. అది వంశపారంపర్యంగా వస్తున్నది. బ్రిటిషు మహంతుల కాలంనుంచి ఇదే కొనసాగి వస్తున్నది. తెల్లవారు ఝామున 2.30 గం॥లకు కాగడా పట్టుకొని సడుస్తూ అర్చకులను తన వెనుక తీసుకొని సన్నిధి గొల్ల నడుస్తాడు. అతనివద్ద ఉన్న తాళంచెవితో ఆలయ గర్భాలయం ద్వారం తెరుస్తాడు. దివిటీతో దీపాలు వెలిగించి స్వామి వారిని దర్శించుకున్న తర్వాత సుప్రభాతసేవ మొదలు అవుతుంది. వేర్వేరు కైంకర్యాలు సేవలు పూర్తి అయిన తర్వాత తిరిగి రాత్రి సమయంలో నైవేద్యం సమయంలోను సన్నిధిగొల్ల అర్చకులను ఆలయంలోనికి తీసుకుపోతాడు. ఇక రాత్రివేళ శ్రీవారి ఏకాంతసేవ పూర్తి అయిన తర్వాత ఆలయానికి తాళాలు వేసి జియ్యంగార్లు భద్రపరుస్తారు."

ఇది నేను తిరుమలలో ఒక వ్యక్తి వద్దనుండి సేకరించిన కథ దీనికి కొంత భిన్నమైన కథారూపాలు కూడా ఉన్నాయి. స్వామి ఆ గొల్లను శపించినట్లుగా ఆ గొల్ల చోళరాజుకు చెందినవాడుగా ఇలా ఉంటాయి. ఇక ఈ కథ కొంత భిన్నంగా వేంకటాచల మాహాత్మ్యం అనే పురాణంలో కూడా ఉంది. కొంత భిన్నంగా ఉంటుంది. ఈ ఆవుగా బ్రహ్మ, దూడగా శివుడే భూమి మీదికి వచ్చారని ఈ పురాణకథ చెబుతుంది. ఇది సంస్కృత సంప్రదాయంలో, అష్టాదశ పురాణాలలో భాగంగా వచ్చింది. అయితే ఈ పురాకథకు మూలం పైన చెప్పిన జానపద కథే కావచ్చు. గోవు పుట్టవద్దకు

పోయి పాలు కురవడం అనేది ఒక జానపద కథాంశం. ఇది వేర్వేరు జానపద కథల్లో ఉంది. ఇదే అంశంతో ఉన్న జానపద కథను విశ్వనాథ సత్యనారాయణ గారు తన వేయి పడగలు నవలలో రచించారు.[20]

ఇక్కడ విశ్వనాథ తన వేయిపడగలు కథకు వేదికగా ఉన్న సుబ్బన్నపేట స్థల పురాకథని చెబుతూ ఒక గోవు పుట్టపైకి వచ్చి పాలు వదిలిన కథని రచించారు. అయితే పైన కథలో ఆవు పాలు కురిపించింది స్వామి వారికైతే విశ్వనాథ కథలో ఆవుపాలు కురిసింది వేయి శిరస్సుల నాగేంద్రునికి నవల మొత్తానికి ఈ కథ ఆధారభూతం అవుతుంది. పుట్టిన పసిబిడ్డ అడవిలో ఒంటరిగా ఉండి ఏడుస్తుంటే గోమాత ఒకటి వచ్చి ఆ పసిబిడ్డకు తన క్షీరాన్ని నోట్లో కురిపించి బతికించిన కథలు ఉన్నాయి. ఇది ఒక అద్భుత కథాంశంగా జానపదవిజ్ఞానులు గుర్తించారు.

అయితే పైన చెప్పిన స్వామివారి కథ జానపద సంప్రదాయంలో శతాబ్దాలుగా ఉంది. నేటికీ ఈ కథ వేర్వేరు తెలుగు జిల్లాలలో తిరుగుతూ ఉనికిలోనే ఉన్నది. నేను నా క్షేత్ర పరిశోధనలో ఈ కథను విన్నాను. స్వామివారి కథ జానపద సంప్రదాయంలో విస్తృతంగా అలా ప్రచారం ఉన్నది అంటే అది పురాణ కథకన్నా తక్కువ విలువైనది అని అర్థం చేసుకోకూడదు. జానపదుల నోళ్ళలో ఉన్న కథాసాహిత్యమే ఆ పురాకథలే తర్వాతి కాలంలో లిఖిత సంప్రదాయంలోనికి పోతాయి. ఇది విశ్వవ్యాప్తంగా ఉన్న సామాజిక ప్రక్రమం. ఇక జానపద సంప్రదాయంలో స్వామివారి ఆరాధన ఇంకా ఎలా ఉందో చూద్దాం.

కురుమూర్తిస్వామి కథను నేటికీ సాగుతున్న ఆ ఆచారాన్ని తప్పక తెలుసుకోవలసి ఉంది. మహబూబ్‌నగర్ జిల్లా చిన్నచింతకుంట మండలంలో కురుమూర్తి అనే చిన్ని గ్రామం ఉంది. కురుమూర్తి కొండ అనే కొండ అక్కడ ఉంది. కురుమూర్తిస్వామి ఆ కొండపైన ఉండబట్టే దానికి కురమూర్తికొండ అనే పేరు వచ్చింది అనికూడా అంటారు. కురుమూర్తి

అనే గ్రామంలో ఉన్నది కాబట్టి ఆ పేరు కూడా వచ్చి ఉండవచ్చు. ఆ ప్రాంతంలో కొన్ని వందల సంవత్సరాల క్రితం కురుమయ్య అనే గొప్ప వ్యక్తి ఉండేవాడని గోపులు కాసుకున్నా అతను ప్రజలందరి మేలుకోరి పసులు చేసేవాడని పశువులకు మనుషులకు ఉచితంగా వైద్యం చేసేవాడని అతను కొండమీద ఉన్న స్వామికి భక్తుడని అచంచల భక్తి కలిగి ఉండేవాడని. కొన్నాళ్ళకి అతను హఠాత్తుగా వేరేవారి కుట్రవల్ల చనిపోయాడని ప్రజలు అతడిని దేవుడులా భావించి పూజించారని. అతడు చనిపోయి కొండమీద ఉన్న స్వామిలో కలిసిపోయాడని అప్పటినుండి కొండమీద ఉన్న వేంకటేశ్వర స్వామిని కురుమూర్తిస్వామి అని పిలుస్తున్నారని ప్రజల్లో ఒక కథ. ఈ ప్రాంతంలో ప్రచారంలో ఉంది. అయితే ఈ కథని ఆ గుడిలో ఉన్న పూజారులు అంగీకరించలేదు. కురు అనే పదానికి చేయుము అని చెప్పడం అని ప్రజలు భక్తులు కోరుకున్న పనులు అన్నీ చేసేవాడా స్వామి అని అందుకే కురు అంటే చేయు అనే పదం మీదనుండి కురుమూర్తి అంటే అన్ని పనులు చేసేవాడని అంటే భక్తుల కోర్కెలు అన్నీ తీర్చేవాడని ఆ పూజారి అర్థం చెప్పాడు. ఇది స్పష్టంగా ఉన్న విషయాన్ని సంస్కృతీకరించి, పండితీకరించి కొత్త అర్థం చెప్పే ప్రయత్నం అని జానపద సంప్రదాయాన్ని కాదని పక్కకు నెట్టే ప్రయత్నం బాగానే తెలియవస్తున్న విషయం. కురుమూర్తి గ్రామంలో ఉన్న స్వామి కురుమూర్తి స్వామి కావచ్చు అందులో ఏవిధమైన అభ్యంతరం ఉండనక్కరలేదు. కొండమీద ఉన్న స్వామి కొండలరాయడు అయినట్లు, మలయప్ప అయినట్లు తిరుమల స్వామి అయినట్లు కురుమూర్తి కావడంలో వింతేమీ లేదు. ఇక కురుమూర్తి స్వామి అసలు కథని చూద్దాం. అందులో ఉన్న జానపద సంప్రదాయం ఏమిటో జానపదుల ఆధ్యాత్మిక ఏమీటో చూద్దాం.

తిరుమల వేంకటేశ్వరస్వామి వారికి కుబేరుని బాధ ఎక్కువైంది. వడ్డీ కట్టమని బాగా వేధిస్తున్నాడు. ఒకనాడు అమ్మవారు ఈ బాధ చూడలేక

స్వామీ! మనం ఎప్పుడూ ఇక్కడ ఇలా ఉండడమేనా? ఎక్కడికన్నా బయటికి విహారానికి పోయి చూచివద్దాం అంటుంది. అలా స్వామి వారు అమ్మవారు ఆకాశమార్గాన అన్నీ చూచుకుంటూ విహారం చేస్తున్నారు. అలా వస్తుండగా ఒకచోట చాలా ఆహ్లాదకరమైన పచ్చని చెట్లు, ఏఱు కనిపించింది. అంతేకాదు అక్కడ కూడా ఏడుకొండలు అందంగా వరుసలో కనిపించాయి. స్వామీ! ఇక్కడ చాలా బాగుంది కిందికి దిగుదామా! కొంత సమయం ఇక్కడ గడుపుదామా! అని అడిగింది. దాంతో స్వామివారు కూడా ముచ్చటపడి అక్కడ దిగి ఉండాలని అనుకొని ఇద్దరూ కిందికి దిగుతారు. దిగి ఆ ప్రాంతం అందాలు చూచుకుంటూ ఆ కొండలలో తిరుగుతూ నడిచారు. అలా సాయంత్రం వరకు నడవగానే స్వామివారికి, అమ్మవారికి పాదాలు కంది పొక్కినాయి.

వారు తిరిగిన ఆ ప్రాంతం నేటి మహబూబ్ నగర్ జిల్లా వడ్డెమాను కురుమూర్తి అమ్మపురం గ్రామాలున్న ప్రాంతం. వడ్డెమాను వద్ద ఉన్న వాగు. ఇలా వారు నడిచి అలసిపోయారు.

ఆ రాత్రి అమ్మపురం గ్రామం గూడెంలో నివసించే ఒక చర్మకారి అయిన భక్తునికి కల వచ్చింది. ఆ స్వప్నంలో స్వామివారు అతనికి కనిపించి ఏమయ్యా? నేను ఇంతగా నడుస్తున్నాను. చెప్పులు లేక నా కాళ్ళు కందిపోయి బొబ్బలు పొక్కి నడవలేని స్థితిలో ఉన్నాను. నాకు చెప్పులు కుట్టి తేలేవా? అని అడిగాడు. దాంతో ఆ చర్మకారి అయిన అమాంతం ఉలిక్కిపడి నిద్రలేచాడు. తెల్లవార వస్తున్నది, కోళ్ళు కూస్తున్నాయి. లేచి చూసుకుంటే తనకు వచ్చింది కల అని, కలలో స్వామి అలా మాట్లాడాడు అని తెలుసుకున్నాడు. సంతోషం పట్టలేక ఈ విషయాన్ని తన ఇల్లాలు, పిల్లలతో చెప్పాడు. బాగుంది కలలో వచ్చింది నిజంగా ఉంటదా ఎక్కడన్నా ఏం తలచుకొని పడుకున్నవో? నీకు ఏం కలవచ్చిందో చాల్లే? అని ఇంటివారు

ఎక్కిరించి కొట్టిపారవేశారు. కాని తర్వాతి రోజున ఆ చర్మకారికి అదేరీతిలో కలవచ్చింది. తర్వాత కూడా అతను తనవారికి అదేరీతిని జరిగింది చెప్పాడు. వారు నవ్వి అయితే స్వామి ఎక్కడుంటాడో ఆయన కాలు ఎలా ఉంటుందో తెలియకుండా చెప్పులు ఎలా కుడతావు. కాబట్టి కుదరదు. కానీ మళ్ళీ ఇదే పద్ధతిలో కలవస్తే ఆయన్ని అడుగు నీ పాదం కొలత నాకు ఎట్లా తెలియాలి? తమరు ఎక్కడ ఉన్నారో? అని కనుక్కో. అప్పుడు ఆయన సమాధానం చెబితే అక్కడ ఆయన ఉంటే ఆయన పాదం కొలత తెలిస్తే అప్పుడు అది కలకాదు అది స్వామివారే అని నమ్ముదాము. ఆయనకు పూజ చేద్దాం' అని చెప్పారు.

తర్వాతి రాత్రి ఆ చర్మకారి అదేవిధంగా కల వచ్చింది. అప్పుడు స్వామిని అతడు స్వామీ! మీరు ఎక్కడ ఉంటారో తెలియదు మీ పాదం ఎంత పొడుగు ఉంటుందో తెలియదు కాబట్టి నేను చెప్పులు ఎలా చేయాలి? ఆ వివరాలు చెప్పండి అని అతను స్వామిని అడిగాడు. దాంతో స్వామి మీ ఊరుబయట వాగు ఉంది కదా! అక్కడ ఇసుకలో నా పాదముద్రలు ఉన్నాయి. దానికొలత ప్రకారం చెప్పులు కుట్టు. ఆ తర్వాత దగ్గరలో ఉన్న కొండమీద గుహలో నేను ఉంటాను. అక్కడికి చెప్పులు తెచ్చి ఇవ్వు అని కలలోనే ఆనతి ఇచ్చి అంతర్ధానం అయ్యాడు. చర్మకారి ఆశ్చర్యంలో నుంచి కోలుకొని తన ఇంటివారిని లేపి జరిగిన విషయం చెప్పాడు. పూర్తిగా తెల్లవారిన తర్వాత ఊరిబయట ఉన్న వాగు ఒడ్డుకు చేరితే అక్కడ స్వామివారి పాదాలు కనిపించినాయి. పాదం ఒకటి రెండు అడుగుల పొడవున పెద్దగా ఉంది. ఆ చర్మకారుని కళ్ళు చెదిరిపోయాయి. ఏ మనిషి పాదం కూడా ఇంత పెద్దగా ఉండదు. ఇది దేవుడి పాదమే అని అనుకొని తాను తెచ్చుకున్న పుల్లలతో దానికొలత తీసుకొని ఆ పాదముద్రలకు దండం పెట్టుకున్నాడు. ఇంటివారు అందరూ వాటిని చూచి అలాగే దండం పెట్టుకుని తాము ఎంత అదృష్టవంతులం స్వామి తమ ఇంటిని పావనం చేశాడు అనుకొని

ఇంటికి పోయారు. ఇంటికి పోయి పూజ చేసుకొని ఒక పవిత్రకార్యంగా చెప్పులు కుట్టాడు. తర్వాత తన కుటుంబసభ్యులు మాత్రమేకాక ఊరిగూడెంలో ఉన్న వారందరూ అందరూ ఆ చెప్పులను మేళతాళాలతో ఊరేగిస్తూ స్వామి చెప్పిన కొండమీద గుహలోనికి తీసుకుచ్చారు. అక్కడ స్వామివారు, అమ్మవారు వారికి దర్శనం ఇచ్చారు. వారికి భక్తితో చెప్పులు సమర్పించి స్వామి ఆజ్ఞను శిరసావహించినట్లు దండం పెట్టుకున్నారు.

ఆ గ్రామమే నేటి మహబూబ్ నగర్ జిల్లా చిన్నచింతకుంట మండలం అమ్మపురం పక్కనున్న వడ్డెమాను. ఆ కొండ ఉన్న గ్రామం కురుమూర్తి. ఆనాటినుండి అమ్మపురం వడ్డెమాను గ్రామాల చర్మకారులు వంతులవారీగా స్వామివారికి చెప్పులు చేస్తున్నారు. దీపావళికి నెలరోజులు ముందునుండే మొదలుపెడతారు. ఒక పూజచేసి స్వామివారికి చెప్పులు తయారు చేయడం మొదలుపెడతారు. దీనికి అవసరమైన ఆవుతోలును పక్కన ఉన్న కర్నూలు జిల్లాలోని ఒక గ్రామంలో ఉండే ఒక చర్మకారుని ఇంటినుండి తెస్తారు. నేటికీ అదేవిధంగా తెస్తారు. దీపావళికి ఒకరోజుముందు ఈ చెప్పులను మేళతాళాలతో ఊరేగింపుగా తెస్తారు. కొండమీద ఇంకా పూర్తిగా గర్భాలయం ఉన్న గుహకన్నా కిందిభాగంలో ఒక మండపం ఉంది. దాన్ని ఉద్దాల మండపం అని అంటారు. ఈ ప్రాంతంలో 'ఉద్దాలు' అనే పదం ఉంది. అంటే చెప్పులు అనే అర్థం. ఆ మంటపంలో ఆ స్వామివారి చెప్పును ఉంచుతారు. అంతకన్నాముందు వాటిని స్వామివారికి చూపి నైవేద్యం పెట్టినట్లుగానే భావించి తర్వాత మంటపంలో ఉంచుతారు. అలా మూడు రోజులు జాతర జరుగుతుంది. ఈ మూడురోజుల్లో సుమారు లక్ష నుండి రెండు లక్షల భక్తులు జానపదులు ఈ 'ఉద్దాల' మండపానికి వచ్చి ఆ చర్మకారుని చేతిమీద స్వామివారి చెప్పుతో తలమీద, వీపుమీద దెబ్బ కొట్టించుకుంటారు. తర్వాత స్వామివారిని దర్శించుకుంటారు. చుట్టుపక్కల గ్రామాల వారు అందరూ అలా చెప్పుతో కొట్టించుకుంటారు. అలా స్వామి

చెప్పుతో దెబ్బలు తినడం స్వామివారి ఆశీస్సుగా భావిస్తారు. చాలా పవిత్రకార్యంగా కూడా భావిస్తారు.

ఈ చెప్పులు తయారు చేయడానికి ప్రభుత్వం వారు ఇటీవలి కాలంలో ఒక ప్రత్యేకమైన చిన్న భవనాన్ని కట్టారు. అక్కడే దీపావళికి రెండు వారాలముందు ఈ పవిత్రకార్యం చెప్పులుకుట్టే పనిని చర్మకారులు కుటుంబాల వారు, వారసత్వం ఉన్నవారు మొదలుపెడతారు. సుమారు 700 సం॥ల నుండి ఈ పవిత్రకార్యం నేటికీ నిర్విఘ్నంగా సాగుతున్నది అని అక్కడి చర్మకారులు, గ్రామస్థులు వివరంగా చెప్పారు.

ఇక్కడ స్వామి ఒక గ్రామదేవతగా కనిపిస్తారు. ఈ మూడు రోజులు జరిగే జాతర ఒక గ్రామదేవతకు జరిగే జాతరలాగే కనిపిస్తుంది. కాకుంటే ఇక్కడ బలి ఇవ్వడాలు ఉండవు. జాతరలో ఎన్నో రకాలు దుకాణాలు వెలుస్తాయి. ఎన్నో వస్తువులు తినుబండారాలు అమ్ముతారు. పెద్ద కోలాహలంగా సాగుతుంది. ఈ కురుమూర్తి స్వామికి నిత్యపూజలు, కైంకర్యాలు మాత్రం మిగతా ఆలయాలలో జరిగిన పద్ధతిలోనే జరుగుతాయి. ఇక్కడ కూడా స్వామి నిలబడే ఉంటారు. కానీ నాలుగు అడుగుల ఎత్తులోనే ఉంటారు. ఈ జిల్లాలో కురుమూర్తిస్వామి (వేంకటేశ్వరస్వామి) పండుగ మూడురోజుల జాతర చాలా పెద్దజాతరగా ఉత్సవంగా, పండుగగా భావిస్తారు. అంటరానివారుగా భావించబడిన చర్మకారులు గ్రామానికి దూరంగా ఊరివారిచే పంపబడిన చర్మకారుచే చెప్పు అదే చర్మకారులు ఊరందరి వీపులమీద కొట్టడం ఇక్కడ గుర్తుంచుకోవలసిన పెద్ద విశేషం. ఇదీ స్వామివారి మహిమ అని జానపదులు భావిస్తారు.

**బేటరాయస్వామి :** తిరుమల వేంకటేశ్వరస్వామి వారికి మరికొన్ని జానపద రూపాలున్నాయి. అందులో బేటరాయస్వామి ఒకటి. కర్ణాటకలో బేటరాయస్వామి ఆలయాలు చాలాచోట్ల కనిపిస్తాయి. చిత్తూరు జిల్లాలో బేటరాయస్వామి గుడులున్నాయి. రాయలసీమలోని వేర్వేరు గ్రామాలలో

కూడా బేటరాయస్వామి గుడులు కనిపిస్తాయి. తమిళనాడులో కూడా బేటరాయస్వామి గుడులున్నాయి. కృష్ణగిరి జిల్లా డెంకణికోటలో ఈ గుడి చాలా ప్రసిద్ధమైనది. బేటరాయస్వామి దేవేరి సుందరవల్లి. బేటరాయస్వామి అంటే వేటకు వెళ్ళిన వేంకటేశ్వరస్వామి లేదా విష్ణువు అని అర్థం. కుప్పం మండలంలో ఉన్న బేట్రాయిస్వామి కొండ చాలా ప్రముఖమైనది. వేలకొద్ది జనం వార్షిక జాతరకు వస్తారు. పైన కొండమీద స్వామి గుడిలో పూజలు మిగతా పురాణ దేవతల గుడులలో జరిగిన తీరులోనే జరుగుతాయి. కల్యాణోత్సవాలు కూడా జరుగుతాయి. అయినా ఈ ఉత్సవాలు అన్నీ గ్రామదేవతల జాతరల మాదిరిగా ఉంటాయి. తెల్లవారుజామునే మెట్టుపూజ జరుగుతుంది. ఎద్దు ఎక్కడం అనే సంప్రదాయ ఆచారం జరుగుతుంది. ఇదే బేట్రాయస్వామి ప్రత్యేకత. అందువల్లనే బేటరాయస్వామి లేదా బేట్రాయస్వామి అంటే వేంకటేశ్వరునికి ఉన్న జానపదరూపం అని చెప్పుకోవాలి. రాయలసీమలో 'బేట్రాయిస్వామి దేవుడా' అనే జానపదగీతం చాలా విస్తృత ప్రచారంలో ఉన్న జానపదులు పాడుకునే పాట. జానపదుల ఆధ్యాత్మికతలో బేటరాయస్వామి ఒక భాగం. కుప్పం మండలం ఊర్ల ఓబనపల్లి గ్రామంలో కొండమీద ఉన్న బేటరాయస్వామి దేవునికి తమిళ సంప్రదాయం ప్రకారం పెరటాసి మాసం మూడవ శనివారంనాడు కళ్యాణం జరిపిస్తారు. కుప్పం మండలంలోని మున్సిపాలిటీకి దగ్గరలో ఉన్న పరమసముద్రం గ్రామంలో కొండపైనున్న బేటరాయస్వామికి మూడురోజుల జాతర జరుగుతుంది. కర్ణాటక తమిళనాడు రాష్ట్రాలనుండి కూడా వేలమంది ఇక్కడికి వస్తారు. స్వామి కళ్యాణం జరిపే రోజున తెల్లవారుజామునే అప్పుడప్పుడే పొద్దుపొడుస్తున్న సమయంలో ఒక ఎద్దును కొండకింద పూజించి దాన్ని కొండమీదికి తీసుకుపోయి స్వామివారికి దర్శనం చేయిస్తారు. ఇది స్పష్టంగా జానపద సంప్రదాయంగానే మనకు కనిపిస్తుంది. వ్యవసాయ సంస్కృతికి నిదర్శనంగా కూడా దీన్ని మనం చూడవచ్చు. మూడు రోజుల

జాతర పెద్ద ఎత్తున జరుగుతుంది. వేలాదిమంది వచ్చి పూజలు చేస్తారు. మహబూబ్‌నగర్ జిల్లాలోనే ఉన్న మన్నెంకొండ వేంకటేశ్వరస్వామి కూడా 'పేదల దేవుడు' అని జానపదుల దేవుడని ప్రసిద్ధి. ఈ కొండమీద కూడా దేవునికి రెండు, మూడు రోజుల జాతర చేస్తారు.

వేర్వేరు బేట్రాయస్వామి దేవాలయాలలో బ్రాహ్మణేతలు కులాల పూజారులుగా ఉండడాన్ని గమనించాలి. పైన చెప్పుకున్న కురుమూర్తి గుడిలో కూడా బ్రాహ్మణేతర కులాలవారి (బిసి) పూజారులే ఉన్నారు.

వేర్వేరుచోట్లలో బేటరాయస్వామిని గురించి కథ చెప్పినప్పుడు స్థానికంగా అటవీ ప్రాంతాలలో క్రూరజంతువులు ప్రజలను చంపివేస్తూ భయోత్పాతాన్ని కలిగిస్తున్నప్పుడు ప్రజలు దేవుని ప్రార్థించగా విష్ణువు లేదా వేంకటేశ్వర స్వామివారు గుర్రం ఎక్కి వీరుడుగా వచ్చి జంతువులను వేటాడి ప్రజలకు రక్షణ కల్పించాడని అందువల్ల ఆయనను 'వేటవీరుడు'గా పూజిస్తారని తెలుస్తున్నది. గ్రామీణ జానపదుల భక్తిని ఈ స్వామి ఇలా పొందుతున్నాడు. వెయ్యి సంవత్సరాల నాటి బేటరాయస్వామి దేవాలయాలు కూడా కర్ణాటకలో ఉన్నాయంటే ఈ జానపదుల ఆరాధనా సంప్రదాయం ఎంత పాతదో మనం గ్రహించవచ్చు. కర్ణాటకలోని తిరువీకెరెలో 1194 ప్రాంతంలో ఒక రాక్షసుడు జంతువులు రూపంలో వచ్చి ప్రజలకు ఎంతో బాధలు కలిగించాడు. అక్కడి ప్రజలు విష్ణువును ప్రార్థించగా ఆయన పైన చెప్పిన వీరునిలాగా వచ్చి రక్షించాడు. 1194లో హెబ్బార్ చౌడయ్య అనే ఆయనకి బ్రహ్మతీర్థంలో ఒక పుట్టలో ఒక విగ్రహం కనిపించింది. దాన్ని గ్రహించిన ఆయన ఒక పుట్టదగ్గర ఒక ఆవు ప్రతిరోజు పాలు కురిపించడాన్ని ఈయన చూచాడు. అక్కడ స్వామి ఉండడాన్ని చూచి చౌడయ్య అక్కడే ఆ బేటరాయ విగ్రహానికి గుడిని నిర్మించాడని స్థానిక జానపదకథనాల వల్ల తెలుస్తున్నది. హొయసల రాజు రెండవ వీరబళ్ళాలుడు, ఆయన దేవేరి ఇద్దరూ ఈ గుడిని పోషించినట్లు స్థానిక కథనాలున్నాయి. జానపదుల

ఆరాధనా సంప్రదాయంలో ఇలా మనకు వేంకటేశ్వరస్వామి వేర్వేరు రూపాలలో పూజలు అందుకుంటున్నాడు. మన తిరుమల వెంకన్న పురాణకథలో కూడా ఇదేతరహా కథాంశం ఉండడాన్ని మనం ముందే గమనించాము.

## పురాణదేవతలు జానపదుల భక్తి

జానపదుల ఆధ్యాత్మికతను చర్చించే నేపథ్యంలో వేంకటేశ్వరస్వామి చుట్టూ ఉన్న జానపద సంప్రదాయాలను చర్చించాము. ఇదేవిధంగా జానపదులు వేరువేరు పురాణ దేవీ దేవతలను ఆరాధిస్తారు.

'పురాణదేవతల గురించి వారి పురాణ కథల గురించి జానపదులకు విజ్ఞానం ఎలా లభిస్తుంది. వారికి ఆరాధనా సంప్రదాయాలు ఎలా తెలుస్తాయి. ఎంత పురాతన కాలంనుండి మనకు పురాణదేవతలను కొలిచే సంప్రదాయాలు ఉన్నాయి అనేవి' చాలా అవసరమైన ప్రశ్నలు.

పురాణాలు కానీ వేరే సాహిత్యం కానీ ఏ దేశంలో ఏ భాషలోనైనా సాహిత్యం అనేది ముందుగా మౌఖిక మాధ్యమంలోనే ఉంటుంది. తర్వాతనే ఈ పురాణాలు ఆయా భాషల్లో లిఖిత సాహిత్యం అభివృద్ధి చెందిన క్రమంలో ఆయా పురాణగాథలు లిఖిత సాహిత్యంలోనికి చేరతాయి. ఏ భాషలోనైనా కూడా ఇదేక్రమం జరిగింది. నేటికీ జరగుతున్నది. ద్రావిడ భాషలు 27 ఉంటే అందులో ఐదు భాషలకే లిపి లేఖన సంప్రదాయం ఉన్నది. కొన్ని గిరిజన భాషకు ఇటీవలి కాలంలో కొందరు భాషావేత్తలు లిపిని రూపొందించినా ఈ భాషల్లో సాహిత్యం నేటికీ మౌఖికంగానే ఉంది. దక్షిణ కన్నడ ప్రాంతంలో ఉన్న తుళుభాషకు ఇటీవలి కాలందాకా లిపిలేదు. కన్నడ లిపి ఆధారంగా ఇటీవలి కాలంలోనే దానికి కొత్త లిపిని రూపొందించారు కొందరు భాషావేత్తలు. కానీ ఎప్పటినుండో తుళుభాషకు గొప్ప సాహిత్యం ఉంది. మన పురాణాలు కూడా అందులో ఉన్నాయి.

ఇవితప్ప మిగిలిన ద్రావిడ భాషలకు లిపి కానీ లిఖిత సాహిత్యం కానీ లేవు. కానీ ఈ అన్ని గిరిజన భాషలలో పురాణకథలు వేల సంవత్సరాల నుండి ప్రచారంలో ఉన్నాయి. తోటివారి ప్రదర్శన సాహిత్యంలో మహాభారతం అంతా మనకు తెలుగులోనే మౌఖికంగా లభిస్తుంది. ఇలా పురాణ కథలను మౌఖికంగా చెప్పే జానపద ప్రదర్శన సంప్రదాయాలు నేటికీ తెలుగులో చాలా విస్తృతంగా ఉన్నాయి.

ఈ జానపద ప్రదర్శనలుకాక తెలుగు జానపదులకు కానీ భారతీయ భాషలలో ఉన్న ఇతర జానపదులకు కానీ వేర్వేరు నాటకాలు యక్షగానాలు, ఇంకా భిన్నరూపాలలో ఉన్న ప్రదర్శనకళలు, జానపద ప్రదర్శన కళలు శతాబ్దాలుగా అందుబాటులో ఉన్నాయి. ఈ అన్ని కళారూపాల వల్లనే మనకు పురాణ కథలు నిరక్షరాస్యులైన ప్రజలను జానపదులను చేరాయి. ఈ పురాకథల ద్వారానే జానపదులకు పురాణ దేవీ దేవతలు అందరూ బాగా తెలిసినవారు. వారిపైన భక్తి అదేవిధంగా ఏర్పడింది. దీన్నిబట్టే పురాణ దేవతలపట్ల జానపదుల భక్తి ఈనాటిది కాదని ఇది అత్యంత ప్రాచీన కాలంనుండి ఉన్నదని మనం గ్రహించవచ్చు.

దక్షిణభారతంలో పురాణ దేవతలు బాగా ప్రసిద్ధంగా జానపదుల భక్తిని పొందేవారు కొందరిని ఈ సందర్భంగా ఇక్కడ పరిశీలించవచ్చు. రాముడు, కృష్ణుడు, (కృష్ణునికున్న వేర్వేరు రూపాలు పేర్లతోసహా) శివుడు, గణపతి లేక వినాయకుడు, సుబ్రహ్మణ్యస్వామి, ఆంజనేయుడు. వీరు ప్రధానంగా తెలుగు రాష్ట్రాలలో జానపదుల పూజలందుకుంటున్నారు.

పాండవులను ద్రౌపదిని ఆరాధించే సంప్రదాయం చిత్తూరు జిల్లాలో అంటే తమిళనాడు ప్రాంతానికి ఆనుకుని ఉన్న ప్రాంతాలలో చాల విస్తృతంగా ఉన్నది. పాండవులకు సాధారణంగా ఇతర ప్రాంతాలలో గుడులు ఆరాధనలు ఉండవు. కానీ ఈ ప్రాంతాలలో ధర్మరాజు గుడులు అని, కాకుంటే ద్రౌపది గుడులు అని ఉన్నాయి. పాండవులు పురాణ పాత్రలు కానీ జానపద

సంప్రదాయంలో చాలా విస్తృతమైన ఆరాధనా సంప్రదాయం వీరిపట్ల ఏర్పడింది.

**రాముడు రామాలయాలు :** పైన చెప్పుకున్నట్లు పురాణ కథలు మొదట నోటి సాహిత్యంగా ఉండి తర్వాతనే లిఖిత మాధ్యమంలోనికి చేరిన తీరును గమనించి తెలుసుకోవడానికి రామాయణం భారతంలో కూడా సాక్ష్యాలు కనిపిస్తాయి. వాల్మీకి రామాయణ కాలంలోనే ఉండి కుశలవులకు రామాయణ కథని పాడడం నేర్పించాడని, వారు మార్గపద్ధతిలో కాకుండా దేశిపద్ధతిలో అందరికీ అర్థమయ్యేలా అయోధ్యానగరంలో ఇతర ప్రాంతాలలో గానం చేశారని ఉత్తర రామాయణ కథ చెబుతుంది. రాముని ఆస్థానంలో కుశలవులు రామాయణ కథని పాడినప్పుడు రాముడు దాన్ని విని పరవశం చెంది. నాయనలారా! మీరు ఈ రామాయణాన్ని దేశి పద్ధతిలో కాకుండా మార్గపద్ధతిలో పాడితే ఇంకా బాగుంటుంది కదా! అని చెప్పినట్లు తెలుస్తుంది. ఆనాటికే రామాయణం మౌఖిక పద్ధతిలో ప్రచారంలో ఉందని జానపదులలో ఇది కథలుగా నాటికే ప్రచారంలో ఉందని గమనించవచ్చు. తమ కాలంలో ఎంతో ఘనత పొందినవారి కథలను వారికి వారే పాడుకోవడం అనే సంప్రదాయం నేటికాలంలోను ఉన్నది. వెయ్యేళ్ళనాటి పల్నాటి వీరకథ మాత్రమేకాక ఆధునిక కాలానికి చెందిన బొబ్బిలికథ మరీ ఇటీవలి కాలానికి చెందిన సర్వాయిపాపడి కథ, పండుగ శాయన్న కథలు మనకు ఉదాహరణగా నిలుస్తాయి. రామాయణం రాముడిపట్ల భక్తి తొలుత జానపద సంప్రదాయంలోనే మొదలైందని చెప్పడానికి ఈ చర్చ సరిపోతుంది. రాముడి గుడి కానీ రామమందిరంగా కాని రామమందిరం పేరుతో చిన్న గది కానీ, పాకకాని లేని తెలుగుపల్లె ఉండదేమో. పది గుడిసెలున్న ఊరిలోనైనా రామనామం, రామభక్తి మనకు తెలుగుపల్లెలో కనిపిస్తుంది. గుళ్ళలోకి పోయి తమ భక్తిని ప్రకటించుకొని కొబ్బరికాయలు కొట్టి సమర్పణ చేసుకోవడమే కాదు. ఇంట్లో రామయ్య సీతమ్మ లక్ష్మణులు ఉన్న పటాలను

పెట్టుకోవడం తెలుగు లోగిళ్ళలో కనిపించే దృశ్యం. పటం లేకున్నా రాముడి పేరు తలచుకోని తెలుగువారు ఉండరు అనే చెప్పాలి. చివరికి భాష భావవ్యక్తీకరణలో కూడా రాముడిని తలచుకోవడం రామనామం జపించడం తెలుగువారికి పరిపాటి.

అయ్యో రామ ఇదేం గోలరా...
రామరామ ఇంత పాపమా...
రామరామ ఇదేం బుద్ధిరా...
ఈ రామాయణం అంతా మనకు అవసరమా... సీతమ్మోరి కష్టాలు ఎవరికీ వద్దమ్మా
అదేమన్నా లక్షణ రేఖా...
కట్టె కొట్టె తెచ్చే...
ఇంటి గుట్టు చెప్పి లంకకు చేటు తెచ్చాడు...
కోతిమూకైనా గొప్పపనులు చేస్తాయి.
చుప్పనాతి శూర్పణఖ.
రామలచ్మణులలాంటి అన్నదమ్ములు
అది ఉత్త రాకాసి తాటకి
ఆదేం కుంభకర్ణుడి నిద్ర..
అదేమన్నా తిరుగులేని రామబాణమా...
ఏదో ఉడతాభక్తి...

ఇలా వందలాది జానపదుల వ్యక్తీకరణలలో అనునిత్యం రామాయణం, రామనామం జానపదుల నోట వెలువడుతుంటుంది. జానపదుల అభిమాన దేవుళ్ళలో వెంకన్న లాగే భక్తిప్రపత్తులను అందుకునే దేవుడు రాముడు, సీతమ్మ తెలుగు మహిళామణులు అందరికీ ఆరాధనీయమైన దేవత. ఆమె ఎన్ని కష్టాలు అనుభవించినదని కన్నీళ్ళు పెట్టుకుంటూ వింటారు కానీ ఆ కష్టాలు వినడం ఎందుకు అని మాత్రం అనుకోరు. రామాయణం

పాటలు తెలుగు స్త్రీలు గొంతెత్తి ఇంటింటా పాడుకునే సంప్రదాయం కూడా ఉంది. శతాబ్దాలుగా వస్తున్న రామాయణం పాటలు ఆధ్యాత్మిక రామాయణ కీర్తనల పైన ఎంతో పరిశోధన కూడా జరిగింది. అచ్చయినాయి. యక్షగానం పద్ధతిలో ఎన్నో రామాయణాలు వచ్చాయి. రంగనాథరామాయణం, శతకంఠ రామాయణం, మోక్షగుండ రామాయణం ఇలా వేర్వేరు జానపద సాహిత్య సంప్రదాయాలలో రామాయణ గాథ తెలుగు నేలలో వ్యాప్తిలోనికి వచ్చింది.

చరిత్రలో కూడా రామగాథని తెలుగునేలకు ఆపాదించుకునే సంప్రదాయం ఉంది. రామాయణంలో ఉన్న గోదావరి ఒడ్డున ఉన్న పర్ణశాల మన 'దక్షిణ అయోధ్య' అని చెప్పే భద్రాచలం క్షేత్రానికి అతి సమీపంలోనే ఉన్నది. ఇక రావణుడు సీతను అపహరించే క్రమంలో జటాయువు అతనిని అడుకున్న ప్రదేశం కూడా భద్రాచలం గ్రామానికి అనుకునే ఉన్నది. అది ఇక్కడే జరుగుతుందని తెలుగువారి గట్టి విశ్వాసం. అందుకే ఈ గ్రామానికి జటపాక తర్వాత ఎటపాక అనే పేరు వచ్చిందని చెబుతారు. అంతేకాదు. సీతారాములు వనవాసానికి ఇక్కడికే వచ్చారు అని చూపే ప్రాంతాలు మన తెలుగునేలలో చాలా ఉంటాయి. ఖమ్మం జిల్లాలో భద్రాచలమేకాక గోదావరి తీరప్రాంతంలో చాలా గ్రామాలలో ఈ మాట చెబుతారు. ఇంకా 'భీమవరం గట్లు' అడవి ప్రాంతంలో పాండవులు తిరిగారని సీతారాములు ఈ అడవుల్లో తిరిగారని చెప్పుకుంటారు. దానితో ఒక పవిత్రభావాన్ని వారు పొందడమే కాక ఇతరులలో కూడా ఈ పవిత్రభావాన్ని కలిగిస్తారు.

పర్ణశాల పక్కనే ఉన్న వాగుకు కూడా చాలా చరిత్ర ఉందని చెబుతారు. అక్కడ సీతమ్మవాగు ఇది అని చెపుతారు. అక్కడ పరుపు బండలైన ఉన్న పసుపురంగు గుర్తులు చూపిస్తూ ఇక్కడ సీతమ్మవారు బట్టలు ఆరేసుకునే వారు అని ఆమె చీరెకున్న పసుపు మరకలు ఇక్కడ అంటాయని చెబుతారు. ఇక్కడ సీతమ్మవారు స్నానాలు చేసేవారని ఆ పసుపు గుర్తులే ఇవి అని చెబుతారు. భద్రాచలాన్ని దర్శించడానికి వచ్చిన వారు పర్ణశాల చూడకుండా,

సీతారాములు స్నానాలు చేసిన ఆ వాగులో స్నానం చేయకుండా గోదావరి పవిత్ర జలాన్ని తాకకుండా దానిలో మునగకుండా పోయేవారు అరుదు. సీతారాములు తెలుగువారికి ఇష్టదైవాలు. సీతారాముల కళ్యాణాలు ప్రతి చిన్నపల్లెలో చలువ పందిళ్ళు వేసి తమ ఇంట్లో పెళ్ళిలాగే చేస్తారు. పానకం, వడపప్పు తెలుగువారి అచ్చ తెలుగు సంప్రదాయంగా నిలబడింది. భద్రాచలంలో జరిగే కల్యాణాన్ని ఆనాటి రేడియోలో పండితుల వ్యాఖ్యానంతో వస్తుంటే ప్రతి పల్లె విని పులకించేది. నేటికీ భద్రాద్రి రాములవారి పెండ్లి ప్రతి ఇంట్లో పెండ్లిలాగే కనిపిస్తుంది. వారికి అనిపిస్తుంది.

తెలుగునేలలో ఉన్న ప్రసిద్ధ రామాలయాలకు జానపదులుగా భావించబడే ఈ నిరక్షరాస్యులు వస్తారు. పూజిస్తారు. అంతేకాదు ఇక్కడ చెప్పుకోవలసిన విషయం ఏమంటే చదువుకున్న వారిమి అని ఆధునికులం అనుకునేవారికన్నా వీరికే పురాణ కథాపరిజ్ఞానం అధికంగా ఉంటుంది. భక్తి కూడా అధికంగానే ఉంటుంది. వారి మనస్సులో వారు పూజించే దేవుళ్ళు అలా స్థిరనివాసం ఉండి వారిపైన భక్తి తమ ఆధ్యాత్మిక జీవనంలో ఘనీభవించింది.

**జానపద సంప్రదాయంలో శివయ్య**

శివుడాజ్ఞ లేకుండా చీమైనా కుడుతుందా
శివశివా ఈ పాపపు మాటలు వినలేను
శివశివా అట్లా మాట్లాడకయ్యా
వాడి బతుకింక శివరాత్రే
ఈ శివరాత్రి జాగారాలు నాకెందుకయ్యా
శతకోటి శివలింగాలలో ఒక బోడిలింగం
లింగి లింగడు
లింగపోటు కన్నా దొంగపోటు ఎక్కువైంది కదా

ఉత్త భోళాశంకరుడు
ఉత్త తిక్క శంకరయ్య

ఇలాంటి వందలాది అభివ్యక్తులు తెలుగు భాషలో అదీ జానపదుల భాషలో శతాబ్దాలుగా కొనసాగి వస్తున్నాయి. శివశివా అనే మాట తెలుగు వారినోట అలవోకగా వచ్చే అభివ్యక్తులలో ఒకటి. శివరాత్రి తెలుగువారికి శతాబ్దాలనుండి సహస్రాబ్దాల నుండీ ఇష్టమైన పండుగ. శివరాత్రి మాహాత్మ్యాన్ని గురించి శ్రీనాథునికన్నా చాలాముందే పదకొండు పన్నెండు శతాబ్దాలనాటికే వీరశైవ ఆరాధన సంప్రదాయంలో విశేషాలను వర్ణించి రచించారు. వీరారాధనా సంప్రదాయం మనకు శివభక్తినుండే వచ్చింది. వీరశైవం 11వ శతాబ్దంలో అత్యంత బలంగా వ్యాపించింది. తెలుగునేలలో శివకవిత్రయం చాలా బలమైన శైవసంప్రదాయాన్ని శివభక్తిని ప్రతిష్ఠించడానికి విస్తృతమైన సాహిత్యాన్ని సృష్టించారు. అదే విస్తృతిలో జానపద సాహిత్యం కూడా వెలిసింది. పాల్కురికి సోమనాథుడు, మల్లికార్జున పండితారాధ్యుడు, నన్నెచోడుడు ఈ ముగ్గురిని శివకవిత్రయంగా పరిగణిస్తారు. పాల్కురికి రచించిన బసవపురాణంలో ఉన్న శివభక్తుల కథలన్నీ ఆనాడు జానపద సంప్రదాయంలో వ్యాప్తిలో ఉన్న కథలే.

అవన్నీ ఆనాటికి జానపద సంప్రదాయాలే. అంతేకాదు నేటికీ చాలా శైవారాధన సంప్రదాయాలు సామాజికాంశాలుగా మతపరమైన విశ్వాసాలుగా జానపదసంప్రదాయాలుగా నిలిచి ఉన్నాయి.

ఆశ్రిత కులాలకు చెందిన గాయక సంప్రదాయంలోని వారు అత్యధికులు నేటికీ శైవసంప్రదాయాలనే పాటిస్తున్నారు. వీరశైవ ఉద్యమం కొంతకాలానికి వెనక్కు వెళ్ళడం చారిత్రకంగా వైష్ణవం వైదిక సంప్రదాయాలు బలం పెంచుకోవడం చేశాయి. కానీ కులభేదాలు వద్దు శివభక్తుడైనా వానికి కులం లేదు అని చెప్పిన వీరశైవ అవశేషాలుగా తర్వాతి కాలంలో తెలుగు నేలలో కొన్ని కులాలు మిగిలిపోయాయి. బ్రాహ్మణవర్ణంలో

ఆరాధ్యబ్రాహ్మణ సంప్రదాయం అంటే ఆరాధ్య బ్రాహ్మణశాఖ, వెనుకబడిన కులాలలో జంగాలు అలాగే దళిత కులాలలో వేరువేరు పేర్లతో ఉన్న జంగాల కులాలు మిగిలిపోయాయి. విశ్వకర్మకులంలో కూడా లింగధారులు అనే శాఖ నేటికి చాలా బలంగా ఉన్నది.

నేటికీ తెలుగు జానపద సంప్రదాయంలో శివాచారాన్ని తప్పి ప్రవర్తించడం పాపంగా భావిస్తారు. మామూలుగా అందరూ మిగతా దేవుళ్ళలాగే శివుని గుడికి పోయి భక్తిని ప్రకటించడం, పూజలు చేయడం చేస్తారు. కానీ శివాచారాన్ని పాటించేవారు ఇంకా చాలా విస్తృతమైన నమ్మకాల వ్యవస్థని కలిగి ఉన్నారు. పుట్టిన దగ్గర నుండి మరణం వరకు కూడా వీరికి ప్రత్యేకమైన ఆచారాలు ఉన్నాయి. పుట్టగానే చిన్నలింగకాయని శిశువుకు కట్టే సంప్రదాయం ఉంది. ఉపనయనం పూర్తిగా శైవాచారాల ప్రకారం చేస్తారు. చివరికి మరణంలో కూడా నేటికీ ప్రత్యేకమైన నమ్మకాలు పద్ధతులు ఉన్నాయి. చనిపోయిన వ్యక్తిని లింగైక్యం చెందాడని, శివైక్యం చెందాడని, శివసాయుజ్యం పొందాడని చెపుతారు. కానీ పరమపదించాడు అని, స్వర్గస్తుడయ్యాడని కాని ఇతరమైన విధంగా చెప్పరు.

ఆశ్రితకులాల గాయకులు చర్మకారులకు ఆశ్రితులైన డక్కలి, నులకచందయ్యలు శైవాచారపరాయణులు. కొలనుపాకలోని మాదిగ మఠం ఉంది. ఈ మఠం శివాలయాన్ని పోలి ఉంటుంది. ఇందులో శివలింగాన్నే వారు పూజిస్తారు. నులకచందయ్యలు కథలు చెప్పేవారు, పురాణకథాగానం చేసేవారు లింగకాయలు ధరిస్తారు. ప్రతిరోజు లింగపూజ చేస్తారు. విశ్వకర్మల ఆశ్రితులైన 'రుంజవారు' వీరశైవాచారాలని పాటిస్తారు. వారికీ లింగకాయలు ఉంటాయి. పార్వతీ కల్యాణాన్ని ప్రతిభావంతంగా ప్రదర్శిస్తారు. బుడిగజంగం జానపద కళాకారులు వీరశైవ మర్యాదనే పాటిస్తారు. ఇక దళిత ప్రదర్శన కళకే చెందిన శారదకాళ్ళు కూడా శైవాచారాలను పాటిస్తారు. రెడ్లకు కులగాయకులైన వారు పిచ్చుకుంట్లు రెండు సంప్రదాయాలకు

చెందినవారున్నారు. తెలగ వారి ఆశ్రితులు జంగాలవారే. ఈ సంప్రదాయాన్ని పాటించే చాలా కులాలవారు నేటికీ లింగకాయలు ధరించే పెద్దతరం వారున్నారు. వారు భోజనం చేసేటప్పుడు తమ జంధ్యానికి ఉన్న లింగకాయను తెరుస్తారు. ఇందులో అతిచిన్న సెం.మీ పరిమాణంలో ఉన్న లింగము నంది బొమ్మలుంటాయి. వాటిని విస్తరి పక్కనే పెట్టి వాటికి గ్లాసులో ఉన్న నీటితోనే శుభ్రం చేసి అభిషేకం చేసి తర్వాతనే భోజనానికి ఉపక్రమిస్తారు. ముగిసిన తర్వాత తిరిగి వాటిని శుభ్రంచేసి తమ లింగకాయలో పెట్టుకుంటారు. ఇది మెడలో దండలాగా కట్టుకుంటే అది రొమ్ము మధ్యభాగం లోనికి వచ్చేలాగ కట్టుకుంటారు. శివుడు లయకారుడు అని భావించే సంప్రదాయం అలా ఉండగా వీరికి మాత్రం శివుడు అన్ని కోరిన పరాలిచ్చి కాపాడే దేవుడు, శివారాధనలో ఆత్మహింసాపద్ధతి కూడా ఉంటుంది. శ్రీశైల దేవస్థానంలో నరబలి జరిగేదని శివభక్తులు గంద్రకత్తెర వేసుకొని తల నరుక్కొని తలపందును శివునికి సమర్పించే ఆచారం ఉండేదని చరిత్రకారులు వివరించారు. నేటికీ ఈ ఆత్మహింసా పద్ధతులు చాలా అరుదుగా కొనసాగుతున్నాయి. వేర్వేరు కులాలలో నేటికీ 'వీర్లకొలుపు' అనేది ఉంది. ఇందులో శివునికి శరభలు కొడుతూ చక్రాలు చదుపుతారు.

విశ్వకర్మల ఇళ్ళలోను వైశ్యులు ఇంక కొన్ని ఇతర వెనుకబడిన కులాలలోను వీరభద్రుని పళ్ళెం ఎత్తడం అనే ఆచారం ఉంది. ఇది చాలా విస్తృతంగా ఉండే సంప్రదాయం. ఇందులో ముఖ్యమైనది వీరభద్రునికి ఆత్మహింసాపూర్వకమైన సేవను అందించడం. నారసాలు వేసుకొని నాలుకలోను బుగ్గలలోను గొంతులో ఇనుపకడ్డీలు గుచ్చుకోవడం చేస్తారు. హరహర మహాదేవ అనుకుంటూ వీరు నారసాలు అంటే పదునైన ఇనుపకడ్డీలు గుచ్చుకునే పద్ధతి చూసేవారికి భయం కొలుపుతుంది. కాని వారు దాన్ని అలవోకగా చేస్తారు. ఇది జానపద సంప్రదాయంలో శివునికి చేసే ఆధ్యాత్మిక సేవగా భావిస్తారు. విశ్వకర్మలకు అనుబంధంగా వీరంగం గాయకులు వీరభద్రుని ఆచార సంప్రదాయాన్ని చాలా విస్తృతంగా చేస్తారు.

చాకలివారికి పటంవారు ఆశ్రితులు. 'వీరు మడేలుపురాణా'న్ని చెపుతారు. ఇది రజకపురాణం అనికూడా అంటారు. ఈ గాయకులే కాక చాకలివారు కూడా శైవసంప్రదాయాలను పాటిస్తారు. చాకలి కులానికి మూలపురుషుడు వీరభద్రుని వారు భావిస్తారు. అందుకే మడేలు పురాణంలో వీరభద్రుని కథ కూడా వస్తుంది. చాకలివారు కర్ణాటకలో మడివేలు మాచయ్యకు గుడులు నిర్మించారు. బసవపురాణంలోని కథ దీనిలో చాలా వస్తుంది. అందుకే రజకపురాణాన్ని బసవపురాణం అని కూడా అంటారు.

ఇక గొల్లవారిలో సగంమంది వైష్ణవ సంప్రదాయం పాటించగా సగంమంది నేటికీ శైవ సంప్రదాయాన్ని పాటిస్తారు. కురుమలకు మల్లన్న దేవుడు ఇలవేలుపు. ఒగ్గు పూజారులు కురుమలకు కులగాయకులు. ఆశ్రితులు ఒగ్గు అంటే శివుని చేతిలోని డమరుకమే. మల్లన్న శివుని అవతారంగానే భావిస్తారు. జానపద సంప్రదాయంలో శివుడు ఎలా ఉంటాడో చెప్పడానికి మల్లన్న ఆరాధనా వ్యవస్థని పరిశీలిస్తే తెలుస్తుంది. మల్లన్న పురాణం చాలా విస్తృతంగా ఉండి 30 రోజులనుండి 40 రోజులవరకు ప్రదర్శించే నోటి పురాణం. మల్లన్నకు గొల్లకేతమ్మ బలిజ మేడలదేవి భార్యలు రత్నాంగి అనే బ్రాహ్మణ కన్య కూడా ఆయనకు భార్యగానే వచ్చింది. మల్లన్న ఆరాధనా సంప్రదాయం తెలంగాణలో చాలా విస్తృతంగా ఉంది. దాదాపు 200కు పైగానే చిన్న చిన్న మల్లన్న గుడులు తెలంగాణ అన్ని జిల్లాలలో కనిపిస్తాయి. ఇక కొమరవెల్లి, ఐనవోలు, ఓదెల, సిరుపూర్ కాగజ్ నగర్ దగ్గరి ఈజ్ గామ్‌లోని మల్లన్న క్షేత్రం మల్లన్న సంప్రదాయంలో చాలా పెద్ద స్థానాలు. ఇక్కడ జరిగే మల్లన్న కొలుపులు సాగుతాయి. జానపద ఆరాధనా సంప్రదాయాలలో మల్లన్న జాతరలు తెలంగాణలో చాలా ప్రముఖమైనవి. కొమిరెల్లిలో సంక్రాంతి తర్వాతి వచ్చే ఆదివారం నుండి ఉగాది తర్వాత వచ్చే ఆదివారం వరకు మల్లన్న పూజలు సాగుతాయి.

జానపద సంప్రదాయంలోనేకాక పురాణ సంప్రదాయపు పూజావిధానంలో కూడ జానపదులు శైవాచారాలను పాటించేవారు శివపారమ్యాన్ని అంగీకరించి శివభక్తితో ఉండేవారు కూడా చాలామంది కనిపిస్తారు. తెలుగు రాష్ట్రాలలోని శైవక్షేత్రాలలో శివరాత్రికి వచ్చి దర్శనం చేసుకొని పూజాదికాలు చేసేవారిలో ఎక్కువమంది జానపద సంప్రదాయానికి చెందినవారే ఉంటారు. వారికున్న వేదాంతం శివుడాజ్ఞ లేకుండా చీమైనా కుట్టదని. తమను ఆ శివయ్యే నడిపిస్తాడని వారి విశ్వాసం. కాకతీయులు కూడా చాలా విస్తృతంగా శివాలయాలు నిర్మించారు. శివుని కాకతమ్మను పరదైవంగా కొలిచారు వారు కొలిచిన కాకతమ్మ లేక ఎల్లమ్మను శివుని కుమార్తెగానే కీర్తిస్తారు. ఎల్లమ్మ దేవత చుట్టూ ఉన్న ఆచార సంప్రదాయాలన్ని కూడా శైవంచుట్టూ తిరిగేవే. ఎల్లమ్మ శివుని వరం కారణంగానే పట్టింది. ఎల్లమ్మ కథని వేర్వేరు జానపదగాయక సంప్రదాయాలలో ఉండేవారు. ప్రదర్శన కథగా ప్రదర్శిస్తారు. చిన్నచిన్న ఎల్లమ్మ గుడులు తెలుగు రాష్ట్రాలు రెండింటిలో చాలా విస్తృతంగా కనిపిస్తాయి. ఇంకా వేర్వేరు కులపురాణాలలో కూడా శివారాధనకు చెందిన విస్తృతమైన వివరాలు కనిపిస్తాయి. శివపురాణంలో ఉండే కథలు అన్నీ కూడా జానపద కథాసంప్రదాయంలో లభిస్తాయి.

### ఇతర పురాణ దేవతలు

వేంకటేశ్వరుడు, రాముడు, శివుడు మాదిరిగానే ఇతర పురాణ దేవతలైన కృష్ణుడు, విష్ణువును ఆరాధించే సంప్రదాయం జానపద సంప్రదాయంలో ఉంది. కృష్ణుని ఆలయాలు జానపద ఆధ్యాత్మికతలో కూడా పూజలు అందుకుంటాయి. ప్రతి తల్లి తన చిన్ని కుమారుని బాలకృష్ణునిగానే చూస్తుంది. కృష్ణునిగా అలంకరిస్తుంది. జన్మాష్టమిని జానపద సంప్రదాయంలో కూడా జరుపుకుంటారు. తెలుగు రాష్ట్రాలలో సత్యభామా సమేత రుక్మిణీ సమేత కృష్ణాలయాలు చాలాచోట్ల కనిపిస్తాయి. రామాలయం,

శివాలయం అంత పెద్దసంఖ్యలో కాకున్నా కృష్ణాలయాలు వేణుగోపాలస్వామి పేరుతో ఆలయాలు పెద్దసంఖ్యలోనే తెలుగు రాష్ట్రాలలో ఉన్నాయి. కృష్ణార్పణం అనేమాట తెలుగువారి అభివ్యక్తిలో ముఖ్యమైనది. గోపాలరావు, గోపాల్ రెడ్డి, కృష్ణారావు, కృష్ణమాచారి, గోపయ్య, గోపి, వాసుదేవరావు, పార్థసారధి, గోపికృష్ణ, రాధాకృష్ణ. కృష్ణమ్మ, కృష్ణకుమారి, కృష్ణాబాయి, ఇలా అసంఖ్యాకమైన పేర్లు కృష్ణుడి పేరుమీద తెలుగునాట బహుళ వ్యాప్తిలో ఉన్నాయి.

కృష్ణగాథలు జానపద సాహిత్యంలో బాగా వ్యాప్తిలోనే ఉన్నాయి. పాటల్లో కూడా స్త్రీల పాటల్లో కూడా కృష్ణుడికి సంబంధించిన పాటలు ఉన్నాయి. జానపద కథలు ఇంట్లో చెప్పుకునే వాటిలో కృష్ణునికి సంబంధించిన కథలు పెద్దవారు చిన్నపిల్లలకు చెప్పడం పరిపాటి. పల్లెలలో ఇది నేటికీ ఇంకా మిగిలి ఉన్నది.

జానపద సంప్రదాయంలో కృష్ణుడికి మొక్కుకోవడం ఆ మొక్కు చెల్లించడానికి ఆలయానికి పోయి తలనీలాలు ఇవ్వడం పరిపాటిగా ఉన్నది. మహాభారత కథ జానపద సాహిత్యంలో కూడా చాలా వ్యాప్తిలో ఉన్నది. మహాభారత కథని చెప్పే జానపద గిరిజన గాయక సంప్రదాయాలలో ఉన్నది. తోటివారు, పాండవుల వారు అనే గిరిజన ఆదివాసి సంప్రదాయాల్లో జానపద కథాప్రదర్శన చేసేవారు మహాభారతం మొత్తాన్ని వారి ప్రదర్శనలలో చెప్తారు. అంతేకాదు తెలుగువారు లేక తెలగాలు అనే కులంవారికి పటంవారు ఒకరు మహాభారత కథను ప్రదర్శించి చెప్తారు. జానపద సంప్రదాయంలో మహాభారతంలో ప్రముఖపాత్రగా అందరికన్నా ఎక్కువగా ప్రేమించే అభిమానించే పాత్రగా కృష్ణుడు ఉంటాడు. జానపదుల దృష్టిలో మహాభారతంలో ఎక్కువ సందర్భాలలో కృష్ణుడే కథానాయకుడుగా కనిపిస్తాడు. మంచి స్నేహితులను వారిద్దరు కృష్ణార్జునులంత మంచి స్నేహితులు అని పిలవడం తెలుగువారికి అలవాటు.

హంసలదీవిలో ఉన్న వేణుగోపాల స్వామి, నెమలి వేణుగోపాల స్వామి గుడులు తెలుగునాట ప్రసిద్ధ కృష్ణాలయాలు. భక్తులు ఈ రెండింటికీ పండుగల వేళ పోటెత్తి వస్తారు. జానపదుల ఆధ్యాత్మికతలో కృష్ణుని పూజ కూడా చాలా ముఖ్యమైనది.

విష్ణువు దశావతారాలలో ఇతర అవతారాలకు కూడా కొన్ని గుడులు కనిపిస్తాయి. వీటిలో ప్రాచీనమైనవి కూడా ఉన్నాయి. రాముడు కృష్ణుడు గుడులు చాలా వ్యాప్తంగా ఉన్నాయని చెప్పుకున్నాము. వాటితోపాటు ఇతర అవతారాలను ఆరాధించడం కూడా ఉంది. తూర్పుగోదావరి జిల్లా ర్యాలీలో విష్ణువును మోహిని అవతారంలో పూజిస్తారు. ఇది చాలా అరుదైన సంప్రదాయం. ఇక చిత్తూరు జిల్లా నాగలాపురంలో విష్ణువు మత్స్యావతారంలో ఉంటాడు. శ్రీకూర్మంలో కూర్మావతారంలో పూజలు అందుకుంటున్నాడు. అదే చిత్తూరు జిల్లా కుప్పం పట్టణానికి పది ఎనిమిది కి.మీ. దూరంలో ఉన్న 'యామసూరు'లో వామనావతారంలో ఉన్న విష్ణువుకు గుడి ఉంది. ఇది కనీసం రెండు శతాబ్దాలనుండి ఉన్నది అని చెప్పారు. శిథిలావస్తకు చేరుకోగా పది సంవత్సరాల క్రితం దీన్ని పునరుద్ధరించారు. అలాగే విష్ణువు వరాహావతారంలో ఉన్న గుడి తిరుమలలో ఉంది. హైదరాబాదులో ఉంది. భూదేవి దేవేరిగా ఉన్న వరాహావతారం గుడి హైదరాబాదు నార్సింగి ప్రాంతంలో ఉంది. బలరాముడితో సుభద్రతో ఉన్న కృష్ణుని ఆలయం హైదరాబాదులోనే బెంగాలువారు నిర్మించారు. పరశురామ అవతారానికి తెలుగు రాష్ట్రాలలో ఏ గుడి నాకు తెలిసినంతవరకు నేను తిరిగినంతవరకు కనిపించలేదు. నేను 23 తెలుగు జిల్లాలలో కనీసం 1200 గ్రామాలు తిరిగాను. కేరళలో పరశురాముని గుడులు ఉన్నాయి. కానీ తెలుగు నేలమీద కనిపించలేదు.

ఈ అన్ని అవతారాలరూపంలో ఉన్న విష్ణువును పూజించడం మొక్కుకోవడం, మొక్కులు తీర్చుకోవడం కూడా జానపద సంప్రదాయంలో

కూడా ఉన్నది. అక్కడి వచ్చే జానపదులు పురాణాలు చదివి ఉండకపోవచ్చు. నిరక్షరాస్యులు కావచ్చు. కానీ వీటికి సంబంధించిన పురాకథలు మౌఖిక మాధ్యమంలో వేరువేరు కళారూపాలలో కథల రూపంలో జానపదులను చేరినాయి. ఈ ప్రక్రియ శతాబ్దాల క్రితమే జరిగింది. ఈ కారణంగానే జానపదుల ఆధ్యాత్మిక సంప్రదాయంలో పురాణ దేవత గుడులు ఆరాధన కొనసాగి వస్తున్నది.

జానపద సంప్రదాయంలో 'శని' దేవతని ఆరాధించడం పూజించడం కూడా ఉంది. శని అనేమాట అత్యంత వ్యాప్తిలో ఉన్న పదం. 'శని పడితే ఏడేళ్లు ఉంటుందిరా' అనే అభివ్యక్తి జానపద సంప్రదాయంలో చాలా విస్తృతంగా నేటికీ ఉన్నది. శనిదేవతని పూజించడానికి ప్రత్యేకమైన జానపద పద్ధతి ఉన్నది. నువ్వుల నూనెతో ఆయనను పూజిస్తారు. ఆయన వాహనం అమంగళకరమైనదిగా భావించే కాకి, మిగతా దేవతలను భక్తితో పూజిస్తే శనిదేవతని మాత్రం భయంతో పూజిస్తారు జానపదులు.

జానపద సంప్రదాయంలో నవగ్రహ దేవతలని పూజించే సంప్రదాయం కూడా ఉంది. ఇంట్లో జరిగే అనర్థాలకు గ్రహదోషాలే కారణమని జానపదులు భావిస్తారు. అందుకే నవగ్రహాలు వారికి అనుకూలంగా ఉండాలని వారిమీద కోపం చూప కూడదని అందుకోసం వారికీ నువ్వులనూనెతో ప్రత్యేకమైన పద్ధతితో పూజిస్తారు.

జానపదులు అత్యంత భక్తితో పూజించే ఇంకో అవతారం నరసింహస్వామి అవతారం. ఈ స్వామికి గుడులు తెలుగు నేలలో చాలా విస్తృతంగానే ఉన్నాయి. కొన్ని నరసింహస్వామి గుడులలో జంతుబలి ఇవ్వడం కూడా ఉంది. తెలుగు రాష్ట్రాలలో నరసింహ క్షేత్రాలు చాలా ప్రాచీనమైనవి, ప్రసిద్ధమైనవి చాలా ఉన్నాయి. వీటన్నింటిలో జానపద భక్తుల సంఖ్యే చాలా ఎక్కువగా ఉంటుంది. సింహాచలం చరిత్రప్రసిద్ధమైన ప్రాచీన క్షేత్రం. తెలంగాణ యాదగిరిగుట్టలో రెండు నరసింహ క్షేత్రాలు ఉన్నాయి. ఒకటి

గుట్టకింద ఉంటుంది. ఇక్కడ అచ్చమైన జానపద శైలిలో పూజలు, బలులు ఉంటాయి. ఇకపైన గుట్టపైన ఉన్న నరసింహ దేవాలయం గుహలో ఉండేది. దీన్ని ఇటీవల తెలంగాణ ప్రభుత్వం ఆధునీకరించి కొత్తగా శిలానిర్మాణ ఆలయంగా చేసింది. ఇక్కడ పూజలు కైంకర్యాలు అన్నీ సంస్కృత దేవాలయాల మాదిరిగా ఉంటాయి. కానీ జానపదుల ఆధ్యాత్మికతలో ఈ క్షేత్రం కూడా చాలా ప్రసిద్ధమైనది.

నరసింహస్వామి కథ ఇంటి ఇంటికి చాలా ప్రసిద్ధంగా వినిపించిన తెలిసిన కథ. భక్తప్రహ్లాద యక్షగాన రూపంలో నాటకాల రూపంలో ఇంకా వేర్వేరు జానపద కళాప్రక్రియలలో చాలా వ్యాప్తి చెందినది. ఈ కారణంగానే జానపద సంప్రదాయంలో నరసింహ ఆరాధన చాలా ప్రచలితంగా ఉంది. చెంచులక్ష్మి కథ నరసింహస్వామికి చెందినదే. ఈ కథ జానపద కథగా చాలా ప్రచలితం.

జానపదులు అత్యంత ప్రేమతో పూజించే మరొక పురాణ దైవం ఆంజనేయుడు. ఈయనకు హనుమంతుడు, హనుమాన్, భజరంగబలి, అంజనీపుత్రుడు, కేసరి నందనుడు ఇలా చాలా పేర్లతో ఈయనను పూజిస్తారు. ఆలయాలుగా ఈయనకు ఊరూరా ఒక గుడి కనిపిస్తుంది. అంతేకాదు రామాలయాలలో ప్రతిచోట హనుమంతుడు గర్భగుడిలో ఉంటాడు లేదా ఎదురుగా మరొకచోట కనిపిస్తాడు. అక్కడ కూడా రాముని పూజించినట్లుగానే హనుమంతుని పూజిస్తారు. హనుమ ఆరాధన చాలా ప్రాచీనమైందిగా కనపిస్తుంది. జానపద సంప్రదాయంలో రామాయణ కథ ఎంత ప్రచలితంగా పవిత్రంగా భక్తిభావంతో వ్యాప్తిలో ఉన్నదో హనుమంతుని ఒక దైవంగా అంతే ప్రచలితంగా పూజిస్తారు. హనుమంతుని ఆరాధిస్తే ధైర్యం వస్తుందని భూతప్రేత పిశాచాలు దరికిరావని జానపద నమ్మకాల వ్యవస్థలో చాల బలమైన నమ్మకం ఉన్నది. 'హనుమాన్ చాలీసా' ఉన్నది వ్రజభాషలోనైనా దాన్ని ప్రతి తెలుగువారు అది తెలుగే అనుకునేంతగా

జనంలో వ్యాపించి ఉన్నది. చదువు రానివారికి కూడా ఎంతోమందికి నోటికి వచ్చి భక్తితో పాడేవారు కనిపిస్తారు. దీన్ని తెలుగులోకి అనువదించి పాడి బాగా వ్యాప్తి చేసిన ఘనత ప్రఖ్యాత సినీనేపథ్య గాయకుడు ఎమ్.ఎస్ రామారావుగారికి దక్కుతుంది.

హనుమంతునికి గుడి కూడా లేకుండా కేవలం విగ్రహాలు చిన్నవి చాలా పెద్దవి పెట్టి పూజించడం ఉంది. వీధుల్లో చిన్నచిన్న విగ్రహాలు పెట్టి తర్వాత దానికి పందిరి పెట్టి పూజించిన ఘట్టాలు కనిపిస్తాయి. హనుమాన్ విగ్రహాలు 30 అడుగులు 50 అడుగులు ఇలా తాళప్రమాణంతో చేయించి వాటికి ఏమాత్రం ఆచ్ఛాదన లేకుండా ఉంటే వాటికి పూజాపునస్కారాలు చేయడం జానపద సంప్రదాయం కూడా ఉంది. హనుమంతుడు శరీర సౌష్ఠవానికి బలానికి పోరాటశక్తికి, నిజాయితీకి, సేవకు దాసభావానికి ప్రతీకగా చూస్తారు. అందుకే వ్యాయామశాలలకు కుస్తీ గరిడీలకు హనుమాన్ పేరుపెట్టడం కనిపిస్తుంది. ఈ అన్ని విషయాలు కూడా జానపద సంప్రదాయంలో ప్రజలు భావించడం ఉంది. హనుమాన్ గుడులు ప్రత్యేకంగా ఉండడమే కాక హనుమాన్ మందిరాల పేరుతో చిన్న చిన్న గదులు కట్టి కూడా అక్కడ పూజించడం భజనలు చేయడం కూడా జానపద సంప్రదాయంలో ఉంది.

లంకిణివంటి ప్రతీపశక్తులను రాక్షసగణాలను వధించగల హనుమంతుడు భూత ప్రేత పిశాచాలను అంతమొందించేందుకు రక్షణగా ఉంటాడని ప్రజలు భావిస్తారు. కొన్ని నగరాలలోను దారుల కూడళ్ళలోను బాటలవెంట దుష్టశక్తులు ఉండి అక్కడ ప్రజలను హింసిస్తాయని లేదా ఏదైనా వాహనాల మీద వెళుతున్నవారిని ఆ వాహనం నుండి పడవేసి ఆ పిశాచాలు ఆనందిస్తాయని ఆయా ప్రాంతాలలో జరిగిన కొన్ని ఘటనలు ఆధారంగా చేసుకొని ప్రజలు కొంతకాలానికి విశ్వసిస్తారు. అలాంటి ప్రాంతాలలో జాగ్రత్తగా ఉండడం జాగ్రత్తగా బండ్లను నడపడం లేదా అక్కడ

బండి దిగి కాలినడకన పోయి తర్వాత బండి ఎక్కడం చేస్తుంటారు. ఇలాంటి ప్రదేశాలను గమనించి ఆయా ప్రాంతాలలో ఉండేవారు అక్కడ దారిపక్కన కాని మూలమలుపులలో కానీ హనుమంతుడి విగ్రహాన్ని కాని మరే రూపంలోనైనా చేసిన బొమ్మను కాని పెడతారు. దీనివల్ల అక్కడ పైన చెప్పినటువంటి ప్రమాదాలు జరగవని నమ్ముతారు. ఇది జానపద నమ్మకాల వ్యవస్థలో చాలా బలంగా ఉన్న విషయం. హనుమంతుని పేరు కూడా వివిధ సామాజిక వర్గాలవారు మగపిల్లలకు ఆడపిల్లలకు కూడా పెట్టడం ఉంది. వారు మొక్కుకున్న తీరునుబట్టి ఇలా పేర్లు పెడతారు. హనుమాయమ్మ అనే పేరు ఆడవారికి ఉండడం బాగా కనిపిస్తుంది. పుట్టిన పసిపాపలకు ఏడాది వయస్సున్న వారికి హనుమంతుని చిన్న బిళ్ళను మెడలో వేస్తే వారికి గాలి ధూళి సోకదని చెడుచూపు పడకుండా ఉంటుందని తల్లిదండ్రులు భావిస్తారు. హనుమంతుని బొమ్మను లేదా చిత్రాన్ని తాయెత్తులలాగా చేసి మెడలో వేయడం కూడా జానపద సంప్రదాయంలో ఉంది.

హనుమంతుని చుట్టూతా ఆత్మానుభవ కథనాలు (Personal experience narratives) చాలా దొరుకుతున్నాయి. ఆయా భక్తులు వారి అనుభవాలను హనుమంతుని ఆరాధించడం ద్వారా వారికి కలిగిన అనుభూతులను లేదా వారి సమస్యలు పరిష్కారం అయిన తీరును వివరించి చెప్పిన కథనాలు క్షేత్ర పరిశోధనలో మనకు లభిస్తాయి. ఇదంతా కూడా జానపదుల ఆధ్యాత్మికతగా భావించాలి. కథాసాహిత్యమేకాక జానపద గేయాలు కూడా హనుమద్ భక్తితో ఉండేవి దొరుకుతాయి. కథాసాహిత్యంలో రామునికి హనుమంతునికి యుద్ధం జరిగినట్లు ఉన్న కథ కేవలం జానపద కథే. రామాంజనేయ యుద్ధం పద్యనాటకం తెలుగునాట చాలా విస్తృతంగా ప్రదర్శించబడిన పద్యనాటకాలలో ఒకటి. గబ్బిట వెంకటరావు అనే కవి రాసిన ఈ నాటకం వేలాది ప్రదర్శనలు జరిగిన నాటకం. నేటికీ ఈ కథ జానపద సంప్రదాయంలో చాలా వ్యాప్తంగా ఉంది. ఈ కథ సినిమాగా కూడా చిత్రితమైంది.

రెండు తెలుగు రాష్ట్రాలలో ప్రసిద్ధ హనుమత్ క్షేత్రాలు చాలా ఉన్నాయి. తెలంగాణలో ఉన్న 'కొండగట్టు' హనుమత్ క్షేత్రం, ఆంధ్రప్రదేశ్ గుంటూరు జిల్లా పొన్నూరులో ఉన్న హనుమాన్ గుడి చాలా ప్రసిద్ధమైనవి. ఇక తాళప్రమాణంలో ఉన్న హనుమత్ విగ్రహాలు ఎన్నోచోట్ల కనిపిస్తాయి. హైవేల పక్కన కూడా వీటిని చాలా చూడవచ్చు. తిరుమలలో వెంకన్న స్వామి ఆలయానికి ఎదురుగానే బేడీ ఆంజనేయస్వామి కనిపిస్తాడు. ఈయనకు అక్కడ ఒక జానపద కథ కూడా ఉంది. ఇక తిరుమల నుండి ఘాట్‌రోడ్డులో కిందికి వస్తుంటే సుమారు 50 అడుగుల ఎత్తులో ఉన్న హనుమాన్ విగ్రహం ప్రతి వాహనాన్ని ఆపి ప్రజలందరూ దానికి పూజ చేసేలా చేస్తుంది. ప్రతి ఊర్లో హనుమంతుని మందిరం కాని విగ్రహం కాని జానపదుల పూజలు అందుకోవడం నేటికీ గమనించవచ్చు.

### జానపదుల దేవుడుగా అయ్యప్పస్వామి

అయ్యప్పస్వామికి తెలుగురాష్ట్రాలలో ప్రాచీనకాలం నుండి ఉన్నవి కావు. సుమారు. 50 సం॥ల కాలంనుండి తెలుగు రాష్ట్రాలలో చిన్న పెద్ద అయ్యప్ప దేవాలయాలు వెలయడం మొదలైంది. అయ్యప్ప దీక్షలు కూడా నాలుగైదు దశాబ్దాల కాలంనుండే తెలుగురాష్ట్రాలలో మొదలై క్రమంగా బాగా వ్యాప్తిలోనికి వచ్చింది. ప్రతి ఊరు ప్రతి పట్టణం నుండి అయ్యప్ప దీక్ష తీసుకోవడం, గుడులకు వెళ్ళి పూజించడం జరుగుతూ ఉంది.

అయితే అయ్యప్ప పేరుతో కాకుండా కుమారస్వామిని ఆరాధించే జానపదసంప్రదాయం మనకు ప్రాచీన కాలంనుండే ఉన్నది. కుమార స్వామి, సుబ్రహ్మణ్యస్వామి పేరుతో పూజించే సంప్రదాయం ఉంది. సుబ్రహ్మణ్యస్వామి పేరుతో చాలా ఆలయాలు కూడా తెలుగునాట ఉన్నాయి. మోపిదేవిలో ఉన్న సుబ్రహ్మణ్య స్వామి ఆలయం చాలా ప్రసిద్ధ క్షేత్రం. వల్లీ దేవసేనలు ఆయన ఇద్దరు దేవేరులు. సుబ్రహ్మణ్యస్వామి పేరు ఆయన దేవేరులు వల్లీ దేవసేనల పేర్లు కూడా తెలుగువారు పెట్టుకునే సంప్రదాయం ఉంది. వేర్వేరు

కులాలవారు కూడా సుబ్రహ్మణ్యస్వామి పేరుపెట్టడం ఉంది. అయ్యప్ప సంప్రదాయం దక్షిణ భారతదేశం మొత్తంలో కూడా అటు నాగరికులలో ఇటు జానపదులలో చాలా విస్తృతంగా ఉన్నది. ఒక స్వామి పేరుమీద దీక్ష తీసుకొని ఆచారకాండను మొదలుపెట్టడం అయ్యప్ప స్వామి నుండే వేరువేరు స్వాములకు వచ్చింది. అయ్యప్ప భక్తి చాలా ప్రత్యేకమైన రూపంలో వ్యాప్తి పొందినది. ఆయన చుట్టూ ఎన్నో పాటలు వచ్చాయి. కథా సాహిత్యం కూడా వచ్చింది. ఆత్మానుభవ కథనాలు కూడా చాలా విస్తృతంగా దొరుకుతున్నాయి. కుమారస్వామి, కార్తికేయుడు, పళని స్వామి, సుబ్రహ్మణ్యస్వామి, అయ్యప్ప, కార్తిక్ ఇలా... వేలాయుధన్, సూక్ష్మరూపంలో వేలు, మణికంఠుడు, స్కందుడు ఇలా వేరువేరు పేర్లతో ఈ దేవుడు జానపదుల పూజలందుకుంటున్నాడు.

## జానపద సంప్రదాయంలో దీక్షల సంప్రదాయం

పైన చెప్పిన విధంగా అయ్యప్ప లేదా సుబ్రహ్మణ్యస్వామి ఆరాధన సంప్రదాయం జానపదసంప్రదాయంలో చాలాకాలం క్రితంనుండే అంటే శతాబ్దాలనుండే ఉన్నా కూడా అయ్యప్పదీక్షలు వ్యాప్తి చెందడం మాత్రం నాలుగు దశాబ్దాలు అయింది అని చెప్పాలి. ఇంతకుముందు ఇలాంటి దీక్షల సంప్రదాయం అటు నాగరకులలో కాని జానపదులలో కాని లేదు. నలభై రోజుల దీక్ష చేపట్టడం. ఈ దీక్ష ఇవ్వడానికి పెద్దపూజ ఆచారకాండ జరగడం అందులో దీక్ష తీసుకొని నలభై రోజులపాటు ఈ దీక్షలో ఉండి నల్లదుస్తులు ధరించి బ్రహ్మచర్య వ్రతం పాటిస్తూ సాత్వికాహారం తీసుకుంటూ, మాటలో పనిలో అసత్యం ఆడకుండా పవిత్రంగా ఉంటూ అంటూ ముట్టూ తగలకుండా ఉంటూ, క్షురక్రియ లేకుండా, తమ వస్త్రాలు తామే పరిశుభ్రం చేసుకుంటూ పవిత్ర స్థలంలోనే స్నానాదికాలు నిత్యపూజాదికాలు చేస్తూ ఇలా ఎన్నో ఇతర ఆచారాలు పాటిస్తూ మండలదీక్ష చేస్తారు. అంటే నలభై రోజులపాటు ఇలాంటి దీక్షలో ఉండి తర్వాత 'ఇరుముడి' వ్రతం చేస్తారు.

అంటే ఆఖరుని పెద్ద పడిపూజని అయ్యప్పస్వామికి చేస్తారు. అందులో ఒక పెద్ద స్వామి ఈ దీక్ష చేసిన భక్తులు అందరికీ ఒక నల్లటిసంచి లేదా మూటలో ఇరుముడిని ఇస్తారు. అంటే ఈ మూడలో కొబ్బరికాయలు ఇతర పవిత్రలు ఉంటాయి. పూజానంతరం స్వామియే అయ్యప్ప అనే శరణుఘోష చేస్తారు. అందులోనే దీక్షాధారుడికి స్వామి మాల వేస్తారు. ఇక అప్పుడు అతను అయ్యప్ప స్వామితోనే సమానం. అతని పేరుపెట్టి పిలవకూడదు. అసలు దీక్షలో ఉన్నవారిని కూడా పేరుపెట్టి పిలవకుండా స్వామీ అనే పిలిచే ఆచారం కూడా వ్యాపించింది. ఈ స్వాములలో రెండు లేక మూడు స్థాయిలు కనిపిస్తున్నాయి. సాధారణ భక్తుడు స్థాయి స్వామి ఒకరైతే మూడుసార్లు, ఐదుసార్లు, పదిసార్లు శబరిమల క్షేత్రాన్ని దర్శించిన స్వాముల స్థాయి వేరుగా ఉంటుంది. తొలిసారి దీక్ష తీసుకునే వారికి అప్పటికే ఐదుసార్లు లేక పదిసార్లు అయ్యప్పదీక్ష తీసుకొని ముగించినవారు పెద్దస్వాములు అయి వారికి దీక్ష ఇస్తారు.

దీక్ష అంతానిష్ఠతో విజయవంతంగా పూర్తి చేసుకొని ఇరుముడి తీసుకున్న తర్వాత శబరిమలకు బయల్దేరతారు. దీనికి సంబంధించిన ఏర్పాట్లు కనీసం రెండు, మూడు నెలలముందే చేసుకుంటారు. సంక్రాంతి కాలానికి విపరీతమైన ఒత్తిడి ఉంటుందని అంతకుముందే నెల రెండు నెలలముందే శబరిమల వెళ్ళి వచ్చేవారు కొందరుంటారు. ఈ ఇరుముడి కార్యక్రమానికి బంధువులందరినీ పిలుచుకుంటారు. వచ్చిన బంధువులు దీక్షితునికి కొంత కానుకరూపంలో డబ్బు ఇస్తారు. అవి అతనికి సహాయపడతాయి. శబరిమలకు వెళ్ళి పద్దెనిమిది మెట్లు ఎక్కి శరణుఘోష చేస్తూ స్వామిని దర్శించుకొని ఇంటికి తిరిగి పచ్చిన తర్వాత దీక్ష ముగుస్తుంది. ఆతర్వాత తిరిగి ఆ వ్యక్తి సాధారణ జీవితం గడుపుతాడు. ఇలా దీక్షలో ఉన్న వ్యక్తులు వారువారి ఉద్యోగాలు చేసుకోవచ్చు. వృత్తులు నిర్వహించుకోవచ్చు. వృత్తి స్థలాలలో కూడా దీక్షలో లేని ఇతరులు వారిని గౌరవంతోనే చూస్తారు. పేరుతో కాక స్వామి అనే సంబోధిస్తారు.

ఈ అయ్యప్ప ఆరాధన ప్రక్రియ అంతా పూర్తిగా జానపద సంప్రదాయంలోకి చేరింది. దీనివల్ల ఈ మూడు నాలుగు దశాబ్దాల కాలంలో కొంత సామాజిక పరిణామాన్ని తీసుకురాగలిగింది. దీనితో వచ్చిన సామాజిక మార్పు దీనితోనే పోతున్నా కనీసం నలభై రోజులపాటు మార్పులు తీసుకురాగలిగింది. అన్ని కులాలవారు స్వాములుగా దీక్ష తీసుకోవడం తర్వాత ఆవ్యక్తి కులాన్ని చూడకుండా సమానంగా భావించి ప్రతి ఒక్కరూ స్వామి అని పిలుచుకుంటూ సమానంగా పక్కపక్కన కూర్చొని దీక్ష ఆచారాన్ని పాటించడం గమనించదగిన విషయం. పల్లెలలో పట్టణాలలో కులాల మధ్యన ఈ సమానత్వాన్ని తెచ్చినది అయ్యప్పపట్ల ఈ ఆధ్యాత్మిక భావన. కులాల మధ్యన వీరశైవం వీరవైష్ణవం ఇలాగే సామాజిక సమానత్వాన్ని తేగలిగాయి. కాని కొంతకాలానికి అవి వీగిపోయి సమాజ నిర్మాణం ఎప్పటిలాగే మిగిలి పోయింది. కానీ కొంతైనా సమాజంపైన దీని ప్రభావం చూపించింది. అయ్యప్ప కథలు, అసంఖ్యాకంగా పాటలు వ్యాప్తిలోనికి వచ్చాయి. అంతే కాదు జానపద సాహిత్యంలో ఇవి భాగంగా మిగిలాయి. జానపద ఆచారకాండలో కూడా దీన్ని కొత్త పరిణామం అని చెప్పాలి. జానపద ఆధ్యాత్మికతలో ఇది సరికొత్త చేర్పు అని చెప్పాలి.

## జానపద సంప్రదాయంలో సరికొత్త దీక్షలు

అయ్యప్పస్వామి దీక్ష ప్రభావం అక్కడే ఆగలేదు. దానిప్రభావం ఇతర దేవతల ఆరాధనా సంప్రదాయాలపైన పడింది. మరిన్ని సరికొత్త దీక్షలు చోటుచేసుకున్నాయి. జానపద ఆరాధన సంప్రదాయంలో ఆధ్యాత్మిక చింతనలో కొత్త తరహా ఆచారాలు రావడానికి ఇది నాంది పలికింది. తెలుగు రాష్ట్రాలలో ఈ కొత్త దీక్షలు కొత్త ఆచారకాండ త్వరగా వ్యాపించింది. కొన్ని దీక్షల గురించి ఇక్కడ ప్రస్తావించాలి.

## తిరుమల వెంకన్నదీక్ష

తిరుమల వేంకటేశ్వర స్వామిపేరుతో పైన చెప్పిన తరహా నిష్ఠలతో దీక్షలు తీసుకొని దీక్ష ముగిసిన తర్వాత తిరుమలకు వెళ్ళి మొక్కు చెల్లించుకొని వస్తారు. ఈ దీక్షాధారులు లేత పసుపురంగు దుస్తులు ధరించి ఇంటివద్దనే స్వామికి నిత్యపూజలు చేస్తారు. అయ్యప్పదీక్షలో ఇరుముడి అని అంటే వీరు దాన్నే 'తిరుముడి' అని అంటుంటారు. కాని తిరుమలలో వీరికి ప్రత్యేకమైన వ్యవస్థ ఏది ఉన్నట్లు తెలియదు. తమిళనాడు నుండి ఇలా దీక్షాధారులు కాలినడకన రావడం గురించి ఇంతకుముందు ప్రస్తావించిన విషయాన్ని గమనించవచ్చు. ఈ దీక్షలు చేసేది కూడా తమిళనాడునుండే వచ్చేవారిలో ఎక్కువగా ఉన్నారు.

## ఆంజనేయస్వామి దీక్ష

అయ్యస్వామి దీక్షలకు ఇది పూర్తిగా అనుసరణ అక్కడ ఆ నిర్మాణం ఎలా ఉంటుందో ఈ దీక్ష పూర్తిగా అలాగే ఉంటుంది. అక్కడవారు నలుపురంగు దుస్తులు ధరిస్తే ఇక్కడ వీరు ఆంజనేయునికి ప్రియమైన సిందూరవర్ణంలోని దుస్తులు ధరిస్తారు. నలభై రోజుల దీక్షచేస్తారు. పైన అయ్యప్ప దీక్షలో చెప్పిన అన్ని తరహా ఆచారాలు పాటిస్తారు, బ్రహ్మచర్యం, కేశఖండన లేకపోవడం. శుచి శుభ్రతలు పాటించడం నిత్యం హనుమ ధ్యానంలో ఉండడం ఆ స్వామి పాటలు పాడుకోవడం ఇలా అన్ని ఆచారాలు పాటిస్తారు. దీక్ష చివరిరోజున పెద్ద స్వామితో ఇరుముడి వంటి ముడిని తీసుకొని మాలాధారణ చేస్తారు. ఆ తర్వాత అదే ఇరుముడితో వారికి అందుబాటులో ఉన్న హనుమత్ క్షేత్రానికి వెళ్ళి అక్కడ ఆ ఇరుముడిని సమర్పించి పూజచేసి తలనీలాలు సమర్పించి దీక్ష ముగిస్తారు. దీనికి హనుమత్ దీక్ష ఆంజనేయ దీక్ష అని పేరు. హనుమజ్జయంతి నాడు ఈ దీక్షలు ముగిస్తారు. ఆనాటి హనుమత్ క్షేత్రాలు చాలా క్రిక్కిరిసి పోతాయి.

తెలంగాణలో కొండగట్టు ఆంజనేయస్వామి క్షేత్రానికి వేలసంఖ్యలో బారులు తీరి ఈ దీక్షాస్వాములు తమ దీక్షను చెల్లిస్తారు. ఆ కార్యక్రమానికి అవసరమైన ఏర్పాట్లు కూడా ఆలయ యాజమాన్యం వారు చేస్తారు. ఈ హనుమత్ దీక్ష ఇటీవలి కాలంలోనే మొదలైంది. ఇది కూడా స్పష్టంగా అయ్యప్ప దీక్ష నిర్మాణాన్ని అనువర్తింప (Adaptation) చేసుకొని రూపొందినదే. మానవశాస్త్ర పరిభాష ప్రకారం దీన్ని Ritual Adaptation క్రతుఅనువర్తనం అని చెప్పవచ్చు. హనుమత్ దీక్ష ఈనాడు జానపదసంప్రదాయంలో జానపద ఆధ్యాత్మికతలో ఒక భాగంగా నిలిచింది.

### బెజవాడ దుర్గమ్మ దీక్ష

బెజవాడ కనకదుర్గ భక్తులు పైన చెప్పిన అయ్యప్ప దీక్ష హనుమత్ దీక్ష పద్ధతిలోనే దుర్గమ్మ దీక్షలు చేయడం ప్రారంభించారు. ఇది కూడా ఒక దశాబ్దంక్రితమే మొదలైంది. తెలుగు రాష్ట్రాలలో చాలా గ్రామాల నుండి ఈ దీక్షలు తీసుకోవడం మొదలైంది. ఈ భక్తులు కుంకుమ వర్ణంలోని దుస్తులు ధరిస్తారు. వీరిని ప్రత్యేకంగా గుర్తించడానికి చొక్కా అడ్డపంచే కట్టుకుంటారు. సాధారణంగా అన్ని దీక్షలలోను ఇదేవిధంగా అంగీ అడ్డపంచె కట్టుకోవడం ఉంది. అన్ని వృత్తులవారు ఉద్యోగులు కూడా ఈ దీక్షలు చేస్తున్నారు. నలభైరోజులపాటు దీక్షచేసి నిష్ఠగా పూజలు చేసి తుదిన ఇరుముడి తీసుకొని బెజవాడకు కనకదుర్గ ఆలయానికి పోయి ఇరుముడి సమర్పించి పూజలు చేసి దీక్ష విరమిస్తారు. ఇది దుర్గానవరాత్రుల కాలంలో జరుగుతుంది. ఆ రోజుల్లో స్వాములు దీక్ష సమర్పించే రోజున విజయవాడ పట్టణమంతా కుంకుమరంగు పోసినట్లు తయారౌతుంది. వేలసంఖ్యలో భక్తులు పట్టణమంతా నిండిపోతారు. దీనికి పురపాలక సంఘం పోలీసు వ్యవస్థ కూడా ఎన్నో ఏర్పాట్లు చేస్తారు. పైన ఆలయ కమిటీవారు కూడా తగిన ఏర్పాట్లు చేస్తారు. దుర్గమ్మ భక్తులు మామూలుగా ఏ రోజునైనా వచ్చి దర్శనాలు చేసుకోవడం పూజలు చేయడం ఉంది. మంగళవారం

శుక్రవారం భక్తులు అధికంగా ఉంటారు. కానీ ఈ దీక్షల కారణంగా ఆలయానికి అత్యధిక సంఖ్యలో వేలసంఖ్యలు ఒక్కోసారి లక్షకుమించి భక్తులు రావడం మొదలైంది. ప్రతి గ్రామంలో కూడా దుర్గాదీక్ష చేసే భక్తులు కనిపిస్తున్నారు. ఇది కూడా జానపద ఆధ్యాత్మికతలో కొత్త చేర్పుగా అవతరించింది.

## బ్రహ్మంగారి దీక్ష

ఈ దీక్ష కూడా అయ్యప్పస్వామి దీక్షకు పూర్తిగా అనుసరణే అని చెప్పాలి. బ్రహ్మం గారు జానపద సంప్రదాయానికి చెందిన స్వామి అనే చెప్పాలి. కారణం 16వ శతాబ్దం నుండే వీరబ్రహ్మం, వీరప్పయ్య, బ్రహ్మం గారుగా ప్రజల మనస్సులలో ఉన్నవారు బ్రహ్మంగారు. బ్రహ్మంగారి కాలజ్ఞాన తత్వాలు ఆయన శిష్యుడు సిద్ధప్పగారి కాలజ్ఞానతత్వాలు ఆనాటినుండే జానపద సంప్రదాయంలో గేయ సంప్రదాయంలో ఉంటూ వచ్చాయి. ఇవి మౌఖిక సంప్రదాయంలోనే నేటికీ వ్యాప్తిలో ఉన్నాయి. బ్రహ్మంగారి చరిత్ర కూడా జానపద కథలరూపంలో వ్యాప్తిలో ఉంది. దరిమిలా బ్రహ్మంగారికి ఊరూరా గుడులు వెలసినాయి. కేవలం విశ్వకర్మలేకాక అన్ని కులాలవారికి ఆయన దేవుడు. అందుకే అన్ని కులాలవారు కూడా ఆయనను ఆరాధిస్తారు. కాలజ్ఞానాన్ని నమ్ముతారు. ఏ పెద్ద అనూహ్య సంఘటన కాని ప్రకృతి విపత్తు కాని, ఘోరం కాని, నమ్మలేని వాస్తవాలు కాని జరిగినా బ్రహ్మంగారు అప్పుడే చెప్పారు అని అంటుంటారు.

బ్రహ్మంగారి మఠం కడపజిల్లా బద్వేలు తాలూకా కందిమల్లాయపల్లెలో ఉంది. ఇంకా రెండు మఠాలు బనగానపల్లెలో ఉన్నాయి. ఒకటి గరిమరెడ్డి అచ్చమ్మ గారి ఇంటి ప్రాంతంలో ఉన్న చింతమాను మఠం. మరొకటి బనగానుపల్లె ఊరి శివారులో ఉన్న నేలమఠం ఉన్నాయి. ఇవి కాక 'రవ్వల కొండ' వద్ద కూడా ఒక మఠం ఉంది.

బ్రహ్మంగారి భక్తులు పైన చెప్పిన పద్ధతులనే పాటించి నలభై రోజులపాటు దీక్ష చేస్తారు. ఇరుముడి ధారణ మాలాధారణ చేసి చివరిగా బ్రహ్మంగారి మఠానికి పోయి అక్కడ మొక్కులు చెల్లించుకొని తిరిగి వస్తారు. వీరి దుస్తులు కాషాయవర్ణంలో ఉంటాయి.

జానపద ఆధ్యాత్మికతలో బ్రహ్మంగారి గుడులు పూజలు దీక్షలు మాత్రమే కాకుండా మరొక సంప్రదాయం ఉంది. అది బ్రహ్మంగారి జెండా ఎత్తడం అంటారు. బ్రహ్మంగారి పేరుతో ఒక జెండా ఉంటుంది. అది కాషాయరంగులో త్రిభుజాకారంలో ఉంటుంది. దాన్ని ఒక పొడవైన గడకు కట్టి ఆ గడను ఒక శాశ్వతంగా ఉండే చెట్టుకు పైన కడతారు. ఊరిబయట నుండి చాలా దూరంనుండి చూచినా ఈ జెండా కనిపించేలాగా కడతారు అలా కట్టిన చెట్టును దేవుడుగానే భావిస్తారు. దాని ఆకును కూడా కోయడానికి ఒప్పుకోరు. అది పాపంగా భావిస్తారు. ఏడాదికి ఒకసారి వైశాఖమాసంలో ఆ జెండాను దించి కొత్త జెండా కట్టి పూజలు చేసి ఊరంతా భక్తితో ఊరేగించి తరువాత తిరిగి ఆ జెండాను చెట్టుమీద కడతారు. నేను క్షేత్రపరిశోధన చేసిన ఒక గ్రామంలో మూడు వందల ఏండ్లనుండి ఒక వేపచెట్టు మీద ఈ జెండాను కట్టి పూజిస్తున్నారు. గ్రామంలో అన్ని చెట్లు నాలుగు ఐదు తరాలుగా పాతచెట్లు అంతరించడం కొత్త చెట్లు పెద్దవి కావడం జరిగింది. కానీ ఈ జెండా చెట్టుమాత్రం మూడు వందల సంవత్సరాలుగా అలాగే ఉంది. దీనికి కారణం అదిదేవుడి చెట్టు కావడమే. అందుకే జానపదులు ప్రకృతిని ప్రకృతి శక్తులను ఆరాధిస్తారు. ఇలా ఆరాధించడంతోనే ప్రకృతిని పర్యావరణాన్ని వారు కాపాడతారు. ఈ బ్రహ్మసంప్రదాయం జానపదుల ఆధ్యాత్మికలో వందల సంవత్సరాలుగా ఉంది. నమ్మకాల వ్యవస్థలో ఉంది. కాగా పైన చెప్పిన బ్రహ్మం దీక్ష అనేది ఇటీవలి కాలంలోనే వచ్చింది. నలభై రోజుల దీక్ష తర్వాత భక్తులు ఇరుముడులు తీసుకొని కందిమల్లాయపల్లెలోని బ్రహ్మంగారి మఠానికి పోయి మొక్కులు చెల్లించుకొని దీక్ష విరమిస్తారు.

## పేరంటాళ్ళ దేవతల దీక్ష

తెలుగురాష్ట్రాలలో పేరంటాళ్ళ దేవతలు మనకు ప్రత్యేకంగా కనిపిస్తారు. వీరు ప్రధానంగా జానపద దేవతలు అని చెప్పాలి. ఇది అమ్మతల్లుల ఆరాధనకు మరోరూపంగా కూడా కనిపిస్తుంది. అసలు పేరంటాలు అని అంటే ఏమిటో అర్థం వివరంగా తెలుసుకోవాలి.

పేరంటం అనే పదానికి ఆడవారు నిర్వహించే ఆచారానికి అంటే వ్రతం, నోము, శ్రావణ శుక్రవారం, మంగళవారం రోజుల్లో చేసే ఆచారాలు, లేదా రజస్వల సందర్భంగా చేసే చివరిరోజు ఉత్సవం, పెండ్లి ఇలా కొన్ని ముఖ్యమైన ఆచార సందర్భాలను పేరంటం అని అంటారు. అలా పేరంటానికి వచ్చే ఆడువారిని పేరంటాలు అని అంటారు. ఇక్కడ పేరంటానికి వచ్చే ఆడువారు పునిస్త్రీలై ఉంటారు లేదా పెండ్లి కానివారు అయి ఉంటారు. అంటే విధవలు పేరంటానికి రావడం నిషేధం. అంతేకాకుండా పిల్లలు కలుగని స్త్రీలను కూడా కొన్ని ముఖ్యమైన పేరంటాలకు రానివ్వరు. ఆహ్వానించరు. ఇలాంటి అర్థంలో సాధారణార్థంలో కూడా పేరంటాలు అనేమాట వినియోగంలో ఉంది. ఇలాకాక ప్రత్యేక అర్థంలో కూడా పేరంటాలు అనేమాట వినియోగంలో ఉంది.

ఒక మహిళ సతీసహగమనం చేసి మరణిస్తే ఆమె దేవతగా వెలియవచ్చు. ప్రజల పూజలు అందుకోవచ్చు. ఒక పునిస్త్రీ అనూహ్యమైన సంఘటనలో మరణించి అంటే దొంగలపైన పోరాడి చనిపోతే, తనపైన అఘాయిత్యానికి పాల్పడే వారిపైన పోరాడి చనిపోయినవారు కూడా తర్వాతి కాలంలో దేవతగా వెలియవచ్చు పూజలందుకోవచ్చు, భర్త మరణాన్ని తట్టుకోలేక మరణించినవారు కూడా తర్వాత దేవతలుగా మారి పూజలు అందుకుంటున్న సంఘటనలు ఉన్నాయి. అత్తమామలు ఆడపడుచుల అకృత్యాలకు అఘాయిత్యాలకు బలై తర్వాత తనను తాను దేవతగా ఆవిర్భవించి పూజలందుకుంటున్న దేవతలు ఉన్నారు. సాక్షాత్తు భర్తచేత

హత్య గావించబడి దరిమిలా దేవతగా వెలసి పూజలందుకుంటున్న మహిళలు ఉన్నారు. జబ్బుచేసి అనూహ్యంగా మరణించి తర్వాత మహిమలు చూపించి దేవతగా పూజలు అందుకుంటున్న ఆడువారు ఉన్నారు. కొడుకుల చేత చంపబడి దేవతలుగా వెలసినవారున్నారు. భర్త తనను మోసం చేశాడని భావించి ఆత్మహత్య చేసుకొని దేవతలుగా వెలసిన మహిళలు ఉన్నారు.

ఇలా చాలా అనూహ్యమైన రీతిలో నమ్మలేని పద్ధతిలో మరణించి తర్వాత మహిమలు చూపించి దేవతలు అయినవారిని పేరంటాల దేవత అని తెలుగు జానపదులు నాగరికులు వ్యవహరిస్తారు. అన్ని వర్గాల ప్రజలు ఇలాంటి దేవతలను ఆరాధించడం తెలుగు రాష్ట్రాలలో ఉన్నది. ఇలాంటి పేరంటాల దేవతలు మనకు ఎక్కువగా సర్కారు జిల్లాలలో కనిపిస్తారు. నెల్లూరు జిల్లానుండి పైన శ్రీకాకుళం జిల్లావరకు దాదాపు 200 మంది పేరంటాళ్ళ దేవతలు ఉన్నారని 1961లో భారత ప్రభుత్వం సేకరించిన సమాచారం ప్రకారం తెలుస్తున్నది. భారత జనగణన శాఖవారు ఈ సర్వే నిర్వహించి Fairs and Festivals of Andhra Pradesh పేరుతో జిల్లాకు ఒక సంపుటం చొప్పున నాటి ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న 23 జిల్లాలకు 23 సంపుటాలను అచ్చువేసింది. ఇందులో పేరంటాళ్ళ దేవతలను గురించిన సమాచారం లభిస్తుంది. ఈ గ్రంథకర్త హైదరాబాదు కేంద్రీయ విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్న సందర్భంలో పేరంటాళ్ళ దేవతలపైన క్షేత్ర పరిశోధన చేసి ఒక పరిశోధన ప్రాజెక్టులో భాగంగా డాక్యుమెంటేషన్ చేశాడు. తెలంగాణలో కూడా మనకు కొందరు పేరంటాళ్ళ దేవతలు కనిపిస్తారు. అత్తమామల ఆరళ్ళకు బలైన బతుకమ్మ తర్వాత దేవతగా వెలసింది. భర్త ఆజ్ఞతో కొడుకు తలనరకగా ఏర్పడిన దేవత ఎల్లమ్మ మారెమ్మలు వీరిద్దరూ తెలంగాణలో ఆరాధ్యదేవతలు. శత్రువులతో పోరాడి వీరమరణం పొందిన సమ్మక్క, సారలమ్మలు కూడా తెలంగాణలో ఉన్న పేరంటాలు దేవతలు అనే చెప్పాలి. సర్కారు జిల్లాలలో ఉన్నట్లుగా పెద్దసంఖ్యలో పేరంటాళ్ళ దేవతలు తెలంగాణ ప్రాంతంలో లేరు అని చెప్పవచ్చు.

పేరంటాళ్ళ దేవతలు ప్రాథమికంగా జానపద దేవతలు. అమ్మతల్లుల ఆరాధనలో పాటించే పద్ధతలనే జానపదులు ఈ పేరంటాళ్ళ దేవతల ఆరాధన పద్ధతిలో పాటిస్తారు. కొలుపులు చేయడం బలులు ఇవ్వడం కూడా వీరికి చేస్తారు.

ఈ పేరంటాళ్ళ పేరుతో కూడా దీక్షలు చేపట్టడం ఇటీవలి కాలంలో వచ్చిన పెద్ద పరిణామం. కృష్ణాజిల్లా పెనుగంచిప్రోలు గ్రామంలో తిరుపతమ్మ అనే పేరంటాలు దేవత ఉంది. ఆమెపేరుతో చుట్టుపక్కల చాలా గ్రామాలలో గుంటూరు జిల్లా గ్రామాలనుండి కూడా తిరుపతమ్మ దీక్ష తీసుకొని మాఘపౌర్ణమికి జరిగే పెద్దతిరునాళ్ళ రోజున అలాగే ఫాల్గుణమాసం పౌర్ణమి రోజున జరిగే చిన్న తిరునాళ్ళలోను ఈ దీక్షలు చేసిన వారు పూజలు చేసి తర్వాత దీక్షవిరమిస్తారు. తేలప్రోలు రంగమ్మ దేవత వద్ద కూడా ఇలాంటి దీక్ష చేపడుతున్నారు. దాదాపు 25 సంవత్సరాల క్రితం 'రామడుగు నరసింహాచార్య' అనే ఆయన ప్రోత్సాహంతో అక్కడ ఉన్న పూజారి కలిసి ఈ దీక్షకు శ్రీకారం చుట్టినారు. ఈ దీక్షతీసుకునే భక్తులు దుర్గమ్మ దీక్షలో పాటించే పద్ధతులు అన్ని పాటిస్తారు. కుంకుమ రంగు దుస్తులు ధరిస్తారు. అయ్యప్ప దీక్ష మాదిరిగానే నలభై రోజులు నిష్ఠతో ఉండడం చేసి మాఘపౌర్ణమికి జరిగే తిరునాళ్ళ సమయంలో వచ్చి పూజలు చెల్లించి తర్వాత దీక్షవిరమిస్తారు. అయ్యప్పదీక్షలో లాగే చివరి రోజుల్లో పెద్ద పడి పూజచేసి అక్కడవారు ముడిని తీసుకొంటారు. దీన్ని 'తిరుముడి' అని కొత్త పేరు పెట్టి పిలుస్తున్నారు. అయ్యప్పది ఇరుముడి అయితే దీన్ని వారు తిరుముడి అని అంటున్నారు.

జానపద నమ్మకాల వ్యవస్థలో గాఢమైన సానుభూతిని మరణం సందర్భంలో పొందిన ఈ మహిళలు దేవతలుగా వెలిసి జానపదుల పూజలు అందుకుంటున్నారు. జానపదులు ఆధ్యాత్మిక భావనలో ఈ దేవతలు కూడా చాలా శక్తిమంతమైన దేవతలు వారికి వరం ఇచ్చే శక్తి ఆగ్రహం చూపి

ఆగం చేసే శక్తి ఉంటాయని జానపదులు భావిస్తారు. దాదాపు అన్ని పేరంటాళ్ళ గుడులలో బ్రాహ్మణేతరులు శూద్రులు పూజారులుగా ఉన్నారు. ఇది ఒకసమాంతర ఆరాధనా వ్యవస్థ అని చెప్పవచ్చు. ఇది ప్రధానంగా జానపదుల ఆరాధనా సంప్రదాయం.

## అమ్మతల్లుల ఆరాధన

అమ్మ అన్నా, తల్లి అన్నా ఒకటే కదా! అమ్మతల్లి అనే పదం చిత్రంగా లేదా అని కొందరు అనుకోవచ్చు. కానీ జానపద భాషలో వ్యవహారంలో అమ్మతల్లి అనే వ్యవహారం ఉన్నది. వీరినే గ్రామదేవతలు ఊరి దేవతలు అని దేవుళ్ళు అని కూడా వ్యవహరించడం ఉంది. గ్రామదేవత అనేమాట చాలా విస్తృత వినియోగంలో ఉంది. ఇక పరిశోధన పరిభాషగా మాత్రారాధన అని వ్యవహరించడం తర్వాతి కాలంలో స్థిరపడింది. జానపదులకు ఇంతకు ముందు అధ్యాయాలలో చెప్పిన రీతిలో పురాణ దేవతలను పూజించడం ఉన్నా జానపద సంప్రదాయంలో దానికన్నా ప్రధానమైనది గ్రామదేవతలను పూజించడమే. అత్యంత ప్రాచీన, ప్రాక్‌మానవ ఆరాధనా విధానం ఇది అని ప్రపంచవ్యాప్తంగా జరిగిన మానవశాస్త్ర పరిశోధనలలో సామాజిక శాస్త్ర జానపదశాస్త్ర పరిశోధనలలోను తెలియవచ్చింది. నేటికి కూడా గ్రామదేవతల ఆరాధన చాలా ప్రాధాన్యం సంతరించుకుంది. అంతేకాదు జానపద నమ్మకాల వ్యవస్థలో గ్రామదేవతల పైన ఉన్న నమ్మకాలకు బలం ఎక్కువ. జానపద సంప్రదాయంలో ఈ అమ్మదేవతలు మగదేవతలు ఎలా ఉన్నారు. వారిని జానపదులు ఆరాధించే విధానాలు ఎలా ఉన్నాయి అని వివరంగా తెలుసుకుందాం.

మానవశాస్త్రంలో ఉన్నత సంప్రదాయం (great tradition), గౌణసంప్రదాయం (little tradition) అనే పరిభాషలు ఉన్నాయి. గ్రామీణంగా ఉన్న గ్రామదేవతారాధన గ్రామాలలో ఉండే ఇతర దేవతల ఆరాధనా సంప్రదాయలను గౌణసంప్రదాయాలు అని చెప్తారు. ఈ పరిభాష ప్రకారం

పైన మనం ఇప్పటిదాకా చెప్పిన పురాణ దేవతల సంప్రదాయాన్ని ఉన్నత సంప్రదాయం అని జానపద సంప్రదాయాలను గౌణసంప్రదాయాలు అనే విభాగాల కిందికి వస్తాయని ఇప్పటికే మానవశాస్త్రం వివరించింది. అయితే ఈ రెండు సంప్రదాయాలు పూర్తిగా ఒకదానితో ఒకటి సంబంధంలోని సంప్రదాయాలుగా విడివిడిగా ఉండవు. ఒకదానితో ఒకటి సంబంధం కలిగి ఉండడమే కాక ఒకదానిపైన ఒకదాని ప్రభావం కూడా ఉంటుంది. పురాకథాసంప్రదాయం అంటే జానపద కథాసంప్రదాయం లిఖితసాహిత్య పురాణదేవతా సంప్రదాయాలపైన ప్రభావం ఉండవచ్చు. అదే విధంగా పురాణ దేవతలసంప్రదాయం లిఖిత ఉన్నత సాహిత్యసంప్రదాయపు ప్రభావం జానపద దేవతలు జానపద సాహిత్యం పురాగాథాసాహిత్యాలపైన ఉండవచ్చు. ఈ అధ్యయనాలు కూడా ఇప్పటికే తెలుగు జానపద పరిశోధనలలో జరిగాయి. ఇక్కడ జానపదసంప్రదాయంలో తల్లిదేవతలు, పురుష దేవతల ఆరాధన క్రతువులు పూర్తిగా జానపదుల ఆధ్యాత్మికత ఈ దేవీ దేవతలపట్ల ఎలా ఉంటుందో చూద్దాం.

## అమృతల్లులు అమ్మదేవతలు

అమ్మతల్లులు గ్రామదేవతలు ఏడుగురు అక్కలు అని అంటే ఏడుగురు అక్కాచెల్లెళ్ళు అని వారికి ఒకే తమ్ముడు పోతురాజు అని ప్రగాఢమైన నమ్మకం. ఇంకో ఆలోచన ప్రకారం మాతృదేవతలు 101 మంది. వారికీ తమ్ముడు ఒకడే పోతురాజు. సంఖ్యకు 101 మంది అయినా పేర్లు వేరువేరుగా ఉంటాయి. అక్కడ ఏడు సంఖ్య ఉన్న 101 ఉన్నా కూడా చాలా పేర్లు ఒక్కో ప్రాంతంలో కొంతమంది దేవతల పేర్లు ఉంటాయి. 101 పేర్లను ఒకసారి కింద చూద్దాం.

1 పాగేలమ్మ 2. ముత్యాలమ్మ 3. గంగమ్మ 4. గంగానమ్మ 5. బంగారమ్మ 6. గొంతెమ్మ 7. సత్తెమ్మ 8. తాళమ్మ 9. చింతాలమ్మ 10. చిత్తారమ్మ 11. పోలేరమ్మ 12. మావుళ్లమ్మ 13. మారెమ్మం

14.బంగారు బాపనమ్మ 15. పుట్టానమ్మ 16. దాక్షాయణమ్మ 17.పేరంటాలమ్మ 18.రావులమ్మ 19. గండిపోచమ్మ 20. మేగదారమ్మ 21. ఈరినమ్మ 22. దుర్గమ్మ 23. మొదుగులమ్మ 24. నూకాలమ్మ (అనకాపల్లి, విశాఖ జిల్లా) 25. మరిడమ్మ 26. నేరెళ్లమ్మ 27. పుంతలో ముసలమ్మ (మెయ్యేరు, అత్తిలిదగ్గర, పశ్చిమ గోదావరి జిల్లా) 28. మాచరమ్మోరు 29. మద్ది ఆనాపా అమ్మోరు 30. సోమాలమ్మ 31.పెద్దయింట్లమ్మ 32. గుర్రాలక్క (అంతర్వేది, తూర్పు గోదావరి జిల్లా గుర్రాలమ్మ) 33. అంబికాలమ్మ 34. ధనమ్మ 35. మాలక్షమ్మ 36.ఇటకాలమ్మ 37. దానాలమ్మ 38. రాట్నాలమ్మ 39. తలుపులమ్మ 40. పెన్నేరమ్మ 41. వెంకాయమ్మ 42. గుణాళమ్మ 43. ఎల్లమ్మ (విశాఖపట్నం) 44. పెద్దమ్మ 45. మాంటాలమ్మ 46. గంటాలమ్మ 47.సుంకులమ్మ 48. జంబులమ్మ 49. పెరంటాలమ్మ 50. కంటికలమ్మ 51. పణువులమ్మ 52. సుబ్బాలమ్మ 53. అక్కమ్మ 54. గనిగమ్మ 55.ధారాలమ్మ 56. మహాలక్షమ్మ 57. లంకాలమ్మ 58. దోసాలమ్మ 59.పళ్ళాలమ్మ (వాసపల్లి, తూర్పు గోదావరి జిల్లా ) 60. అంకాళమ్మ 61.జోగులమ్మ 62. పైడితల్లమ్మ 63. చెంగాళమ్మ 64. రావులమ్మ 65.బూరుగులమ్మ 66. కనకమహాలక్ష్మి (విశాఖపట్నం) 67. పోలమ్మ 68.కొండాలమ్మ 69. వెర్నిమ్మ 70. దేశిమ్మ 71. గరవాలమ్మా 72. గరగలమ్మ 73. దానెమ్మ 74. మహాంకాళమ్మ 75. వేరులమ్మ 76.మరిడమ్మ 77. ముళ్ళమాంబిక 78. యలారమ్మ 79. వల్లూరమ్మ 80. నాగులమ్మ 81. వేగులమ్మ 82. ముడియలమ్మ 83. రేణుకమ్మ 84.నంగాలమ్మ 85. చాగాలమ్మ 86. నాంచారమ్మ 87. సమ్మక్క 88. సారలమ్మ 89. మజ్జిగౌరమ్మ 90. కన్నమ్మ–పేరంటాలమ్మ 91. రంగమ్మ–పేరంటాలమ్మ 92. వెంగమ్మ–పేరంటాలమ్మ 93. తిరుపతమ్మ 94. రెడ్డమ్మ 95. పగడాలమ్మ 96. మురుగులమ్మ (బండారులంక, తూర్పు

గోదావరి జిల్లా) 97. కుంచమ్మ విశాఖపట్నంలో 98. ఎరకమ్మ 99.ఊర్లమ్మతల్లి 100, మరిడమ్మ 101.సుంకాలమ్మవ్వ ఉన్నారు.

ఈ నూటొక్కమంది కాక వేరువేరు పేర్లతో ఇంకా గ్రామదేవతలు ఉన్నారు.

నల్లపోచమ్మ, ఎర్రపోచమ్మ, కర్రిపోచమ్మ, పోచమ్మ, మారెమ్మ, అగ్నిమారెమ్మ, అల్లిపూలగంగమ్మ, కట్టమైసమ్మ, గండెమ్మ, గండమ్మ, గండిమైసమ్మ, జోగులమ్మ, కనకమ్మ, లచ్మమ్మ (పురాణదేవత లక్ష్మికాదు అదిలాబాదు జిల్లాలో లక్ష్మి అమ్మ లేదా లచ్చమ్మని గ్రామదేవతగా పూజించేవేరే సంప్రదాయం ఉంది). పెద్దమ్మ, మద్దిరాపమ్మ, మంచాలమ్మ గోదావరి జిల్లాలలో ఇంకా కొన్ని పేర్లు కనిపిస్తాయి. నుసకపల్లమ్మ, వెలగలమ్మ, ఊర్లమ్మతల్లి, పైళ్లమ్మతల్లి, బల్లమ్మతల్లి, లొల్లాలమ్మతల్లి, ఊడలమ్మ తల్లి, కట్వాలాంబిక, నాగాలమ్మ, నాంచారమ్మతల్లి, సింగమ్మతల్లి, ఘట్టమ్మతల్లి, అంజారమ్మతల్లి, మంత్రాలమ్మ తల్లి, తపాటేశ్వరి తల్లి, కుంకుళమ్మ ద్వారకా తిరుమల, చౌడమ్మ నందవరం కర్నూల్ జిల్లా. వీరు కాక చాకలివారికి ప్రత్యేకంగా ఒక అమ్మదేవత ఉంది ఆమె విధెమ్మ.

ఇంకా ఇలా వేర్వేరు జిల్లాలలో వేర్వేరు పేర్లతో గ్రామదేతవతలు అమ్మతల్లులు ఉన్నారు. ఒక ఊరి పేరుతో గ్రామదేవత ఉండవచ్చు. ఉదాహరణకి, మాటూరు గ్రామం ఉంటే మాటూరమ్మ అనే దేవత ఆ గ్రామంలో ఉంటుంది. నాగవరప్పాడు ఉంటే నాగారపాటమ్మ, మర్లపాడు పేరుంటే మర్లపాటమ్మ ఇలా గ్రామాల పేర్లతో కూడా గ్రామదేవతలు ఉంటారు.

ఇన్ని ఏడు కాని వంద కానీ రెండువందలు కాని పేర్లు ఉండవచ్చు. కానీ ఈ అమ్మ దేవతల గుడులు అన్నింటిముందు పోతురాజు ఒక రాయి ఆకారంలో కాని గుంజ ఆకారంలో కాని ఉండవచ్చు.

తెలంగాణలో ఎల్లమ్మ, పోచమ్మ పేర్లతో మాతృదేవతలు చాలా ఎక్కువగా ఉంటారు. ఖమ్మం జిల్లాలో ముత్యాలమ్మ పేరుతో ఎక్కువ గ్రామాలలో దేవత ఉంటుంది. కృష్ణాజిల్లాలో పేరంటాల పేరుతో ఎక్కువమంది ఉన్నారు. అలాగే నాంచారమ్మ కథ జరిగింది కూడా ఈ ప్రాంతంలోనే అని భావిస్తారు. తూర్పు గోదావరి విశాఖలో నూకాలమ్మ పేరుతో ఎక్కువ. అలాగే తలుపులమ్మ పేరుతో అక్కడ ఎక్కువ దేవతలు ఉన్నారు.

ఈ అమ్మతల్లుల ఆరాధన కొద్ది కొద్ది భేదాలతో అన్ని తెలుగు ప్రాంతాలలో దాదాపు ఒకేలాగ ఉంటుంది. అమ్మతల్లి అంటే ప్రజలకు భక్తికన్నా భయం ఎక్కువ. వీరికి ఆగ్రహం ఎక్కువ అని ఆ కోపంతోనే మనుషులకు, జంతువులకు జబ్బులు పుట్టిస్తారని ప్రజలు నమ్ముతారు.

దద్దుపోయడం, ఆటలమ్మ వచ్చింది అని అనడం, స్ఫోటకం వచ్చింది అని అనడం అమ్మవారు పోసింది అని అనడం అమ్మవారు సోకింది అని అనడం జానపద సంప్రదాయంలో చాలా విస్తృతంగా ఉన్న నమ్మకం. ఈ జబ్బులు అంటుజబ్బులు సాధారణంగా వర్షాకాలం ఆరంభంలో వస్తుంటాయి. ఇది సాధారణంగా ఆషాఢమాసం అయింటుంది. ఈ అమ్మ దేవతలకు పూజలు కొలుపులు జాతరలు చేసే కాలం కూడా ఏప్రిల్ నుండి మొదలవుతుంది. అంకమ్మ తిరునాళ్ళు సాధారణంగా ఏప్రిల్ నెలలోనే ఉంటుంది. కొలుపులు అన్నీ కూడా ఏప్రిల్లోనే ముగుస్తాయి. కానీ ఆషాఢమాసంలో పైన చెప్పిన అన్ని అమ్మవార్లకు ప్రతి గ్రామంలో కనీసం నాలుగైదు గుడిసెలు ఉన్న చోటైనా ఒక గ్రామదేవత ఉంటుంది.

గ్రామదేవతలు గుడులు సాధారణంగా చిన్నగా ఉంటాయి. అంటే ఐదు అడుగుల ఎత్తు నాలుగడుగుల చదరంలోనే ఉంటాయి. ఊరి మధ్యన ఉండవచ్చు. ఊరిబయట గ్రామశివారులో పోలేరమ్మ దేవత ఉండవచ్చు. వీధిపక్కన కూడా ఉండవచ్చు. అసలు గుడి లేకుండా కూడా చుట్టూ నాలుగు

రాళ్ళు ఉండి మధ్యలో ఒక చిన్న విగ్రహం ఉండవచ్చు. హరిజన గూడేలలో, మాలపల్లెలలో కూడా చాలాచోట్ల ప్రతిచోటా ఈ అమ్మతల్లుల గుడులు ఉండేవి.

అసలు అమ్మతల్లులకు విగ్రహాలు కూడా ఉండకుంటా ఒక రాతికి పసుపు రాసి కుంకుమ బొట్లు పెట్టి దాన్నే విగ్రహంగా దేవతగా భావించడం ఉంటుంది.

పైన చెప్పిన ఈ దేవతలేకాక ప్రతి గ్రామంలో బొడ్డురాయి ఉంటుంది. ఇది సర్వసాధారణంగా ఊరిమధ్యలో ఉంటుంది. ఈ బొడ్డురాయి కూడా అమ్మదేవత సంప్రదాయంలోనే ఆరాధన చేస్తారు.

ఈ అమ్మ దేవతల గుడులలో పూజారులుగా వెనుకబడిన కులాల వారు లేదా దళిత కులాలవారు పూజారులుగా ఉంటారు. సాధారణంగా చాకలి, కుమ్మరి వారు ఎక్కువ గ్రామదేవతల గుడులలో పూజారులు. అంకమ్మ గుడులలో గంగమ్మ గుడులలో యాదవులు లేదా గొల్లలు పూజారులుగా ఉండడం కనిపిస్తుంది. ఇక తెలంగాణలో ఎల్లమ్మ గుడులలో పోచమ్మ గుడులలో కురుమ ఒగ్గుపూజారులు ఉంటారు.

ఆషాఢమాసంలో ప్రతి గ్రామదేవతకు ఉత్సవం చేస్తారు. ముత్యాలమ్మకు అయితే ఆషాఢమాసంలో ఒక రోజున ఉరంతా ఉత్సవం చేస్తుంది. అమ్మకు ప్రతి ఇంటినుండి ఒక కడవ నీళ్ళు తెచ్చి పోస్తారు. ఇలా చేసిన తర్వాత పూజారి తిరిగి అమ్మ దేవతకు విగ్రహం కానీ రాయి కానీ దీనికి పసుపురాసి పూర్తిగా ఎర్రబొట్లు పెడతారు. తర్వాత బలి కార్యక్రమం ఉంటుంది. కోడి, మేక బలులు చాలా ఎక్కువగా ఉంటాయి. గంగమ్మకి గొర్రెపోతును బలి ఇవ్వడం సంప్రదాయం. మరొక ఆదివారం నాడు ఈ అమ్మదేవతలకు బోనాలు పెడతారు అంటే పవిత్రంగా ఇంట్లో అన్నం వండి నిండుకుండ భోజనాన్ని అమ్మకి తెచ్చిపెడతారు. అక్కడ

పెట్టిన తర్వాతనే మిగిలిన దాన్ని ప్రసాదంగా భావించి పవిత్రంగా భావించి స్వీకరిస్తారు. అమ్మదేవతలకు బలి ఇవ్వడం, పొంగళ్ళు పెట్టడంతో పాటు ఆమెకు కల్లును వారబోయడం ఆమెకు కల్లును ప్రసాదంగా అందిచడం కూడా విస్తృతంగా ఉంది. ఈ ఆధునిక కాలంలో పళ్ళెంలో విస్కీ పోసి దానిలో పత్తివేసి వెలిగించి హారతి ఇచ్చిన ఘట్టాలు కూడా నాకు క్షేత్ర పరిశోధనలో కనిపించాయి. సురను అమ్మ దేవతలకు ఇవ్వడం పరిపాటిగా ప్రాచీన కాలంనుండి వస్తున్నది. ఏడాదికి ఒకసారి ఇలా ఊరంతా కలిసి చేయకపోతే తల్లి ఆగ్రహిస్తుందని తమకు కాని పశువులకు కానీ జబ్బులు కలిగిస్తుందని భయపడతారు.

ఇక్కడ చాకలి కాని, కుమ్మరి కాని ఉన్న పూజారి మిగతా సమయాలలో తక్కువగా భావించబడినా అమ్మవారి వద్ద పూజారిగా ఉన్నంతసేపు అందరికన్నా అధికుడు అతనే గ్రామంలో ఏ పెద్ద కులం వ్యక్తి అయినా పటేలు అయినా ఆరోజున అక్కడ అమ్మవారికి మొక్కినట్లు చాకలి పూజారికి మొక్కాలి తలవంచాలి. తన కోడిని తన చేత్తో చాకలికి ఇస్తే అతను అమ్మవారి ఎదురుగా దాన్నికోస్తాడు. ఊరిబయట ఉన్న అంకమ్మ గుడులలో పూజారులు వేరేవారు ఉన్నా అక్కడ బలి ఇచ్చే పని హరిజన పెద్దే చేస్తాడు. కొన్ని అంకమ్మ గుడులలో హరిజనులే పూజారులు.

ఇలా ఊరి వంతున ఉత్సవం చేసేటప్పుడు ఊరి పెద్ద అంటే సర్పంచి కానీ పటేలు కానీ ప్రతి ఇంటినుండి ధాన్యం డబ్బు వసూలు చేసి వాటితోనే ఖర్చులు చేస్తారు. ప్రతి ఇంటినుండి తప్పక ఏదో కొద్దిగానైనా వస్తుంది. కానీ చేతివృత్తుల వారి వద్దనుండి చందా వసూలు చేయరు. కారణం వారు అమ్మతల్లి పూజలో కొన్ని ముఖ్యమైన పనులు చేయవలసి ఉంటుంది.

తెలంగాణలో బోనం అని అన్నా అటు సర్కారు జిల్లాలలో పొంగళ్ళు పెట్టడం అన్నా ఒకటే. చాలా అమ్మతల్లుల గుడులలో పొంగళ్ళను గుడి

ఆవరణలోనే వండుతారు. బలి కూడా అక్కడే అదే సమయంలో చేయడం కూడా ఉంటుంది.

ఇక ఊర్లలో శాకాహారి కుటుంబాలు కొన్ని ఉంటాయి. బ్రాహ్మణలు, విశ్వబ్రాహ్మణులు (విశ్వకర్మలు) వైశ్యులు వీరి శాకాహారులుగా ఉన్న చోట వారు గ్రామదేవతల కొలుపులు, జాతరలలో అమ్మతల్లులను పూజించడానికి రారు. దాన్ని మరొక విధంగా చేస్తారు. ఇంట్లోనే మూడు చిన్నరాళ్ళు పిడికెడు అంత పట్టేవి ఆదివారం నాడు ఇంట్లో పూజాప్రాంతంలో పెట్టి ముత్యాలమ్మగా భావించి పూజ చేస్తారు. ఇంకా కొందరు ఈ కుటుంబాల వారు ఇంటి చాకలిని పిలిచి అతనికి డబ్బు ఇచ్చి కోడిని కొని అమ్మవారికి సమర్పించమని చెప్తారు. కానీ వారు గుడికి వెళ్ళడం ఉండదు. కొన్ని శాకాహారుల ఇళ్ళలో మరొక పద్ధతి ఉంటుంది. దాన్ని అవ్వకు చద్దిపెట్టడం ఉంటారు. రాత్రి పూట అన్నం వండి కొద్దిగా ఆరిన తర్వాత నిండుకుండ అన్నంలో పెరుగు కలుపుతారు, తెల్లవారి రోజున ఆదివారం నాడు ఈ చల్ది అన్నాన్ని అమ్మవారికి పెడతారు.

వర్షాకాలంలో సాధారణంగా వచ్చే అంటు జబ్బులు చిన్నచిన్న దద్దులు వచ్చే జబ్బులని అమ్మవారు సోకింది అని అంటారు. ఏ వైద్యుని పిలవరు. ఏ మందులు వాడరు. కాని రోగిని ఇంట్లోనే కింద చాపమీద పడుకోబెట్టి చుట్టూ వేపమండలు పెడతారు. చల్లని నీళ్ళు ఇస్తారు. రోగికి అదేవిధంగా తగ్గిపోతుందని భావిస్తారు. సాధారణంగా ఒక వారంరోజుల్లో తగ్గిపోతుంటుంది. ఇక మసూచి స్ఫోటకం వంటివి ఏభై సంవత్సరాల క్రితంలో వచ్చినప్పుడు ఊరంతా ఎంతో భయపడి పోయేవారు. ఎందరో చనిపోయేవారు. అమ్మవారు ఊరంతా తాండవిస్తూ ఉంది ఆగ్రహంతో ఊగిపోతూ ఉంది అని భయపడేవారు. ఇంటినుండి బయటికి రావడానికే భయపడేవారు. ఇళ్ళలో ఉండే అమ్మవార్లను తలచుకొని భయంతో మొక్కేవారు ఇంట్లోనే ఉన్న రాయిని అమ్మవారుగా చేసి పూజించి బలిఇచ్చేవారు.

జానపద సంప్రదాయంలో అమ్మదేవతలను తలచుకోని రోజు ఉండదు. వారి ఆధ్యాత్మికతలో గ్రామాలలో ప్రతి ఇంట్లో, ప్రతి వ్యక్తిలో గ్రామదేవతల చాలా ముఖ్యం. పురాణ దేవతల గుడులు ఎన్ని ఉన్నా ఎన్ని పూజలు భజనలు చేసినా అమ్మతల్లి అంటే భయం తర్వాత భక్తి. ఇక పంట వచ్చిన ప్రతిసారీ మొదటి మానిక ధాన్యాన్ని అమ్మవారికి ఇచ్చే సంప్రదాయం ఉంది. కొన్ని గ్రామాల్లో, పొలాల్లో కూడా అక్కడక్కడా అమ్మదేవతల చిన్న గుడులు రాయిరూపంలో ఉంటాయి.

ప్రాజ్ఞానవుడి ఆదిమ ఆధ్యాత్మికత అతి ప్రాచీనమైన ఆధ్యాత్మిక భావన పురాణ దేవతలకన్నా కూడా అమ్మ దేవతలపైనే ఉన్నదని మానవశాస్త్ర పరిశోధనలు విశ్వవ్యాప్తంగా తెలియజేస్తున్నాయి. దాదాపు నాలుగు వేల నుండి ఐదువేల సంవత్సరాలక్రితం జరిగిందిగా భావించే సింధు నాగరికతలో హరప్పా, మెహంజదారోలో బయల్పడిన తవ్వకాలలో దొరికిన శిల్ప అవశేషాలను బట్టి అక్కడ ఉన్నది మాతృదేవత ఆరాధనగానే మానవ శాస్త్రజ్ఞులు భావించారు. అందుకే దక్షిణ భారతదేశంలో ఉండిన దేశీయమైన ఆరాధన, ఆధ్యాత్మికత (native religion) అమ్మతల్లుల ఆరాధనే అని పరిశోధకులు భావిస్తారు. తర్వాతనే పురాణ దేవతల ఆరాధన పెద్దపెద్ద గుడులు కట్టడం వచ్చిందని భావిస్తారు. అయితే పురాణ దేవతల పేర్లతో ఎన్నో దేవతలు అమ్మ దేవతల ఆరాధనలోనికి వచ్చారు. ఎల్లమ్మనే రేణుకా ఎల్లమ్మ అని అంటారు. ఎల్లమ్మనే పార్వతి కూతురు అని పార్వతి అవతారమనే జానపదులు భావిస్తారు. అటు పురుష దేవతలలో కూడా మల్లన్న దేవుడు శివుని అవతారమని ఆయన కుమారుడు అని భావించడం ఉంది. ఇలా పురాణ దేవతలు జానపద దేవతల సంయోగం జరిగి కూడా శతాబ్దాలు గడిచాయి. అయినా జానపదసంప్రదాయంలో అమ్మదేవతల ఆరాధనకే ఎక్కువ ప్రాధాన్యం ఉంటుంది.

అంతేకాదు కొందరు అమ్మదేవతలు కొన్న ప్రాంతాలకు కొన్ని కులాలకు పరిమితమైనవారు కూడా ఉన్నారు. బెజవాడ కనకదుర్గ, శ్రీశైల భ్రమరాంబ, కొల్హాపురం లక్ష్మి, మాహురమ్మ ప్రాథమికంగా అమ్మతల్లులే బెజవాడ కనకదుర్గ జానపద సంప్రదాయంలో అతి ప్రాచీనమైన ఆరాధన కలిగిన దేవత. ఇప్పుడున్న ఆకారంకాక ప్రాచీనకాలంలో అక్కడ ఆమె ఆకారం గ్రామాలలోని అమ్మదేపతలాగే ఉండేదని పెద్దవారు చెప్పారు. క్రమంగా కాలపరిణామంలో ఆమె నేడు సంస్కృత పురాణ దేవతగా మారింది. ఒకప్పుడు అక్కడ బలులు కూడా ఇచ్చేవారని పెద్దలు చెప్పారు.

ఇక కొందరు అమ్మదేవతలు ప్రత్యేకంగా ఒక కులానికి చెందినవారున్నారు. ఎల్లమ్మ లేదా రేణుక హరిజనులవారి ఆశ్రితులైన బైండ్లవారి కులదేవత వారి కులానికి మూలరూపం. గంగమ్మ గొల్లవారి ఇలవేలుపు. ఈదెమ్మ గౌండ్లవారి దేవత, విధెమ్మ చాకలివారి దేవత చౌడమ్మని సకాశీలు ప్రత్యేకంగా పూజిస్తారు. ఈ దేవతలకు పూజారులు కూడా వేరువేరు ప్రాంతాలలో ఆయాకులాల వారికే చెందివారున్నారు.

మాత్రారాధన సంప్రదాయంపైన తెలుగులో మొదటి సారి విస్తృతమైన పరిశోధన చేసింది మా గురువుగారు ఆచార్య నాయని కృష్ణకుమారిగారు. వారు మాతృదేవతారాధనలో ప్రముఖ లక్షణాలను కిందివిధంగా చెప్పారు.

“హిందూదేశమెల్లెడ గ్రామ గ్రామమునను నెలకొనిన జానపదుల మాతృదేవతా mother goddess లక్షణముల నీ క్రింది విధముగా క్రోడీకరించవచ్చును.

1. ఈ యమభయంకరస్వూరపిణి. చతుర్భుజిగా చిత్రింపబడిన యీయమ శూల కపాల, గదా, ఖడ్గ హస్త, లంబ జిహ్వాక యగునీమె వికట దంతయు విస్ఫారిత నేత్రము, కరాళవదనయునా, భయమును కలిగించును.

2. ఈమెకు బలి జంతు మాంసఖాదనమున, రక్తపానమున, ఆసవసేవనమున, ప్రీతి మెండు.

3. మానవుడీమెను భక్త్యావేశము కన్న భయవివశతతోడనే కొలువ బూనును.

4. తమ్ము మఱచిన జనులను కష్టాల పాల్టేయుటయు, రోగముల బారి బడజేయుటయు నీమెకు ప్రీతి.

5. పాలిత జనముపై నీమెకు సంతానబుద్ధి యుండుటచే నీమె జగద్ధాత్రి.

6. భక్తుల కోరికపై నీమె గ్రామమును రక్షించును. చెలరేగిన యంటు వ్యాధులను సదుపున పెట్టును. పశువులను, జనులను పీడనుండి గ్రహబాధనుండి, శత్రువులనుండి కాపాడును. ఊరి పొలిమేఱలను రక్షించును. చెఱువు కట్టలను రక్షించును.

7. ఊరియందు వేపచెట్ల క్రిందను. త్రాచుపుట్టల యందును, నెలకొని యుండును. కేవలము నాగరూపమున నీమె జానపదులచే నర్చింపబడుటయు కలదు".

ఆనాటి అవసరాల మేరకు తమ సిద్ధాంతాన్ని గ్రాంథిక భాషలో వ్యక్తీకరించినా పైన మనం చెప్పుకున్న గ్రామదేవతల లక్షణాలు వేరువేరు సందర్భాలలో వారిపైన జానపదుల నమ్మకాలు పైన చెప్పిన లక్షణాలలో ఉన్నాయి. హెన్రీ వైట్‌హెడ్ 1910 ప్రాంతంలో ఆంధ్రదేశంలోని గ్రామదేవతలైన పరిశోధన చేసి Village Gods of South India గ్రంథం రచించాడు. ఆయన కూడా తెలుగు నేలపైనున్న గ్రామదేవతల గురించి చాలా ముఖ్యమైన పరిశీలనలు చేశాడు. కొన్ని కథలను కూడా సేకరించాడు. అందులోను జానపద సంప్రదాయంలోని అమ్మదేవతలపైన నమ్మకాలు ఎలా ఉన్నాయో ఎంత బలీయంగా ఉన్నాయో కూడా వివరించాడు. మూడు దశాబ్దాలుగా ఈ గ్రంథకర్త చేసిన క్షేత్ర పరిశోధనలలో పైన చెప్పిన ఏడు

అంశాలను గమనించడం జరిగింది. పైన కృష్ణకుమారి గారు చెప్పిన మొదటి లక్షణం ప్రకారం అమ్మదేవత స్వరూపం చాలా గుడులపైన చిత్రరూపంలో చిత్రించినవి తెలంగాణ అమ్మవార్ల గుడులలో కనిపిస్తాయి. ఎల్లమ్మ గుడులలో ఇలాంటి బొమ్మలు కనిపిస్తాయి. ఈ దేవతలు భయం కలిగించే దేవతలు కనుకనే ఆగ్రహం చూపితే ప్రాణభయం ఉంటుందనే భయంతోనే అమ్మదేవతలను కొలుస్తారు. ఆమెకు కొలుపు చేయడం మర్చిపోయినా ఆమె ఆగ్రహానికి గురికావలసి వస్తుందన్నది జానపదుల ఆధ్యాత్మికతలో చాలా ముఖ్యమైన విషయంగా గుర్తుంచుకోవాలి.

అమ్మదేవతలకు చెందిన ఈ జానపద ఆచారాలు ఆధ్యాత్మికత ఆర్యపద్ధతికి భిన్నమైన ద్రావిడ పద్ధతి అని దేశీయమైన మతాచారమని పరిశోధకులలో పండితులలో ఒక వాదం ఉన్నది. ఇది ఆధునిక మానవ శాస్త్రజ్ఞులు మాత్రమే చేసిన వాదన కాదు. తాంత్రిక పూజలలో ఉండే విధానాలు కనిపించేవి జానపదుల మతంలోనని ఇందులో ఉన్న సురాపానం దేవతకు సురను ప్రసాదంగా అర్పించడం ఇవే తర్వాతి తాంత్రిక పూజల్లోకి పోయినవి అని ఆచార్య నాయని కృష్ణకుమారి గారు అభిప్రాయపడ్డారు. వారు బాణభట్టు రచించిన కాదంబరిని ఉటంకిస్తూ చండీదేవత ఆలయంలో బలి ఇతర ఆచారాలు నిర్వర్తించే ముదుసలి పూజారి ద్రావిడుడు అని చెప్పినట్లు వారు చెప్పారు. కాదంబరి కావ్యాన్ని రచించిన ఈ బాణభట్టు హర్షవర్ధనుని కాలానికి అంటే 7వ శతాబ్దానికి చెందినవాడు. అప్పటికి మానవశాస్త్రం ఇంకా పుట్టలేదు. కనుక అమ్మదేవతల ఆరాధనా సంప్రదాయం ద్రావిడ సంప్రదాయం అని చెప్పడానికి ఇది మంచి భూమిక. “అంతేకాదు ద్రావిడ శబ్దప్రయోగం కూడా తొలిసారిగా ఇక్కడ మనకు కనిపిస్తుంది. ద్రావిడులలో ఒక కాలంలో మాతృప్రాధాన్యం ఉన్న సమాజం ఉండి ఉండడం వల్లనే ఇక్కడ ఇలా మాత్రారాధన బలంగా వేళ్ళు దన్నుకొని ఉన్నదని కృష్ణకుమారి గారు అభిప్రాయపడ్డారు. సమాజం ఎంతో అభివృద్ధి

చెందినది నేడు 21వ శతాబ్దంలో డిజిటల్ యుగంలో ఉన్నాము. కానీ జానపదుల ఆధ్యాత్మికతలో ప్రధానభాగమైన ఆచారకాండగా మిగిలిన అమ్మదేవతల ఆరాధన అంత బలంగానే నేటికీ ఉన్నది. జానపదుల మొత్తం ఆధ్యాత్మిక ఆచారకాండలో అమ్మదేవతల ఆరాధన నేటికీ పరివ్యాప్తమై గ్రామగ్రామాన విస్తరించే ఉన్నది. ఆ తర్వాతికాలంలో వచ్చిన పురాణ దేవతల గాథలు జానపద సంప్రదాయంలోని అమ్మదేవతల పురాగాథలు తర్వాతి కాలంలో సమ్మేళనం చెందినట్లు చాలా పురాకథలలో మనకు అంతర్గత సాక్ష్యాలు కనిపిస్తాయి. మల్లన్న పురాణకథ, ఎల్లమ్మ పురాకథ ఇందుకు మంచి ఉదాహరణలు.

## పేరంటాళ్ళ దేవతలు కూడా గ్రామదేవతలే

పైన పేరంటాళ్ళ దేవతలు ఎవరు పేరంటాలు అంటే ఏమిటి అనే చర్చ జరిగింది. కనుక ఇక్కడ తిరిగి ఆ ప్రస్తావన చేయవలసిన పనిలేదు. గ్రామదేవతల మాదిరిగానే వీరు కూడా భయాన్ని కలిగించే దేవతలుగానే భావిస్తారు. వీరు వరాలు కూడా ఇవ్వగలిగేవారు. కానీ ఆగ్రహిస్తే అంతం కూడా చేయగలరని పేరంటాళ్ళ కథలు చెబుతాయి.

పెనుగంచిప్రోలు తిరుపతమ్మ ఒక కథప్రకారం అడవికి పశువులను మేపడానికిపోయి అక్కడ పులివాత పడి చనిపోయిన భర్త గోపయ్యతోపాటు చిచ్చురికిందని అంటే సహగమనం చేసిందని ఆతర్వాత దేవతై వెలిసిందని తెలుస్తుంది. మరో కథప్రకారం భర్తే ఆమెను అనుమానించి చంపాడని ఉంది. ఏదిఏమైనా ఈ కథ జరిగి దాదాపు 200 సం॥లు గడిచిందని నా పరిశోధనలో ఆధారాలు దొరికాయి. నేటికీ వేలసంఖ్యలో భక్తులు ఆమెను ఆరాధించి ఆమెను ఒక గొప్ప దేవతగా పూజిస్తారు. గ్రామదేవతలకు మాదిరిగానే అన్ని ఆచారాలు పాటిస్తారు. పొంగళ్ళు పెట్టడమేకాక జంతుబలులను కూడా చేస్తారు. ఇక లింగాలపాడు శ్రీలక్ష్మమ్మ కూడా ఒక పేరంటాలు దేవత ఈమె అత్తింటి ఆరళ్ళ కారణంగా భర్త

చేతిలో చనిపోతుంది. ఆమె చితిలో ఉండగానే మహిమ చూపుతుంది తనను ఆరడిపెట్టిన అత్తకు ఆడబడుచుకు కళ్ళు పోయేలా కాళ్ళుపడేలా చేస్తుంది. భర్తమీద కూడా ప్రతీకారం చూపుతుంది. తాను దేవతగా వెలిసానని తనకు గుడికట్టి పూజించమని అప్పుడే క్షమిస్తానని చెప్పింది. అప్పటినుండి కృష్ణాజిల్లా నందిగామ పక్కనున్న లింగాలపాడు గ్రామంలో ఈ లక్ష్మమ్మ పూజలు అందుకుంటున్నది.

తెలప్రోలు రంగమ్మ, సన్యాసమ్మ, కామమ్మ ఉత్తరాంధ్ర ఆరాధ్యదేవత పైడితల్లి ఇలాంటి పేరంటాళ్ళ దేవతలే. కామమ్మ సహగమనం చెందినది. రంగమ్మ ఆకాల మరణం చెంది మహిమలు చూపింది. కామమ్మ ఇలా కోస్తా జిల్లా పొడుగును ఈ పేరంటాళ్ళ దేవతలు పూర్తిగా గ్రామదేవతల మాదిరిగానే ప్రధానంగా అమ్మదేవతల పద్ధతిలోనే పూజలు అందుకుంటున్నారు. వీరందరూ శాపానుగ్రహశక్తి కలిగిన దేవతలే. జానపదుల ఆధ్యాత్మిక భావనలో అతి ప్రాచీనమైన అమ్మదేవతలకు ఇటీవలి కాలంలోనే వెలసి దైవీకరించబడిన ఈ పేరంటాళ్ళ దేవతలకు తేడా లేదు.

## అమ్మదేవతల జానపద విజ్ఞానం

అమ్మదేవతల చుట్టూ చాలా జానపద విజ్ఞానం ఉంది. ప్రధానంగా నమ్మకాల వ్యవస్థ (belief system) చాలా బలంగా పనిచేస్తుంది. ప్రతి ఇంటిలో ప్రతి వ్యక్తిపైన ఈ ప్రభావం ఉంటుంది. అమ్మదేవతల విషయంలో భయపడటాన్ని ఈ గ్రంథకర్త క్షేత్రపరిశోధనలో గమనించాడు. ఈ దేవతలు చాలా శక్తిమంతంగా ఉంటారని శపిస్తారని హాని కలిగిస్తారని నమ్ముతారు. దీని కారణంగానే ఈ మతంలోని వారేకాదు. గ్రామంలో నివసించే మిగతావారు కూడా భయపడడం ఈ దేవతలను దూషించడం కానీ వారిని కించపరిచి మాట్లాడటం కానీ చేయరు. అలాచేస్తే దేవత కోపానికి గురికావలసి వస్తుందని వారు కూడా నమ్ముతారు.

ఊరు బొడ్రాయికి కొలుపు చేసేటప్పుడు దళితకులాలవారు (మాదిగ), కొమ్ముల వారు చాలా ప్రధానపాత్ర పోషిస్తారు. మంత్రాలు చదివేది వారే, బలులు ఇచ్చేది వారే. కొన్ని సందర్భాలలో ఈ దళిత కులాలవారు మతం మారినా వారి పెద్దలు వారసత్వంగా ఈ దేవతల వద్ద మిరాసి ఉన్నవారు తప్పనిసరిగా వచ్చి వారు చేసే ఆచారాలు వారు చేస్తారు. మిగతా అమ్మదేవతల విషయంలో కూడా ఇదే వర్తిస్తుంది.

గ్రామంలో అంటువ్యాధులు ప్రబలినప్పుడు రాత్రిపూట ఎవరూ బయటికివచ్చి తిరిగే సాహసం చేయరు. రాత్రిపూట అమ్మవారు ఊరి వీధుల్లో ఉగ్రరూపంలో తిరుగుతుంటుందని అర్ధరాత్రి వేళ ఎవరైనా ఎదురైతే ఆమె కోపానికి బలికావలసిందేనని అక్కడికక్కడే ఆ వ్యక్తులు నెత్తురు కక్కుకుని చచ్చిపోతారని నమ్ముతారు. అంతేకాదు ఇంట్లో ఉండి కూడా రాత్రిపూట కిటికీలలో నుంచి బయటికి చూడడానికి కూడా భయపడతారు. పిల్లలకు ఇదే విషయాలు బలంగా చెప్తారు. మసూచి, స్ఫోటకం వచ్చిన రోజుల్లో ఆ వ్యాధి ఉన్న బజారుకు కూడా పోవడానికి ఎవరూ ముందుకు రారు. ప్రభుత్వం నుండి డ్యూటీ మీద వచ్చిన నర్సులు వైద్యాధికారులు మాత్రమే పోయేవారు. దూరంగా ఉంటే అంటు సోకదని భావించినా ఆ వీధుల్లో అమ్మవార్లు ఉంటారని అలాంటప్పుడు అక్కడికిపోవడం ఎందుకని ఊరి ప్రజలు నమ్ముతారు భయపడతారు. ఈ భయం పోవడానికి ఇంట్లో ఉన్న అమ్మతల్లి రాయికి కాని ఊర్లో ఉన్న అమ్మవారి గుడికి కాని పోయి దండం పెట్టుకుంటే భయం పోతుందని అలా చేస్తారు. ఇలాంటి అంటువ్యాధులు మనుషులకు కానీ పశువులకు కానీ వచ్చినప్పుడు ఊరివారు ప్రత్యేకంగా కొలుపులు చేయిస్తారు. అంటే ఏడాదికి ఒకసారి చేసే కొలుపులకు అదనంగా కొలుపులు చేయిస్తారు. ఈ కొలుపులు నిర్వహించేది మాదిగ, కొమ్ముల, ఆసాది, బైండ్లవారే. అందుకే వీరికి ప్రత్యేకమైన శక్తులు ఉంటాయని మంత్రాలు పెట్టే శక్తి కూడా ఉంటుందని గ్రామప్రజలు నమ్ముతారు. అలాంటి సమయాలలో వారిని చాలా ప్రత్యేకశ్రద్ధతో చూస్తారు.

## కొలుపులు ప్రదర్శనలు

ప్రతి గ్రామదేవత, లేదా అమ్మదేవతలను శాంతింపజేయడానికి ప్రతి సంవత్సరం కొలుపులు చేస్తారు. ఊరిమధ్యలో ఉన్న దేవతకు కానీ ఊరిచివర పెద్ద గుడిలో ఉన్న అమ్మ దేవతకు కానీ కొలుపు చేయడం తప్పనిసరి ఇది ఒకరోజు నుండి మూడురోజులు ఉంటుంది. ఈ కొలుపులు చేయడానికి పైన చెప్పిన దళిత కులాలవారికి మిరాసి గ్రామాలు ఉంటాయి. ఆయా మిరాసి ఊర్లలో వారికే హక్కు ఉంటుంది. అంటే ఆ గ్రామాలలో కొలుపు చేసినా ప్రదర్శనలు చేసినా ఆ హక్కు ఉన్న వారే చేయవలసి ఉంటుంది. వేరేవారికి ఆ గ్రామాలలో ప్రవేశం ఉండదు.

ప్రతి కొలుపులో బలి, కథాప్రదర్శన తప్పనిసరి. బలి ఇచ్చేది సర్వసాధారణంగా మాదిగ కానీ బైండ్లవారు కానీ చేస్తారు. దున్నను కానీ మేకలను కానీ బలి ఇచ్చేది మాదిగ చేస్తాడు. మేకలను గావు పట్టేది మాత్రం బైండ్లవారు చేస్తారు. అలా కొలుపు జరిపిన సందర్భంలో ఆ అమ్మదేవతకు చెందిన కథ చెప్పడం తప్పనిసరి. అమ్మదేవత సత్తెమ్మ, అంకమ్మ, ముత్యాలమ్మ, పెద్దమ్మ ఎవరైనా సరే ఆమెకు సంబంధించిన కథ చెప్పి కథకుడి చేత పసుపు పూయించుకుంటే అమ్మవారి కోపం వారిపైన ఉండదని జానపదులు గట్టిగా విశ్వసిస్తారు. అందుకే కొలుపులు జరిగే రోజుల్లో అమ్మవారి కథాప్రదర్శన తప్పనిసరిగా పెట్టిస్తారు. వాటిని చూచి విని అమ్మ కథని మననం చేసుకుంటారు. బైండ్లవారు అమ్మతల్లుల కథను ప్రదర్శించడంలో ప్రత్యేకంగా ఉంటారు. వారు తరతరాలనుండి ఈ కథలను చెబుతున్నారు. ఎల్లమ్మకథ, పోచమ్మకథ, ముత్యాలమ్మకథ వీరు చెప్తారు. జాతరలు కొలుపులు జరిగే రోజుల్లో తెలంగాణ అంతటా బైండ్లవారు అచారకాండ నిర్వహించడం బలి చేయడంతోపాటు రాత్రిపూట కానీ, పగలు కానీ దేవతల కథలు చెప్తారు. అంకమ్మ గుడులవద్ద కొమ్ములవారు అంకమ్మ కథని పాడతారు ప్రదర్శన చేస్తారు.

ఈ కథాప్రదర్శనల సందర్భంలో కథను చూస్తున్నవారికి అమ్మవారు ఒంటి మీదికి వచ్చి ఊగిపోవడం సాధారణంగా జరుగుతుంటుంది. అలా ఉగ్రం వచ్చినవారి వద్దకు కథ చెప్పే ప్రధాన కథకుడు కథను ఆపి వస్తాడు. తనచేత అమ్మవారి పసుపును తెచ్చి నుదుట మీద రాసి వీపు మీద చిన్నగా కొడతాడు. దీనితో ఆమెకాని అతను కాని శాంతించి మామూలు స్థితికి వస్తాడు. ఇలా అమ్మదేవతలు పిలిస్తే పలుకుతారని వారు అందరిని చూస్తుంటారని అమ్మల విషయంలో ఏమాత్రం శ్రద్ధ తక్కువైనా ఏదో ఒక నష్టం కలిగిస్తారని జానపదులు చాలా గట్టిగా నమ్ముతారు. ఇది వారి ఆధ్యాత్మికతలో చాలా ముఖ్యమైన విషయం. ఇలా వేర్వేరు కులాలవారు అమ్మవారి కథలు వృత్తిపరంగా తరతరాలుగా ప్రదర్శిస్తూ వస్తున్నారు. పూజారి వ్యవస్థ ఇలా సమాంతరంగా గ్రామం లోపల ఉండే వెనుకబడిన కులాలలోను, గ్రామం బయట గూడెంలో ఉండే దళిత కులాలలోను ఉన్నారు. ఆయా దేవతల గుడులలో ఉండే ఈ పూజారులను వారి వంశపారంపర్య హక్కులను ఆయా గ్రామాల వారు నేటికీ గౌరవించి వారిని కొనసాగిస్తున్నారు. వారిని మార్చాలనుకోవడం కూడా పాపమేనని ఏ కులం వారు చేసే పనిని ఆకులం వారు చేయాలని జానపదులు గట్టిగా నమ్ముతారు.

కానీ నగరాలలో అమ్మదేవతల గుడుల విషయంలో ఈ నియమాలు సడలినాయి. ఎల్లమ్మ, పోచమ్మ, మహంకాళి దేవతల గుడులలో బాగా ఆదాయం పెరిగిన గుడులలో వెనుకబడిన, దళిత కులాల పూజారులను తొలగించి బ్రాహ్మణ పురోహితులను పూజలకోసం పెట్టడం అలాగే అమ్మవారి పేరిటి సంస్కృతంలో అష్టోత్తరం చదివించి పురాణ దేవతల గుడులలో మాదిరిగా పూజలు సేవలు నిర్వహించేలా భక్తులు నియమిస్తున్నారు. కొన్ని అమ్మదేతల గుడులలో ఒక ప్రత్యేకంగా విగ్రహాన్ని పెట్టించి అక్కడ బ్రాహ్మణ పూజారిని పెట్టడం, బలులు ఇవ్వకుండా నిషేధించడం చేస్తున్నారు. అంటే గ్రామాలలో ఉండే ఈ గ్రామదేవతలు నగరం పెరిగి విస్తరించి నగరాలలోనికి

చొచ్చుకు పోయినప్పుడు ఈ నవనాగరికత ఈ మార్పులు తెస్తున్నది. నేటి నగరాలలో గ్రామదేవతల ఆచారాలలో ఇలా చాలా పరివర్తనలు చోటు చేసుకున్నాయి. అసలు ఈ అమ్మదేతల ఆరాధనాస్వరూపాన్నే మార్చే పరిణామాలు కూడా చోటుచేసుకున్నాయి. ఒకటి రెండు ఉదాహరణలు ఇక్కడ గమనించచ్చు.

హైదరాబాదు నగరంలో దాదాపు 700 సం॥ చరిత్ర కలిగిన బల్కంపేట ఎల్లమ్మ గుడి ఉంది. ఇది గోలకొండ పట్టణానికి దాదాపు పది మైళ్ళ దూరంలో ఉన్న ఆనాటి గ్రామం అక్కడ బావి తవ్వుతుండగా సుమారు 15 అడుగుల లోతులో ఒక ఎల్లమ్మ విగ్రహం కనిపించింది. దాన్ని వేరేచోటికి తరలించాలని ప్రయత్నించారు. కానీ సాధ్యం కాలేదు. ఆమె ఆ పొలం యజమానికి కలలో కనిపించి అక్కడే గుడి కట్టమని ఆదేశించింది. గౌడ కులస్థులు అప్పటినుండి ఇక్కడ వారి గుడిలో వారే పూజారులుగా ఉన్నారు. ఇటీవలికాలంలో జరిగిన పరిణామం కారణంగా అదే గుడిపైన మరొక అమ్మవారి గుడి కట్టారు. అందులో బ్రాహ్మణ పూజారులను నియమించారు. ఇక్కడ ఆగమోక్తంగా వారు పూజలు నిర్వహిస్తారు. కింది గుడిలో ఎల్లమ్మకి సాంప్రదాయికంగా వచ్చే గౌడ పూజారులు చేస్తారు. అయినా సరే ఇక్కడ బలులు నిషేధించారు. ఎల్లమ్మకి బలి ఇవ్వాలని గట్టిగా నమ్మేవారు అదే ప్రాంగణంలో దూరంగా బలి ఇచ్చేలాగా అనుమతి ఇస్తున్నారు. ఆలయం విపరీతంగా అభివృద్ధి చెందినది. దేశవిదేశాల నుండి ఎందరో ఇక్కడికి వస్తుంటారు. ఇలా ఆదాయం బాగా పెరిగిన దేవాలయాలలోనే జానపదుల ఆరాధనా వ్యవస్థలో అనివార్యంగా ఆచార పరిణామాలు (ritual transformations) జరుగుతున్నాయి.

ఇలాంటి ఆచార పరిణామం హైదరాబాదులోనే మరొకటి చాలా ప్రముఖంగా చెప్పవలసి ఉంది. అది జూబిలీహిల్స్ పెద్దమ్మ గుడి. ఇది పూర్తిగా సంస్కృత పురాణ దేవతగా మారిపోయింది. ఈ గుడి ప్రాంతంలో

ముప్ఫై నలభై సంవత్సరాల క్రితం హైదరాబాదు నగరానికి దూరంగా ఉన్న కొండ ప్రాంతం ఒక ఊరు. ఆకాలంలో ఈ పెద్దమ్మ దేవత పూర్తిగా గ్రామదేవత. ఇక్కడ దున్నపోతులు, గొర్రెలు, మేకలు బలి ఇచ్చిన ఘటనలు ఇటీవలి దాకా జరిగినాయి. గుడి చాలా చిన్నగా ఉండేది. ఈ గుడిని చాలా విస్తృతంగా అభివృద్ధి చేశారు. చిన్న ఆలయం స్థానంలోనే చాలా పెద్ద ఆలయం దానికి విమాన గోపురం, రాజగోపురం కట్టించాడు. చుట్టూ ప్రాంతాన్ని బాగా అభివృద్ధి చేశాడు. బ్రాహ్మణ పూజారులు వచ్చారు. అప్పటిదాకా ఉన్నవారు వెనక్కు వెళ్ళారు. గుడి ప్రాంగణం అంతా పూర్తిగా పరివర్తనం చెందింది. ప్రతిరోజు ఇక్కడికి వందలసంఖ్యలో భక్తులు వస్తుంటారు. అత్యంత సంపన్నులు కూడా వస్తారు. అష్టోత్తరాలు, సహస్రనామాలు, అన్నిరకాల వాహన సేవలు బ్రహ్మోత్సవాలు ఇక్కడ జరుగుతున్నాయి. బలులు పూర్తిగా నిషేధం అయ్యాయి. ఎవరైనా ప్రత్యేకంగా నమ్మకం ఉన్నవారు. చాలా దూరంగా పోయి అక్కడ అమ్మవారి గుడివైపుకు తిరిగి బలి ఇచ్చుకోవలసి ఉంటుంది. ఈ గ్రంథకర్త అక్కడి పూజారిని ముఖాముఖి మాట్లాడినప్పుడు ఇక్కడ వామాచార దేవతగా ఉన్న ఈమెను సౌమ్యాచారానికి మార్చాము అని చాలా బహిరంగాగానే నిశ్చింతగా చెప్పాడు. ఒక జానపద దేవత పూర్తిగా పురాణ సంస్కృత దేవత సంప్రదాయంలోనికి పోయింది. జానపదుల ఆధ్యాత్మికతలో వచ్చిన వస్తున్న తీవ్ర సామాజిక పరిణామాలు ఇవి. అయితే నగరంలో ఉన్న జానపదులలో అంటే అర్బన్ ఫోక్‌లో వచ్చిన పరిణామంగా కూడా దీన్ని పరిగణించి అధ్యయనం చేయవలసిన అవసరం ఉంది.

హైదరాబాదు నగరంలో జరిగే బోనాలపండుగ నాలుగు ఆది వారాలు జరుగుతుంది. ఆ తర్వాత, నగర శివారులలో ఉన్న అమ్మదేవతల గుడులలో బోనాలు జరుగుతాయి. నగరంలో ఉన్న బోనాలపండుగ ఎంతో ఆధునికతకు గురైంది. అయినా మౌలికంగా ఉండే జానపద ఆధ్యాత్మికత, జానపద

నమ్మకాల వ్యవస్థ అదేవిధంగా కొనసాగుతున్నది. మార్పులు ఉపరితల శ్రేణిలోనే జరుగుతున్నాయి. కానీ ఆంతరికంగా జానపద నమ్మకాల వ్యవస్థ అలాగే ఉంది. ఉదాహరణకు బోనం పెట్టడం అనేది పాతకాలంలో మట్టికుండలో తెస్తే నేడు స్టీలుబిందెలు లేదా ఇత్తడి వాటిల్లో తెస్తున్నారు. కానీ పోతురాజులు అమ్మదేవత పూజల్లో ఆంతరికమైన మార్పులు లేవు. ఈ కొత్త గుడులలో జానపదకళాకారులు అమ్మవారి కథలను ప్రదర్శించడం మాత్రం పూర్తిగా ఆగిపోయింది. కురుమ ఒగ్గు పూజారులు కురుమ వారి ఇండ్లలో మైలలు తీసే సందర్భంలో మాత్రం గంగమ్మ కథను చెప్పడం నేటికీ పరిపాటిగా ఉంది.

తెలుగు రాష్ట్రాలలో జానపదుల ఆరాధనా సంప్రదాయాలలో ప్రముఖంగా చెప్పదగిన ఆలయాలు సంప్రదాయాలు కొన్ని ఉన్నాయి. తిరుపతి గంగ జాతర, బోయకొండ గంగజాతర, కుప్పం లోని తిరుపతి గంగమ్మ జాతర, దాదాపు నెల రోజులపాటు వేరువేరు గుడులలో జరిగే చిత్తూరు జిల్లాలోని ద్రౌపది తిరునాళ్ళు. రెడ్డెమ్మ తిరునాళ్ళు, ఉత్తరాంధ్రలోని పైడితల్లి ఉత్సవం, అనకాపల్లి నూకాలమ్మ జాతర, తెలంగాణ మొత్తంలో వ్యాపించిన బతుకమ్మ పండుగ, హైదరాబాదు నగరం లోపల చుట్టుపట్ల గ్రామాలలో సాగే బోనాలు ఇవి చాలా ప్రముఖమైనవి.

తిరుపతి గంగజాతర, బోయకొండ గంగజాతరలపైన చాలా విస్తృత పరిశోధన జరిగింది. లక్షల సంఖ్యలో భక్తులు ఈ జాతరలలో పాల్గొంటారు. విస్తృతమైన ఆచారకాండ బలి ఇందులో ప్రాధాన్యాన్ని సంతరించుకుంటాయి. కుప్పం వీధుల్లో మే నెలలో జరిగే తిరుపతి గంగమ్మ జాతరలో (కుప్పంలో ఉన్న గంగమ్మని తిరుపతిగంగమ్మ అని అంటారు. కారణం ఇక్కడ గంగమ్మ విగ్రహం కేవలం మెడవరకే ఉంటుంది. తల ఉండదు. ఈ తలను తిరుపతి నుండి తీసుకొని వస్తారు. జాతరకు మూడు రోజులముందే తలను ఒక ఉత్సవంలో తెచ్చి ఇక్కడి మొండెం పైన పెడతారు. అప్పుడే ఆమెకు

ఊహించని గొప్ప శక్తి వస్తుందని జానపద నమ్మకం. ఆ తర్వాతనే ఇక్కడ గొప్ప కొలుపు జరుగుతుంది. వందల సంఖ్యలో జీవాలను బలి ఇస్తారు. రక్తం వీధుల్లో అక్షరాల వాగులా పారుతుంది. ఇలా చేస్తే గంగమ్మతల్లి తమను చాలా చల్లగా చూస్తుందని అడిగిన కోరికలను తీరుస్తుందని వారి నమ్మకం. బోయకొండ, తిరుపతి పట్టణాలలో కూడా ఇదేవిధంగా జరుగుతుంది. తిరుపతి గంగజాతరలో కళాకారులు వేర్వేరు తీరులలో వేషాలు వేయడం ఇక్కడి ప్రత్యేకత.

ఉత్తరాంధ్రలో పైడితల్లి ఉత్సవం చాలా ప్రముఖమైనది. ఈమె ఒక పేరంటాలు దేవత, ఈమె విజయనగరం రాజవంశానికి చెందిన ఆడపడుచు. బొబ్బిలియుద్ధం ముగిసిన పరిణామంలో పాపారాయుడు విజయరామ గజపతిని అతని యుద్ధ శిబిరంలోనే చంపేస్తాడు. ఈ విషయాన్ని పైడిమాంబ కలలో అమ్మవారు కనిపించి హెచ్చరిస్తుంది. దీన్ని అన్నకు చెప్పాలని పతివాడ అప్పలనాయుడు మరికొందరు అనుచరులతో కలిసి ప్రయాణం అవుతుంది. మార్గమధ్యంలోనే అపస్మారక స్థితిలోనికి వెళ్ళి తనువు చాలిస్తుంది. అంతకుముందు కొన్ని రోజులుగా ఆమె ఉపవాసదీక్షలో ఉంది. ఇలా జరిగిన తర్వాత తాను చెరువు మధ్యలో విగ్రహంగా వెలుస్తున్నానని దాన్ని ప్రతిష్ఠించి నిత్యం పూజించాలని ఆదేశించింది. ఇది 1757లో జరిగింది. అదే బొబ్బిలియుద్ధం జరిగిన సంవత్సరం. ఆ తర్వాతి ఏడాది 1758 నుండి ఈ పైడితల్లి ఉత్సవాలు జరుగుతున్నాయి నేటిదాకా. నాటినుండి నేటివరకు అక్కడ పెద్దఎత్తున పైడితల్లి ఉత్సవాలు జరుగుతున్నాయి. ఇందులో ప్రత్యేకమైన జానపద సంప్రదాయం సిరిమాను ఉత్సవం (దీన్నే స్థానికంగా సిరిమానోత్సవం అని అంటుంటారు. సంధినియమం ప్రకారం మాను తెలుగుపదం ఉత్సవం సంస్కృతం సంధి కాదు. కానీ సంధి జరిగినా సిరిమానూత్సవం అని ఉండాలి. కానీ జనవ్యవహారంలో సిరిమానోత్సవంగా వ్యాపించింది) దీన్నే సిరిమానోత్సవం అని అంటారు. ఈ సిరిమాను

ఉత్సవం అంటే వ్యక్తి తన వీపుకు కొక్కాన్ని గుచ్చి తగిలించుకొని దాదాపు 20 అడుగుల ఎత్తులో ఉన్న పోలుగ(ర కొసకు వేలాడతాడు. ఈ బండి పోలుగ(రను ఎడ్లతో లాగడం లేదా భక్తులే లాగుతూ పోవడం ఉంటుంది. దీన్నే గాలపుసిడి అని అంటారు. ఆ తర్వాతి కాలంలో మనిషి బదులు మేకను సిడిమానుకు కట్టి ఊరేగించడం ఉంది. ఇంకోవిధంగా ఈ సిడిమానుకు గంపను కట్టి భక్తులు మొక్కుకున్న వారు ఈ గంపలో కూర్చుంటారు. దీన్ని గంపసిడి అని అంటారు. పైడితల్లి ఉత్సవంలో ఈ సిడిమానోత్సవం రోజు అన్నిటికన్నా చాలా ముఖ్యమైనది. ఆ గంపసిడిలో ఉన్న వ్యక్తి పూజించిన నిమ్మకాయలు కిందికి విసురుతాడు. అది దొరికిన వారిది అదృష్టం అని వారి మొక్కులు తీరతాయని జానపదుల నమ్మకం. ఈ ఉత్సవానికి కేవలం విజయనగరం జిల్లా మాత్రమే కాకుండా ఎన్నో జిల్లాల నుండి వేలాదిగా జనం తరలివస్తారు. ఇటీవలి సంవత్సరాలలో లక్షకు మించిన భక్తులు వస్తారు.

తెలంగాణలో ఉన్న సమ్మక్క సారలమ్మ జాతర అంతటి ప్రాధాన్యాన్ని సంతరించుకున్నది. ఇది ఆదివాసీ సంప్రదాయానికి చెందిన ఉత్సవం సమ్మక్క సారలమ్మలు కాకతీయ రాజుల దాష్టీకానికి వ్యతిరేకంగా పోరాడి తమకు సహజసిద్ధంగా ఉన్న అటవీరాజ్యాన్ని కాపాడుకున్నారని తమ హక్కులకోసం పోరాడి ప్రాణత్యాగం చేసారని ఇతిహాసం జానపద గిరిజన సంప్రదాయాలలో వ్యాప్తి చెంది ఉన్నది. ఇది తెలుగు రాష్ట్రాలలోనే కాదు మన దేశంలోనే కాదు మొత్తం ఆసియా ఖండంలోనే అత్యంత అధిక సంఖ్యలో భక్తులు వచ్చే ఆదివాసీ జాతర అని ప్రసిద్ధికెక్కింది. ఇది ఆదివాసీ సంప్రదాయానికి చెందినదే అయినా జానపదసంప్రదాయంలో కూడా బాగా వ్యాప్తి పొందినది. అత్యధిక సంఖ్యలో జానపద నమ్మకాలకు చెందినవారు కూడా ఇందులో పాల్గొని మొక్కులు చెల్లించుకుంటారు. ఈ జాతర రెండు సంవత్సరాలకు ఒకసారి జరుగుతుంది.

పైన పైడితల్లి కాని ఇక్కడ సమ్మక్క సారలమ్మలను పేరంటాలు దేవతలు అనే వ్యవహరించవచ్చు.

ఇక తెలుగు రాష్ట్రాలలో జానపదసంప్రదాయంలో బాగా వ్యాప్తిలో ఉన్న జాతరలు లేదా తిరునాళ్ళు కొన్ని ఉన్నాయి. పెనుగంచి ప్రోలు తిరుపతమ్మ, తోటమూల సరోజినమ్మ, లింగాలపాడు శ్రీలక్ష్మమ్మ, తేలప్రోలు రంగమ్మ, ఉయ్యూరు వీరమ్మల తిరునాళ్ళు, కామమ్మ తిరునాళ్ళ, సన్యాసమ్మ తిరునాళ్ళ, మండపేట పాపమ్మ, పాలేటమ్మ ఇవన్నీ చాలా ప్రఖ్యాతి గాంచిన అమ్మదేవతా ఆరాధనా సంప్రదాయాలు. జానపద ఆధ్యాత్మికతలో ఆరాధనా సంప్రదాయాలలో అమ్మదేవతలు ప్రధానంగా ఉంటారు. ఇవి అత్యంత ప్రాచీనకాలం నుండి ప్రాఁనవ కాలంనుండి వస్తున్నాయి. అందుకే ఈ నమ్మకాల వ్యవస్థ చాలా బలీయమైనది.

## నాగదేవతారాధన

తెలుగువారి జానపద ఆధ్యాత్మికతలో నాగదేవతారాధనకు చాలా ప్రాముఖ్యం ఉన్నది. తెలుగువారు నాగజాతి అనే పరిశోధకుల వాదన ఒకటి ఉన్నది. నాగదేవత అనేది తెలుగువారికి ఒక టోటెమిక్ సింబల్ అని కూడా పరిశోధకులు ప్రతిపాదించారు. భారత దేశంలోనే నాగజాతి చాలా విస్తృతంగా వ్యాపించి ఉండేదని ప్రస్తుతం ఉన్న నాగాల్యాండ్ కూడా దానికి ఒక తార్కాణ అని పరిశోధకులు చెప్పారు. తెలుగు రాష్ట్రాలలో దక్షిణభారత దేశంలో నాగారాధన ఆనవాళ్ళు చాలా విస్తృతంగా చారిత్రక ఆధారాలు ఆర్కియలాజికల్ అంటే చరిత్రపూర్వయుగపు ఆనవాళ్ళు కూడా లభించాయి. తెలుగు రాష్ట్రాలలో రెండు వేల సంవత్సరాల కన్నా వెనుకటి చారిత్రక ఆధారాలలో శిల్పాలలో నాగదేవతల ప్రతిమలు దొరికాయి. ఆనాటికే తెలుగు రాష్ట్రాలలో నాగారాధన సంప్రదాయం ఉన్నట్లు స్పష్టంగా తెలుస్తున్నది. అంతేకాదు అది వేల సంవత్సరాలుగా తెలుగు నేలపైన కొనసాగి వస్తున్నది అని కూడా మనకు స్పష్టంగా తెలియవచ్చే విషయం.

నేటికీ తెలుగు రాష్ట్రాలలో నాగదేవత ప్రతిమలను విగ్రహాలను ప్రతిష్ఠించడం కనిపిస్తుంది. కొత్తగా విగ్రహాలు చేయించి స్థాపించడం చాలా వ్యాప్తంగా తెలుగుపల్లెలలో ఉన్నది. చిత్తూరు జిల్లాలో ఇతర రాయలసీమ ప్రాంతంలో ప్రతి గ్రామంలో ఒక నాగదేవత కనిపిస్తుంది. ఒక వేపచెట్టు రావిచెట్టు కలిపి నాటి అవి కొంత పెరిగిన తర్వాత వాటికి పెళ్ళి చేస్తారు. వాటికి ఒక అరుగు కడతారు. ఈ అరుగు మీద నాగదేవత విగ్రహం ఉంటుంది. ఈ విగ్రహం ఒక అడుగు నుండి అడుగున్నర వెడల్పు ఉంటుంది. రెండు అడుగుల నుండి నాలుగు అడుగుల ఎత్తు ఉంటుంది. దీనిపైన రెండు నాగుపాములు తాడులాగా కలమెలిసి ఉన్నట్లు విగ్రహం చెక్కి ఉంటుంది. ఈ విగ్రహాన్ని అరుగుమీద ప్రతిష్ఠిస్తారు. ఈ ప్రతిష్ఠ గ్రామంలో జరిగే అతిపెద్ద జానపద ఉత్సవంగా ఉంటుంది. ఆనాటినుండి అక్కడ నాగదేవత ఆరాధన ప్రతిరోజు ఉంటుంది. ఇక నాగులచవితికి ప్రత్యేక ఉత్సవాలు ఉంటాయి.

పల్లెటూర్లలో నేటికీ ఆడమగ కూడా నాగదేవతను పూజిస్తారు. అయినా నాగులచవితి అనే పండుగ కేవలం ఆడువారికి మాత్రమే చాలా ప్రత్యేకమైన పండుగ. దీపావళి అమావాస్య నాడు వస్తుంది. ఆ తర్వాత వచ్చే కార్తిక శుద్ధచవితినే నాగులచవితి అని అంటారు. ఈరోజున ఆడువారు ముత్తైదువలు, కన్యలు శుచిగా స్నానం చేసి కొత్తబట్టలు ధరించి వారికి దగ్గరలో ఉన్న పుట్టల వద్దకు పోతారు. అక్కడ పుట్టచుట్టూ ప్రదక్షిణ చేసి దానిపైన పసుపు కుంకుమలు చల్లి పూలదండలు వేసి పూజిస్తారు. కొంతమంది మొక్కుకుంటారు కూడా. ఆ తర్వాతవారు తెచ్చిన పాలు పుట్టలో పోస్తారు. అంతేకాదు కోడిగుడ్లు కూడా పుట్టలో సమర్పిస్తారు. పల్లెలలో వ్యవసాయ జీవితంలో ఆడ మగ తేడా లేకుండా పొలాలలో పనిచేస్తారు. అంతేకాదు కావలికి పోయినప్పుడు పంట కాలాలలో పంటచేతికి వచ్చేదశలో రాత్రిపూట కూడా మగవారు పొలాలకు వెళ్తుంటారు. తర్వాత కల్లాలు జరిగినప్పుడు

రాత్రిపూట కూడా కాపలాకి పోతుంటారు. స్వామీ నాగమయ్యా మా భర్త కాని కొడుకులు కానీ అర్థరాత్రి అపరాత్రి అనకుండా తిరుగుతుంటారు. తెలియక నీ తోక తొక్కవచ్చు లేదా నీ దారికి అడ్డం నడవవచ్చు. అప్పుడు కోపించబాకు వారిని కాటెయ్యబాకు అని ఆడువారు నాగదేవతను కోరి పూజిస్తారు.

ఇలా చేయకపోతే నాగ దేవతను పూజించకపోతే వారికి అరిష్టం జరగవచ్చునని నాగదేవతకు ఆగ్రహం రావచ్చునని కూడా జానపదులలో చాలా గట్టి నమ్మకం ఉంది. అందుకే నాగదేవతను పూజిస్తారు.

నాగదోషం అనేది ఉంటుందని కూడా జానపదులు భావిస్తారు. అంటే తెలిసీ తెలియక నాగదేవతకు అపచారం చేస్తే ఆమె కోపిస్తుందని లేదా నాగదేవుడు (పురుషుడు కూడా కావచ్చు) శపిస్తాడని భావిస్తారు. ఇలా శపించినప్పుడు వారికి కలిసి రాదని ఏ పని చేసినా కూడా సరైన ఫలితాలు రావని కూడా భావిస్తారు. ఒక్కోసారి కొంత మంది మహిళకు సంతానం కలుగదు. అలాంటి వారు జ్యోతిష పండితులను కలిసినప్పుడు కొన్ని సందర్భాలలో వారు తమవద్దకు వచ్చిన వారిని పరిశీలించి నీకు నాగదోషం ఉంది. అందుకే పిల్లలు పుట్టలేదు. నాగదోషం పోవడానికి శాంతిపూజలు చేయించాలని కూడా చెప్పడం ఉంది. అలాంటి దోషం పోవడానికి పుట్టల దగ్గర కాని లేదా కొన్ని ప్రత్యేక క్షేత్రాలకు పోయి కానీ నాగదోషం పోవడానికి కుటుంబాలు కుటుంబాలు శాంతి పూజలు చేయించడం నేటికి చాలా విస్తృతంగా కనిపిస్తున్నది.

ఇలా పూజలు చేసే క్షేత్రాలలో అవనిగడ్డలో ఉన్న మోపిదేవి క్షేత్రం ప్రసిద్ధమైనది. ఇక్కడ ప్రతిరోజు నాగపూజ చేయించడానికి పదులు వందలమంది వస్తుంటారు. ఇక నాగుల చవితి ఇక్కడ ఇంకా ప్రసిద్ధమైన పండుగరోజు పూజల రోజు. ఇక నాగదోష పరిహరణ కోసం దోషనివారణ పూజ చేసే మరో పెద్ద క్షేత్రం శ్రీకాళహస్తి దేవాలయం. నాగులు శివుని

అలంకారాలు. వాటిపైన ఆయనకున్నంత అధికారం మరెవరికి ఉంటుంది. ఈ భావనతో ఇక్కడ నాగదోష పరిహార పూజలు చేయిస్తుంటారు. తెలుగువారి జానపద విజ్ఞానంలో చాలా ముఖ్యమైనది. వేర్వేరు గ్రామాలలో ఉన్న నాగమయ్య విగ్రహాల వద్ద కూడా ఈ దోష పరిహార పూజలు చేయిస్తుంటారు.

ఈ నాగదోష పూజలకు, ఇంకా వేర్వేరు రకాల దోషపరిహార పూజలు చేయించడానికి దేశవ్యాప్తంగా జాతీయ స్థాయిలో పేరు పొందిన క్షేత్రం ఒకటి కర్ణాటకలో ఉంది. అది కుక్కే సుబ్రహ్మణ్యస్వామి దేవాలయం. ఇక్కడికి దేశవ్యాప్తంగానే అంతర్జాతీయంగా ప్రముఖులైన వారు కూడా వచ్చి దోషపరిహార పూజలు చేయించడం ఉంటుంది. కుక్కే సుబ్రహ్మణ్య స్వామి నాగదేవతకు మరో రూపం అని నమ్ముతారు. ఇక్కడికి సుప్రసిద్ధ క్రికెటర్ సచిన్ తెందూల్కర్, వేర్వేరు బాలివుడ్ తారలు వచ్చి దోషపరిహార పూజలు చేయించిన ఘట్టాలు వార్తలలో వచ్చాయి.

ఊళ్ళలో ఏదైనా తప్పనిసరి సందర్భంలో రైతులు కానీ పొలాలలో పనిచేసే వారు కానీ ఇళ్ళలో ఉన్న సందర్భంలో కానీ పాములు ఎదురైనప్పుడు అవి దాడిచేసి కాటు వేస్తాయి అని భావించినప్పుడు వాటిని కర్రతో కొట్టి చంపవలసి వస్తుంది. అంతేకాదు తలపైన కర్రతో పొడిచి ముందుగా తలను ధ్వంసం చేస్తారు. ఇలా చేయడం పాపంగా కూడా భావిస్తారు. చంపిన పాము మామూలు రక్తపింజర కానీ పసరిక కానీ జెర్రిపోతు కాని అయితే వాటిని పట్టించుకోరు. చంపిన పాము త్రాచు పాము దీన్నే నాగుపాము అని అంటారు ఈ పాము అయితే మాత్రం చంపడం దోషం అని భావించి దానికి చితిపెట్టి కాల్చి అంత్యక్రియలు చేస్తారు. ఇలా తప్పనిసరిగా చేయాలనే నియమం ఆచారకాండ నేటికీ తెలుగు పల్లెలలో గట్టి నమ్మకంగా ఉన్నది. చిన్న పిల్లలు పుట్టిన తర్వాత కొద్ది రోజులకు పిల్లలకు చెవునుండి చీము రావడం ఉంటుంది. దీనికి వేరువేరు వైద్యపరమైన కారణాలు ఉండవచ్చు.

కాని జానపదుల నమ్మకం ఆధ్యాత్మికత వేరుగా ఉంటుంది. నాగదోషంవల్ల ఇలా పిల్లలకు వస్తుంటుందని దోషపరిహారంగా నాగదేవతకు పూజ చేయిస్తే అది పోతుందని నమ్ముతారు. అలా చేయిస్తారు.

తెలుగువారికి ప్రియమైన పేర్లలో, నాగలక్ష్మి, నాగమణి, నాగమ్మ, నాగశ్రీ, నాగేంద్ర, నాగేంద్రమ్మ ఫణీల వంటి పేర్లు బాగా వ్యాపించి ఉన్నాయి. ఇక మగవారిలో నాగేశ్వరరావు, నాగయ్య, నాగిరెడ్డి, నాగేశ్వరశాస్త్రి, నాగభూషణం, నాగవంశి, నాగచైతన్య, నగ అక్షరాలు వచ్చేలాగా నగరాజకుమారి, నగజ, ఫణికుమార్, ఫణీంద్ర, ఫణికాంత్ ఇలాంటి పేర్లు కూడా తెలుగువారికి చాలా ఉన్నాయి.

సంతానం ఆలస్యమైన వారు పూజలు చేయించి మొక్కుకొని ఆ మొక్కులో భాగంగా పైన చెప్పిన వంటి పేర్లు పెట్టుకుంటారు. ఇక సుబ్బారెడ్డి, సుబ్బారావు సుబ్బరాయశాస్త్రి సుబ్బయాచారి వంటి సుబ్రహ్మణ్యస్వామి పేరుతో వచ్చే పేర్లు ఉన్నవారు పామును కొట్ట కూడదని ఒక నియమం ఉన్నది.

వంశపారంపర్యంగా నాగ దేవత పేరు పుట్టిన సంతానంలో ఒకరికి తప్పనిసరిగా పెట్టాలనే నియమం ఉన్న కుటుంబాలు నేటికీ చాలా ఉన్నాయి.

నాగ దేవతకు రెండు శిరస్సులు మూడు శిరస్సులు ఐదుపడిగెలు ఇలా చాలా ఎక్కువగా కూడా ఉంటాయని అవి దేవుళ్ళ వద్ద ఉంటాయని జానపదుల నమ్మకాలలో చాలా గట్టి నమ్మకం ఉంది. ఇక శివాలయం లోనికి ఏదైనా నాగుపాము ప్రవేశిస్తే అది తప్పనిసరిగా దేవత అయి ఉంటుందని ప్రజలు విశ్వసిస్తారు. దానికి పూజచేస్తారు. దాన్ని కొట్టడం కాని పారదోలడం కాని చేయరు. ధైర్యం ఉన్న పూజారులు ఆ పాము అక్కడ ఉండగానే పూజాదికాలు నిర్వహించడం కూడా ఉన్నది.

ఇక పాములు పగబడతాయని నమ్మడం జానపద నమ్మకాలలో చాలా బలమైన నమ్మకం. పొరపాటున తోక తొక్కిపోయినా ఒక దెబ్బ కొట్టి పాము తప్పించుకొనిపోయినా అలాంటి పాములు పగబడతాయని వెంటపడి ఆ మనిషి ఎక్కడ ఉన్నాడో తెలుసుకొని వెంటాడి కాటువేస్తాయని ప్రజలు నమ్ముతారు. అందుకే పామును కొట్టవలసివస్తే అది చనిపోయినదాకా వెదికి పట్టుకొని మరీ చంపుతారు. ఇక దానికి సంబధించిన పాము కూడా పగపడుతుందని భావిస్తారు. ఈ పాము పగబట్టే కథలు చాలా జానపద సాహిత్యంలో కనిపిస్తాయి. వాటి ఆధారంగా ఎన్నో సినిమాలు హిందీలో చాలా వచ్చాయి. దాదాపు ఒక పది సంవత్సరాలు బాలివుడ్ సినిమా పాములచుట్టూ తిరిగాయి. తెలుగులో కూడా ఇలాంటి కథలతో సినిమాలు వచ్చాయి. నాగదేవతను పూజించే ఒక భక్తురాలు ఇక పాము కనిపిస్తే చంపాలి అది విషకీటకం దానికి పూజ చేయడం ఏమిటి అని వాదించే ఒక భర్త వీరిద్దరి మధ్య సంఘర్షణ ఈ కథావస్తువుతో తెలుగులో నోము అనే సినిమా వచ్చింది. ఇక పాత జానపద సినిమాలలో పాములు ప్రధానపాత్రగా చాలా సినిమాలు వచ్చాయి. జానపద కథాసాహిత్యంలో పాముకు నాగదేవతకు చాలా ప్రాముఖ్యం ఉన్న కథలు చాలా విస్తృతంగా ఉన్నాయి. వాటిలో బాలనాగమ్మ కథ ఒకటి. భూలక్ష్మీదేవికి వర్గిరాజులకు ఎంతకూ సంతానం కలగదు. కార్యవర్ధిరాజు ప్రేరణపైన భూలక్ష్మీదేవి నాగదేవతకు పూజ చేస్తుంది. ఆయన కరుణించి పన్నెండు శిరస్సుల నాగేంద్రుడు ప్రత్యక్షమయ్యాడు. ఆమె సంతానం కోరగా ఆ పుట్టమీద ఉన్న మామిడి చెట్టునుండి ఏడు పళ్లుకోసి తినమని ఏడుగురు సంతానం కలుగుతారని చెప్పాడు. ఆమె భూలక్ష్మి చెట్టు ఎక్కి ఆశగా ఒడినిండా పళ్లుకోసి కిందికి దిగింది. దిగిచూస్తే ఒడిలో ఏడు పళ్ళే మిగిలి ఉన్నాయి. మళ్లీ ఎక్కింది అలాగే ఒడినిండా కోసి చూస్తే ఏడు పళ్ళే మిగిలి ఉన్నాయి. అలా మూడోసారి చేసినప్పుడు నాగేంద్రుడికి కోపం వచ్చి ఆమెను శపిస్తాడు.

నీకు ఏడుగురు పిల్లలు పుట్టిన తర్వాత వచ్చి కాటువేసి నీ ప్రాణాలు తీస్తాను అని చెప్తాడు. అయితే రాజు పాముకాటుకు గురి కాకూడదు అని ఆమెకు ఒంటిస్తంభం మేడ కట్టికింద చుట్టూ మంటపెట్టి ఏ పాము కూడా పైకి ఎక్కకుండా చేశాడు. కాని నాగేంద్రుడు అక్కడికి అక్కడే ప్రత్యక్షమై ఆమెను కాటేస్తాడు. చనిపోయే ముందు భర్తను పిలిచి మళ్ళీ పెళ్ళి చేసుకోవద్దని బిడలను బాగా చూచుకోమని చెబుతుంది. ఇందులో చివరి బిడ్డ అంటే ఏడో సంతానమే బాలనాగమ్మ. ఈ బాలనాగమ్మ కథ తెలుగులో చాలా ప్రసిద్ధమైనది. రెండుసార్లు ఈ కథని సినిమాగా తీశారు. ఈ కథపైన పరిశోధనలు కూడా జరిగాయి. జానపదులలో పాములకు సంబంధించి ఇంకా విస్తృతమైన జానపద కథాసాహిత్యం దొరుకుతుంది. పాటలుగా పాడేవారు, కథలుగా చెప్పేవారు నేటికీ లక్షిస్తారు. అలా జానపదుల ఆధ్యాత్మిక చింతనలో నాగారాధన అలా చాలా ప్రాముఖ్యాన్ని సంతరించుకున్నది.

### శనిదేవతారాధన

జానపదులు భక్తికన్నా ఎక్కువగా భయంతో పూజించే దేవుడు శనిదేవుడు. పూజించడం అని చెప్పడంకన్నా సంతోషపరచడం అని లేదా శాంతపరచడం అని కూడా చెప్పవచ్చు. శని పదం అంటేనే దురదృష్టం అని చెడు అనే అర్థాలు తెలుగులో స్థిరపడిపోయాయి. అందుకే శనిదేవుడికి గుడులు ఎక్కువగా ఉండవు. ఎక్కడో ఒకటి. ఆయన వాహనం కూడా అపశకునానికి గుర్తు కాకి.

'వాడికి శనిపట్టింది లేకుంటే అలా ఎందుకు ప్రవర్తిస్తాడు. శనిపడితే ఏడు సంవత్సరాలుంటుంది.' ఈ వాక్యాలు తెలుగులో అలవోకగా నాలుకపైన నిలిచే పలుకుబడి వాక్యాలు. శని పడితే దేవతలు కూడా తప్పించుకోలేరు అనే కథ కూడా జానపద సాహిత్యంలో వ్యాప్తిలో ఉంది. ఒకసారి శనిదేవుడికి శివుడికి పోటీ జరిగిందట. నేను పట్టుకుంటే ఎంతవారైనా బాధపడవలసిందే శనిపీడను అనుభవించవలసిందే అని అన్నాడట శనిదేవుడు. శివుడు అందుకు

నవ్వి 'నీవు నన్ను ఏమీ చేయలేవు నేను ఆది దేవుడిని' అని చెప్పాడట శివుడు. అందుకు శని నవ్వి అలాగేం కాదు. సరే ఫలానా తిథి నాడు ఫలానా ఘడియలకు నిన్ను ఆవహిస్తాను. శని పడితే ఎలా ఉంటుందో మీకు తెలుస్తుంది శివా చూడు మరి అని అన్నాడట. శివుడు ఈ ఛాలెంజిని స్వీకరించి సరే చూద్దాం శని నన్ను ఎలా పడుతుందో అని బింకంగా చెప్పాడు. సరే అని కొద్దిరోజులు పోయిన తర్వాత శివునికి అనుమానం వచ్చింది. నేను ఇక్కడ కైలాసంలో ఉంటే వచ్చి సులభంగా నన్ను ఆవహించే ప్రమాదం ఉంది కనుక తెలియకుండా దాక్కుంటానని చెప్పి ఏది సరైన ప్రదేశం అని వెదికి చివరికి అన్నిటికన్నా ప్రమాదరహితమైనది పాతాళలోకం అని నిర్ణయించుకొని పాతాళానికి పోయి అక్కడ కూడా ఒక మారు మూల గుహలో దాక్కున్నాడట. శని చెప్పిన తిథి ఆ ఘడియలు దాటిన తర్వాత రెండు రోజులకి తిరిగి కైలాసం వచ్చాడట శివుడు. అప్పుడు శనిని పిలిచి చూచావా? నీవు నన్ను ఏమీ చేయలేకపోయావు. నన్ను ఆవహిస్తానని ఆవహించలేకపోయావు నీ ఓటమిని అంగీకరించు శనిదేవుడా అని అన్నాడట. అప్పుడు శనిదేవుడు నవ్వి పరమశివా ఆది దేవా నా నుండి నీవు తప్పించుకోలేదు. నేను ఆవహించబట్టే అంటే శని పట్టబట్టే కైలాసంలో భార్యా కొడుకులతో నవ్వుతూ ఉండవలసినవాడివి ఎక్కడెక్కడా వెదికి ఏ ప్రదేశం బాగుంటుందో నిశ్చయించుకొని పాతాళానికి పోయి అక్కడ ఒక గుహలో దాక్కున్నావు. ఇదే నా ప్రభావం. శని పడితేనే ఈ పరిస్థితి నీకు వచ్చింది. అని చెప్పాడట శనిదేవుడు. దీనితో ఆదిదేవుడు శివుడు విషయాన్ని గ్రహించి శనిదేవుడి శక్తిని విశ్వసించి అతనికి నమస్కారం చేసి పూజించాడట.

శ్రీశ్రీ మహాప్రస్థానంలో చాలా పురాణ ప్రతీకలు వాడుకున్నాడని విదితమే. జగన్నాథ రథచక్రాలు అనే గేయంలో శనిదేవతరథ చక్రపుటిరుసులలో పడినలిగిన దీనులార! హీనులారా! అని రచించాడు. శనిదేవత అనడం అతనికి ఒక రథం ఉంటుంది అందులో అతను

ప్రయాణిస్తాడు అని రాయడం గమనించాలి. కాని శనిదేవుడు రథంలో ప్రయాణించడు ఆయనకు ఉన్న వాహనం కాకి. కానీ శనిదేవుని ఉత్సవాలలో రథంలో ఊరేగించడం పరిపాటి. ఈ రథాన్ని శ్రీశ్రీ భావించి ఉండవచ్చు.

ఈ కథ జానపద సాహిత్యంలో బాగా వ్యాప్తిలో ఉంది. జానపదుల ఆధ్యాత్మికతలో ఈ కథ ప్రభావం చాలా ఉంటుంది. అందుకే శని దేవుడు అంటే జానపదులు మాత్రమే కాదు నాగరికులు బాగా చదువుకున్నవారు కూడా భయపడతారు. ఏడాదికి ఒకసారైనా మూడేండ్లకు ఒకసారైనా శనికి పూజ చేస్తారు. లేదా శనిగ్రహం కూడా ఉన్న నవగ్రహాలకు పూజ చేస్తారు. సంతానం కలగనివారు కూడా శనిగ్రహం కలిసి ఉన్న నవగ్రహాలకు పూజ చేస్తారు. ఇటీవలి కాలంలో నవగ్రహ విగ్రహాలను ప్రతి గుడిలో కూడా ప్రతిష్ఠించిడం పరిపాటిగా మారింది. చాలా శివాలయాలలోనే కాదు వైష్ణవాలయాలలో కూడా నవగ్రహ విగ్రహాలను అడుగు కాని రెండు అడుగులు కాని ఎత్తైనవాటిని ఒక మూడు ఆడుగులు ఎత్తున్న గద్దెమీద ప్రతిష్ఠిస్తున్నారు. వచ్చిన భక్తులు వీటికి ప్రదక్షిణం చేసి పూజిస్తున్నారు.

శని విభావనామ సంవత్సరము మాఘమాసము కృష్ణపక్షము, చతుర్దశి నాడు, ధనిష్ఠానక్షత్రమున జన్మించాడని కొందరంటే... మార్గశిర మాసము – బహుళ నవమి, రోహిణీ నక్షత్రాన శివుని ఆశీస్సులతో జన్మించాడని కొందరు అంటారు. శనీశ్వరుడు కుడిచేతిలో దండము, ఎడమచేతిలో కమండలము, sword (ఖడ్గము) arrows and two daggers ధరించి ఉంటాడు. లక్ష్మీదేవి సోదరి అయిన జ్యేష్ఠాదేవి (ఈమెనే దరిద్రదేవత అంటారు) శనైశ్చరుడి భార్య. అంటే శనిభగవానుడు విష్ణుమూర్తికి తోడల్లుడు అన్నమాట. యమధర్మరాజుకి సోదరుడు, గ్రహాలకు యువరాజు.

హరిశ్చంద్రుడు, నలుడు, పురుకుత్సుడు, పురూరవుడు, సగరుడు, కార్తవీర్యార్జునుడు, శని మహిమవల్ల అనేక కష్టాలు పొంది చివరకి శనికృప

వల్లే సర్వసుఖాలు పొందినట్లు పురాకథలు ఉన్నాయి. శని ఎంత బాధపెట్టినా కూడా శనిని తిట్టకూడదు అనే నమ్మకం ఒకటి చాలా బలంగా ఉంది. శనిదూషణ సర్వదేవతలనూ తిట్టిన దాంతో సమానం అని పెద్దలు చెబుతారు. ఆయనను పూజిస్తే దేవతలందరినీ పూజించినంత ఫలితం లభిస్తుందంటారు. త్రేతాయుగంలో లంకలో రావణాసురుని చెరలో ఉన్న శనైశ్చరుని ఆంజనేయుడు విడిపించాడని ఒక కథనం. అందుకే హనుమత్‌దీక్షలో ఉన్నవారినీ అలాగే మందుడికి ఇష్టమైన నల్లటి వస్త్రాలు ధరించే అయ్యప్ప దీక్షాపరులనూ ఆయన బాధించడని బలమైన జానపద నమ్మకం ఉంది. శనివారం అనే మాటని కూడా పలకడానికి ఇష్టం లేనివారు శనివారం నాడు ఏదైనా శుభకార్యాలు చేయవలసి వస్తే దాన్ని మందవారం అని అంటారు.

తెలుగు రాష్ట్రాలలో అతితక్కువ గుడులు ఉన్నదేవుడు ఈ శనిదేవుడు అని కచ్చితంగా చెప్పవచ్చు. నేటి ఆంధ్రప్రదేశ్, తూర్పుగోదావరి జిల్లాలో మందపల్లి అనే గ్రామంలో శనిదేవుని గుడి ఉంది. ఇక్కడికే అసంఖ్యాకంగా ప్రజలు వచ్చి భక్తి ప్రపత్తులు ప్రకటిస్తారు. శ్రీకాళహస్తి శివాలయంలో ఒక ఉపాలయంగా శనిదేవునికి గుడి ఉంది. తెలంగాణ రాష్ట్రంలో మెదక్ జిల్లాలో నేటి సంగారెడ్డి జిల్లాలో ఒక కుగ్రామం ఎర్లనూరులో ఉంది. ఇది కూడా ఇటీవలి నిర్మాణమే. సుమారు ఒక పదిహేను సంవత్సరాలు అయి ఉంటుంది. ఈ గుడుల దర్శనంతో కూడా తృప్తి చెందనివారు శని ప్రభావం చాలా ఎక్కువగా ఉంది అని భావించినవారు మహారాష్ట్రలోని ప్రసిద్ధ శని దేవాలయం శనిసింగనాపూర్‌లో ఉంది. అక్కడికి వెళ్ళి శని పూజలు చేస్తారు.

ఇక్కడ కొన్ని మాహాత్మ్యాలు ఉన్నాయి కొన్ని నమ్మకాలు ఉన్నాయి. ఇక్కడ గ్రామం మొత్తంలో ఈ దేవుని ప్రభావం ఉంటుంది. ఈ గ్రామం లేదా చిన్న పట్టణంలో దేవుని గుడిచుట్టూ చాలా విస్తృతమైన వ్యాపార కార్యకలాపాలు ఏర్పడ్డాయి. ఈ గ్రామంలో ఏఏ ఇంటికి కూడా తలుపులు

ఉండవు. ఇండ్లు అన్నీ తెరచి ఉంటాయి. ఇక్కడ ఏ పరిస్థితిలోను దొంగతనం జరగదని పూర్తి విశ్వాసం. ఈ పరిస్థితి నేటికీ అదేవిధంగా ఉంది. ఈ గుడిలోనికి మహిళలకు ప్రవేశం లేదు. వారు బయటనే ఉంది భర్తలను లేదా కొడుకులను గుడిలోనికి పంపించి పూజలు చేయిస్తారు. ప్రధానంగా ఈ దేవునికి నచ్చే పూజించే పద్ధతి నువ్వుల నూనెపోసి పూజించడం.

చైత్రమాసం కృష్ణపక్షంలోని త్రయోదశిని శనిత్రయోదశి అని అంటారు. ఈ రోజున జానపదులలో ఎక్కుమంది నాగరికులు కూడా శని పూజా చేస్తారు. శివాలయానికి పోయి అక్కడ శని పేరుతో పూజలు చేయడం ఉంటుంది. శనిదేవుడు ఆగ్రహిస్తే ఎంత నష్టం చేస్తాడో అనుగ్రహిస్తే అంతటి వరాలు కూడా కురిపిస్తాడని కూడా జనంలో నమ్మకం ఉంది. శనిత్రయోదశినాడు పూజలు చేయడానికి జానపదులలో కొన్ని ఆచారాలు నమ్మకాలున్నాయి.

- ఆరోజు తలంటి స్నానంచేసి శుచిగా తయారౌతారు.
- ఉపవాసం ఉంటారు. ఆహారనియమాలు పాటిస్తారు. మద్య మాంసాలు ముట్టరు.
- అన్నదానం చేస్తారు. శివపూజ కూడా చేసేవారు చేయవచ్చు. చేస్తారు.
- శని విగ్రహానికి నువ్వుల నూనెతో అభిషేకం చేస్తారు.
- ప్రతిశనివారం రావిచెట్టుకు పూజ చేసి నల్లమిరియాలు నువ్వుల నూనె చెట్టుకు పోస్తారు. రావిచెట్టుకు 'అనుకట్టడం' కూడా చేస్తారు.

దేవతలపట్ల ఏ దేవతపట్ల నిష్ఠ ఎలా ఉన్నా కూడా శనిదేవుని పట్ల నిష్ఠలో జానపదులు చాలా స్థిరంగా ఉంటారు. జానపదుల ఆధ్యాత్మికతలో శని దేవతారాధన కూడా విస్తృతంగా ఉంది. చాలా గట్టి నమ్మకంతో ఉంది.

## వీరదేవతారాధన సంప్రదాయం

అమ్మదేవతలతోపాటు పురుష దేవతలను ఆరాధించే సంప్రదాయం జానపదుల ఆధ్యాత్మిక జీవితంలో గాఢంగా ఉంది. పురాణ దేవతలే కాకుండా అంటే రాముడు కృష్ణుడు శివుడు మొదలైన పురాణదేవతలే కాకుండా ఇంకా చాలామంది పురుష దేవతలు గ్రామదేవతలుగా ఉండి జానపద సంప్రదాయంలో పూజలు అందుకుంటున్నారు. వీరిలో కొందరు దేవతలు సార్వజనికంగా అన్ని కులాలవారి పూజలు అందుకుంటుంటే మరికొందరు కొన్ని కులాలవారికి పరిమితమై వారి సేవలు అందుకుంటున్నారు. ఈ ఆరాధనా వ్యవస్థ ప్రత్యేక సంప్రదాయంగా ఉంది. దీన్ని గురించి కొంత తెలుసుకుందాం,

నూటొక్కమంది అంతకన్నా ఎక్కువగా అమ్మదేవతలు ఉన్నారని, వారి అందరికీ ఒకే తమ్ముడు పోతురాజు ఉన్నాడని కూడా ఇంతకు ముందే చర్చించాము. ఆ పోతురాజును ప్రత్యేకంగా పూజించడం ఉండదు. అమ్మదేవతలు అందరితోపాటు అక్కడ కూడా పోతురాజును పూజిస్తారు. ఆయనకు బలులు ప్రత్యేకంగా ఇవ్వడం కూడా ఉంటుంది. ఆంధ్ర ప్రాంతంలో పోతురాజు పేర్లు కూడా చాలా మంది పెట్టుకుంటారు. ముఖ్యంగా రజకులలో ఈ పేరు ఎక్కువగా కనిపించింది. ఎవరైనా జుట్టు బాగా పెంచుకొని కనిపిస్తే ఏమిటా జుట్టు పోతురాజులాగా అని పిలవడం చాలా పరిపాటిగా మారింది.

తెలంగాణలో బోనాలు పండుగలో పోతురాజు చాలా ప్రత్యేక ఆకర్షణ. అమ్మతల్లుల గుడులలో పోతురాజు గుడి ముందు అమ్మతల్లికి ఎదురుగా నిలిచి ఉన్నట్లే మాతృదేవతల వూరేగింపులో పోతురాజులు ముందుండి ఊరేగింపును తీసుకుపోతారు. బోనాలకు పోయేముందు భక్తులు తాము మొక్కుకున్న దానికి అనుకూలంగా బోనం కుండలు తీసుకొని ఊరేగింపుగా బయల్దేరతారు. అంతేకాదు. ప్రత్యేకంగా అలంకరించిన తొట్టెలు కూడా ఊరేగింపుగా బండిమీద కట్టుకొని తీసుకుపోతారు. ఈ ప్రతి ఊరేగింపు

ముందుగా ఒక వ్యక్తి పోతురాజు లాగా ఊరేగింపును ముందుకు తీసుకుపోతాడు. ఈ పోతురాజును సజీవంగా రక్తమాంసాలతో ఉన్న వ్యక్తిని ప్రత్యక్షదైవంగా భావిస్తారు. ఆ ఊరేగింపు అయినదాకా బోనం పూర్తి అయినదాకా అతను దైవస్థితిలోనే ఉంటాడు.

ఈ వ్యక్తి నిష్ఠగా ఉండి ఆరోజు ఉదయమే వేషం వేసుకుంటాడు. సాధారణంగా పోతురాజుగా మారే వ్యక్తి దానికి అనుకూలంగా ఆహార్యాన్ని వేసుకుంటాడు. మామూలుగా ఈ వ్యక్తులు చాలా బలంగా ఒడ్డుపొడుగు ఉంటారు. ఒకసారి పోతురాజుగా మారిన వ్యక్తి ప్రతి సంవత్సరం పోతురాజుగా మారే నిష్ఠ ఉంటుంది. మంచి బలిష్ఠమైన వ్యక్తి పోతురాజు అవతారం ఎత్తాలనుకునే వారు బాగా పొడవుగా జుట్టు పెంచుకుంటారు. పట్టెడు మీసాలు కూడా పెంచుకుంటారు. ఇవి పోతురాజుకు మరింత ఆకర్షణని ఇస్తాయి. పైన చొక్కా ఉండదు. కింద లాగు ఒకటి ఉంటుంది. ఈ లాగుని పసుపునీళ్ళలో ముంచి తర్వాత ఎండబెట్టి పసుపు రంగుతో కనిపించే ఈ లాగుసు తొడుక్కుంటారు. ఈ లాగుకు కింది భాగంలో గజ్జెలు లేక మువ్వలు కుట్టి ఉంటాయి. చేతిలో కొరడా ఉంటుంది. ముఖంనిండా ఒంటినిండా పసుపు పూసుకొని ఉంటాడు. నుదుటి మీద రూపాయి బిళ్ళంత కుంకంబొట్టు ఉంటుంది. కాళ్ళకు గజ్జెలు ఉంటాయి.

ఈ ఆహార్యంతో బోనాల ఊరేగింపు ముందు వీరావేశంతో పోతురాజులు కదులుతుంటారు. తమ చేతిలోని కొరడాని గాలిలో తిప్పుకుంటా ఆం అని కేకలు వేస్తూ కదులుతుంటారు. ఒక లయాత్మకంగా నాట్యం చేస్తారు. ఇలాంటి భయంగొలిపే పోతురాజును చూడడానికి జానపదులు చాలా ఇష్టపడతారు. చిన్న పిల్లలు భయపడతారని వారిని కాస్త దూరంగా ఉంచినా కూడా ఒక్కోసారి తల్లులు చిన్న పిల్లలను ఎత్తుకొని కూడా తిరుగుతారు. పోతురాజు ఊపే కొరడా చివరలు తగిలితే పుణ్యం అని మనుషుల్లో గాలి ధూళి సోకి ఉండే అంటే దుష్టశక్తులు ఏవైనా మనిషి

మీద ప్రభావం చూపితే అవి పోతాయని జానపదుల నమ్మకం. కొందరు పిలిచి కావాలని పోతురాజుతో కొరడాతో వీపు మీద కొట్టించుకుంటారు.

ఒక గ్రామంలో ఆషాఢమాసంలో ఇలా బోనాలు ఊరుమ్మడిగా నిర్వహిస్తారు. అలా చేసే బోనాల పండుగలో పోతురాజుగా అదే గ్రామంలోని వ్యక్తి ఉంటాడు. పోతురాజు ముందు లేకుండా బోనాల పండుగే జరగదు. బోనాల ఊరేగింపు కూడా ఉండదు. అంతే కాదు. బోనాల పండుగ తర్వాత కూడా ఆవ్యక్తి పోతురాజు ఆహార్యం తీసివేసిన తర్వాత కూడా కొద్దిరోజులు అతడిని దైవవ్యక్తిగానే పరిగణిస్తారు. అతని వద్దకుపోయి దండం పెట్టి ఆశీస్సులు తీసుకుంటారు. చిన్నపిల్లలను అతని దగ్గరికి తీసుకుపోయి అతనితో తలపైన చేయి పెట్టి దీవెన అందుకుంటే పిల్లలకు ఏదైనా కింకలు తగలినాపోతాయి అని జానపద నమ్మకాల వ్యవస్థలో బలమైన నమ్మకం ఉంది. అదేవిధంగా పోతురాజుగా ఉన్నవ్యక్తి కొద్ది రోజులపాటు అదే నిష్ఠతో ఉంటాడు.

బోనాల పండుగ తర్వాతి రోజుల్లో అమ్మ తల్లుల గుడులలో పోతురాజు ఒక రాయిరూపంలో కాని ఆరు నుండి ఎనిమిది అడుగుల ఎత్తులో ఉన్న ఒక కొయ్యస్తంభం రూపంలో కాని ఉంటాడు. దానికి కూడా పసుపు రాసి బొట్లు పెట్టు అమ్మదేవతతోపాటు దానికి గౌరవాన్ని భక్తిని ప్రకటిస్తారు జానపదులు. కానీ పోతురాజుకు ప్రత్యేకంగా గుడులు ఉండవు. తమిళనాడులో మాత్రం పోతురాజుకు వేరువేరు పేర్లతో గుడులు ఉన్నట్లు తెలుస్తున్నది.

## మల్లన్న సంప్రదాయం

తెలంగాణలో చాలా విస్తృతంగా ఉన్న సంప్రదాయం మల్లన్న సంప్రదాయం. మల్లన్న పశుపాలకకులాల దేవుడు. మానవశాస్త్రంలో Pastoral God అని అంటారు. మల్లన్న గురించి మహాభారతం కన్నా

పెద్దదైన అతి విపులమైన ఇతిహాసం ఉంది. ఇది మౌఖిక ఇతిహాసం దీన్ని ప్రదర్శించేది ఒగ్గు కళాకారులు ఒగ్గుకథలో, మల్లన్న కురుమ కులస్థులకు గొల్ల కులస్థులకు ఇలవేలుపు. అయినా తెలంగాణలో శాకాహార కులాలు మినహా అన్ని కులాలవారు మల్లన్న కొలుపులకు వచ్చి పూజించడం ఉంది.

మహారాష్ట్రలో మల్లన్ననే ఖండోబా అని అంటారు. తెలంగాణలో మల్లన్న సంప్రదాయం కూడా మహారాష్ట్ర నుండే వచ్చిందని పరిశోధనలలో తెలుస్తూ ఉంది. అక్కడి సంప్రదాయం ఇక్కడి మల్లన్న సంప్రదాయంలో కూడా చాలా పోలికలు ఒకే మాదిరిగా ఆచారకాండ కనిపిస్తుంది. కొమిరెల్లి మల్లన్న గుడి పూజారి చెప్పిన కథ ప్రకారం ఒక ముని సుమారు 800 సంవత్సరాల క్రితం కొమిరెల్లికి వచ్చాడని అతనే ఇక్కడ కొమిరెల్లి గుట్టమీద తపస్సు చేశాడని అతనే మల్లన్న సంప్రదాయాన్ని తెచ్చాడని తెలుస్తుంది. మల్లన్న గుడిలో ఒకసారి విగ్రహాన్ని బాగు చేయడానికి తవ్వినప్పుడు అక్కడ కుతుబ్షాహి వంశానికి చెందిన నాణాలు దొరికాయని మహాదేవుని నాగమల్లయ్య మల్లన్న గుడి పూజారి చెప్పాడు. దీన్నిబట్టి కూడా తెలంగాణలో మల్లన్న సంప్రదాయం ఏడు ఎనిమిది వందల సంవత్సరాల నాటిది అని తెలుస్తూ ఉంది. మల్లన్న సంప్రదాయం తెలంగాణకు అనుకొని ఉన్న కృష్ణా జిల్లాలో కూడా కొన్ని గ్రామాలలో కనిపిస్తుంది.

మల్లన్న అంటే శివుడు పార్వతి వరం కారణంగా పుట్టిన కుమారుడు అని ఆయనతోపాటు గొర్రెలు పుట్టాయని గొర్రెలకు సంరక్షకుడుగా ఆయన పుట్టాడని మల్లన్న పురాకథ చాలా విస్తృతంగా చెబుతుంది. అందుకే మల్లన్న అంటే శివుని కుమారుడు అని శివుని అపరావతారం అని కురుమలు గొల్లవారు భావిస్తారు. మల్లన్న పురాకథ చాలా సుదీర్ఘమైనది. మల్లన్న మూడు అవతారాలలో కనిపిస్తాడు. మల్లన్నగా గొల్లకేతమ్మని బలిజమేడల దేవిని వివాహమాడతాడు. ఇంకో అవతారంలో రత్నాంగిని పెండ్లాడతాడు.

శ్రీశైలమల్లన్న వరరచ్చ మల్లన్న అనేది మూడో అవతారం. రాచకన్నెలని పెండ్లాడతాడు. మల్లన్న మక్కాకిపోయి బండారును తీసుకొని వచ్చినట్లు మల్లన్న పురాణం చాలా విస్తృతంగా వివరిస్తుంది. శివునికుమారుడు మాత్రమే కాదు. శివుని కుమార్తె అయిన ఎల్లమ్మకి మల్లన్నని తమ్ముడుగా భావిస్తారు. అందుకే మల్లన్న గుడి ఎక్కడ ఉంటే పక్కనే చిన్న ఎల్లమ్మ గుడి ఉంటుంది. ఆదిరెడ్డి నీలమ్మలకు ఎంతోకాలం సంతానం లేకుంటా శివుని ప్రార్థిస్తే శివుని అవతారంగా పుట్టాడని కథ. మల్లన్న సంప్రదాయం ప్యాస్టారల్ సంప్రదాయం అంటే పశుపాల్య సంస్కృతికి చెందిన సంప్రదాయం.

కొమిరెల్లి మల్లన్న గుడి నేటి సిద్దిపేట జిల్లాలో ఉంది. కొమిరెల్లి గ్రామంలో కొండమీద ఉన్నది. ఒక చిన్నగుహలో ఉంది. మల్లన్న కోరమీసంతో విప్పారిన కన్నులతో రాజరికం ఉట్టిపడుతున్నట్టుగా ఉన్న స్వరూపం. అదే కొండమీద అవతలి పక్కన ఎల్లమ్మ గుడి ఉన్నది. మల్లన్న జాతర సందర్భంలో ఎల్లమ్మని కూడా కొలుస్తారు. అక్కడ బలి ఇస్తారు. మల్లన్న గుడిలో పూజారులుగా జంగమ సంప్రదాయానికి చెందిన వారున్నారు. వెనుకబడిన కులాలకు చెందినవారు. వంశపారంపర్యంగా వీరే పూజలు నిర్వహిస్తున్నారు. ఇక్కడ మొక్కుకున్న వారు గుడి ముందున్న గంగరేగి చెట్టుకు మొక్కులు చెల్లిస్తారు. గుడిలోపలి ముందు మండపంలో ఉన్న వరాలబండ వద్ద కూడా మొక్కులు చెల్లిస్తారు. సంతానం లేనివారు ఈ వరాల బండవద్దకు వచ్చి స్నానంచేసిన తడి గుడ్డతో ఇక్కడ ఆ బండమీద రెండు బొటనవేళ్ళు ఉంచి దేవుడు వారికి ఒంటిమీదికి వచ్చినదాకా అక్కడ అలాగే కూర్చుంటారు. దేవుడు ఒంటిమీదికి వచ్చి వారిని ప్రశ్నలు అడిగి ఆమెకున్న తీరని కోర్కెల గురించి ఆమెచేతనే దేవుడి వాక్కుగా చెప్పిస్తారు. దోషాలున్నా కూడా చెప్పించి కుటుంబ సభ్యులచేత దోషాలను పోయేలా చేస్తారు.

మల్లన్న గుడిముందు ఒగ్గు పూజారులు ఉంటారు. ప్రతి పెద్ద గుడిముందు పదినుండి ఇరవైమంది ఒగ్గు పూజారులు గుడికి సంబంధించిన కమిటీలో రిజిస్టర్ చేసుకొని ఉంటారు. పసుపు పచ్చనిరంగు దుస్తులు ధరిస్తారు. మల్లన్న సంప్రదాయంలో బండారుకు చాలా ప్రాముఖ్యం ఉంటుంది. బండారు అంటే ఎక్కువశాతం ఉన్న పసుపులో కొద్దిగా కుంకుమ కలిపితే అది బండారు అవుతుంది. దీన్ని మల్లన్నకు పూజా ద్రవ్యంగా సమర్పించడం చాలా పవిత్రమైన కార్యంగా భావిస్తారు. తెలంగాణ జానపద సంప్రదాయంలో బండారుకు చాలా ప్రాముఖ్యం ఉంటుంది. ఇక్కడి పూజారులు గుడికి వచ్చిన మల్లన్న భక్తులకు పూజలు చేయిస్తారు. అచ్చతెలుగులో మంత్రాలు చదువుతారు. మల్లన పాటలు పాడతారు. పుటంవేసి వచ్చిన కుటుంబసభ్యులతో పూజలు చేయిస్తారు. పటం అంటే పసుపు కుంకుమ తెల్లని ముగ్గు ఇలా రంగులతో నాలుగు పలకలుగా ముగ్గు వేస్తారు. ఈ ముగ్గులో మధ్యలో శివలింగం ఆకారాన్ని గీస్తారు. దీన్నే మల్లన్నతో సమానంగా భావించి మల్లన్న గుడి ఎదురుగా కూర్చుని ఈ పటంవేసి పూజలు చేయిస్తారు. ఈ పూజ అయిన తర్వాతనే ఆ కుటుంబ సభ్యులు గుడిలోనికి పోయి మల్లన్నను దర్శించుకుంటారు. ఇక మల్లన్న గుడిలో చెల్లించే ముఖ్యమైన కానుక ధాన్యాన్ని కానుకగా ఇవ్వడం. ఒకప్పుడు పండిన జొన్నలు ఇచ్చేవారు. ఇప్పుడు జొన్న పంటకన్నా వరి పంట అధికంగా ఉండడం వల్ల బియ్యాన్ని ఆలయంలో కానుకగా పోస్తున్నారు. మానెడు నుంచి బస్తా బియ్యం వరకు ఇచ్చేవారున్నారు.

ఏ కులంవారు అంటే శాకాహార కులాలవారు మల్లన్న గుడికి వచ్చినా ఈ పూజలు తప్పనిసరిగా చేయుంచుకుంటారు. ఈ పూజారులు అందరూ కురుమ కులానికి చెందిన ఒగ్గుపూజారులే. కురుమలు గొల్ల కులాలకు చెందినవారు ఏడాదికి ఒకసారైనా ఇంట్లో మైలలు తీయించుకునే పవిత్ర కార్యాన్ని నిర్వహిస్తారు. ఈ పనిని ఒగ్గుపూజారులే చేస్తారు. అంతేకాదు

ఏడాదికి ఒకసారైనా వారి ఇండ్లలో ఇలా ఒగ్గు కళాకారులచేత మల్లన్న కథ చెప్పించుకుంటారు. ఇలా కథ చెప్పించుకోవడం చాలా పవిత్రకార్యంగా భావిస్తారు. గ్రామంలో ఒగ్గువారు ఒగ్గుకథలో మల్లన్న కథ చెబుతుంటే ఊరివారు అందరు వచ్చి వినడం చూడడం పరిపాటి.

మల్లన్న కొలుపులు సంక్రాంతి పండుగ తర్వాత వచ్చే తొలి ఆదివారం నాడు ప్రారంభం అవుతాయి. ఈ కొలుపు పూజలు ఉగాది పండుగ తర్వాత వచ్చే ఆదివారం వరకు సాగుతాయి. అంటే దాదాపు ఏడాదిలో మూడు నెలలపాటు మల్లన్న కొలుపు ఉంటుంది. ఈ మూడు నెలల కాలంలో మల్లన్న ఆలయాలు భక్తులతో కిటకిటలాడతాయి చివరి ఆదివారం నాడు మల్లన్నకు గొల్లకేతమ్మకు కళ్యాణం నిర్వహిస్తారు. ఇటీవలి కాలంలో ప్రభుత్వం తరపునుండి కూడా ఈ కళ్యాణాన్ని నిర్వహించడం విశేషం. కొమిరెల్లిలోకాక వరంగల్ జిల్లాలో ఉన్న ఐలోని మల్లన్న కరీంనగర్ జిల్లాలో ఉన్న ఓదెల మల్లన్న అదిలాబాద్ జిల్లాలో ఉన్న మల్లన్న తెలంగాణలో ఉన్న ప్రసిద్ధమైన మల్లన్న క్షేత్రాలు ఇవికాక దాదాపు ప్రతి గ్రామంలో మల్లన్న గుడిపక్కనే చిన్న ఎల్లమ్మ గుడి కనిపిస్తాయి. అందుకే మల్లన్న పురుషరూపంలో ఉన్న గ్రామదేవతగా కనిపిస్తాడు. మల్లన్న కొలుపు కాలంలో మగవారు మల్లన్నగాను ఆడవేషం కట్టి ఎల్లమ్మగాను దీక్ష వహిస్తారు. ఈ మూడు నెలల కాలంవారు దైవస్థితిలో మల్లన్నగా ఎల్లమ్మగా అందరి గౌరవాన్ని పొందుతారు నిష్ఠతో పవిత్రంగా జీవిస్తారు. మూడునెలల తర్వాత ఉగాది పండుగ తర్వాత వచ్చే ఆదివారం పూజలతోపాటు తమ దీక్షను విరమిస్తారు. తిరిగి మానవ స్థితికి వస్తారు. చాలా విస్తృతమైన సంప్రదాయం మల్లన్న ఆరాధనా సంప్రదాయంలో ఉంది. ఈ గ్రంథకర్త మూడు సంవత్సరాలపాటు ది ఎపిక్ ఆఫ్ మల్లన్న పేరుతో ఒక పరిశోధన పథకం నిర్వహించాడు. ఇంగ్లీషులో గ్రంథం రచించాడు. ఇక్కడి గ్రంథపరిమితి కారణంగా మల్లన్న సంప్రదాయం గురించి చాలా క్లుప్తంగా వివరించడం జరిగింది. మల్లన్న తెలంగాణ జనజీవనంపైన చాలా ప్రభావం చూపించే చూపిస్తున్న దేవుడు.

## బీరప్ప ఆరాధనా సంప్రదాయం

తెలంగాణలో కురమలు, గొల్లలు కూడా బీరప్ప దేవుని పూజిస్తారు. బీరప్ప అంటే కురుమ కులానికి చెందిన ఒక వీరుడు ఈయన తన మేనమామ సరభూపతి కుమార్తెని ప్రేమించి మామ పిల్లనివ్వడానికి అంగీకరించకపోతే ఒక రకమైన సుదీర్ఘమైన పోరాటం చేసి మామపై విజయం సాధించి తన ప్రేమను దక్కించుకున్న ఇతిహాసం బీరప్పకథ. తెలంగాణలో అక్కడక్కడ బీరప్ప గుడులు ఉన్నాయి. ఈయన కూడా ప్రధానంగా గొర్రెలు సాదుకొని జీవించిన వ్యక్తి పశుపాల్య సంప్రదాయానికి చెందినవాడు. తెలంగాణలో అక్కడక్కడా విరళంగా బీరప్ప గుడులు ఉన్నాయి. కురుమలకు ఆశ్రితులుగా బీరప్పలవారు అనే కులంవారు బీరప్ప కథలు చెబుతారు. ఇది ఒగ్గుకథా సంప్రదాయమే. ఇది మల్లన్న సంప్రదాయం అంత విస్తృతమైనది కాకున్నా బీరప్ప దేవుని ఈ రెండు కులాలు తమ కులదేవతగా భావిస్తారు. ఎల్లమ్మ ఈ బీరప్పకు కూడా అక్క స్థానంలో ఉంటుంది. బీరప్పకథ చాలా జనరంజకమైన కథ. తెలంగాణలో చాలా విస్తృతంగా వ్యాప్తిలో ఉన్న సుదీర్ఘమైన ఇతిహాసం. లేదా పురాకథ అని కూడా చెప్పవచ్చు. జానపద ఆరాధనా సంప్రదాయంలో తెలంగాణలో బీరప్ప పూజలు ముఖ్యంగానే ఉన్నాయి. ఏడాదికి ఒకసారి బీరప్పకి కొలుపులు కొలవడం బలులు ఇవ్వడం కూడా చెస్తారు. గొర్రెను కాని, మేకని కాని లేదా కోడి కాని బలి ఇచ్చి పూజ చేయడం కూడా ఉంది.

## వీరారాధన పల్నాటి వీరుల ఆరాధన

పల్నాటి వీరగాథ మహాభారతంతో సమానంగా ఖ్యాతి పొందిన తెలుగు ఇతిహాసం. గుంటూరు జిల్లా కారంపూడిలో వెలసిన వీర్లగుడిలో ఏడాదికి ఒకసారి కారంపూడి తిరునాళ్ళ జరుగుతుంది. అక్కడ ఐదు రోజులపాటు జరిగే వేరువేరు క్రతువులలో ఎంత విస్తృతమైన ఆచారకాండ ఉంది. ముఖ్యంగా ఇది వీరారాధన సంప్రదాయం. చనిపోయిన వీరులను పూజించే

సంప్రదాయం ఇది రెండు తెలుగు రాష్ట్రాలనుండి వేలాదిగా ఇక్కడికి భక్తులు తరలివస్తారు. నాలుగు రోజులు వీరారాధనలో వేరువేరు ఆచారకాండలో పాల్గొంటారు. 12వ శతాబ్దంలో 1182లో జరిగిన పల్నాటియుద్ధం తర్వాతి కాలంనుండి ఇక్కడ నిరాఘాటంగా ఈ వీరారాధన జరుగుతున్నది. కారంపూడి రణక్షేత్రంలో నేటికీ ఈ వీరులు గుడిలో పల్నాటివీరులు వినియోగించిన ఆయుధాలు కత్తులు, కుంతాలు ఈటెలు ఉన్నాయి. ఒక్కో వీరునికి చిహ్నంగా ఒక చిన్న రాయి అక్కడ ప్రతిష్ఠితమై ఉంది. ఈ వీరులు అందరూ నేటికీ పూజలు అందుకుంటున్నారు. తెలుగు వారి జానపద ఆధ్యాత్మికతలో ఉన్న వీరారాధనకు ఇది చాలా పెద్ద ఉదాహరణ. కార్తికమాసం అమావాస్య తర్వాతి రోజున మార్గశిర మాసం తొలిరోజున ప్రారంభమయ్యే ఈ ఉత్సవాలు పుష్యమాసంలో పరిసమాప్తం అవుతాయి. సాధారణంగా ఈ రోజులు నవంబరు డిసెంబరు నెలలలో వస్తాయి.

పల్నాటి బ్రహ్మనాయుడు చాపకూటి సిద్ధాంతాన్ని ప్రవర్తింప చేసిన మహాసంఘసంస్కర్త. ఆయన మాచర్లను పాలించిన మలిదేవరాజు పక్షాన ఉండగా గురజాలను పాలించిన నలగామరాజు పక్షాన నాయకురాలు నాగమ్మ ఉండి యుద్ధానికి సారథ్యం వహించారు. బ్రహ్మనాయుడు స్థాపించిన మాచర్ల చెన్నకేశవాలయం నేటికీ పూజలందుకుంటున్నది. అలాగే నాయకురాలు నాగమ్మ పూజించిన శివాలయం జిట్టగామాలపాడు గ్రామంలో నేటికీ శిథిల స్థితిలో ఉన్నది. పల్నాడు తాలుకా అంతటా వేరువేరు గ్రామాలలో పల్నాటి యుద్ధానికి చెందిన చిహ్నాలు కనిపిస్తాయి. పల్నాటి వీరులు అరణ్యవాసానికి పోయిన మందాడి అడవులు కోడి పందెం జరిగిన పాల్వాయి విషప్రయోగానికి గురై ఒరిగిపోయి వీరమరణం పొందిన అలరాజు పడిపోయిన గ్రామం చెర్లగుడిపాడు, నాగమ్మ నివాసం గామాలపాడు. మలిదేవరాజు పాలించిన మాచర్ల, నలగామరాజు పాలించిన గురజాల, మహాభారత యుద్ధానికి క్షేత్రమైన కురుక్షేత్రంలాగా పల్నాటి మహాయుద్ధానికి

క్షేత్రమైన కారంపూడి, కొదమగుండ్ల, ప్రదేశాలు నేటికీ చారిత్రక ప్రదేశాలుగా ప్రాముఖ్యం సంతరించుకొని ఉన్నాయి. మహాభారతంలో జరిగిన ప్రతి ముఖ్యఘట్టం పల్నాటి వీరకథలో జరిగింది. అందుకో అంత ప్రాముఖ్యం ఉండి తెలుగు జానపదుల వీరారాధన సంప్రదాయంలో నేటికీ చాలా ముఖ్యంగా నిలిచింది. ఈ కొలుపులో ముఖ్యభాగంగా వీర్ల అంకమ్మని కూడా పూజిస్తారు.

వీరాచారం అంటే పల్నాటి వీరులను పూజించే ఆచారం ఉన్న వేరువేరు కులాలవారు తెలుగు రాష్ట్రాలు రెండింటిలో ఉన్నారు. వారు ఈ పల్నాటివీరుల కొలుపు జరిగే నాలుగు రోజులు వచ్చి ఇక్కడి కత్తిసేవ కార్యక్రమంలో పాల్గొంటారు. వీరులకు బలి ఇచ్చి పూజ చేస్తారు. వీరులను పూజించడం ద్వారా వారికి నూతన జవసత్వాలు వస్తాయని కోరికలు వారు తీరుస్తారు అని జానపదసంప్రదాయంలో గట్టి నమ్మకం ఉన్నది.

పల్నాటియుద్ధం ముగిసిన తరువాత బ్రహ్మనాయుడు ఆశయ సిద్ధికోసం యుద్ధంలో మరణించిన 66 వీరనాయకులకు గుర్తులుగా 66 వీరకల్లును ప్రతిష్ఠించి వీరాచారపీఠం స్థాపించి, దానికి పిడుగు వంశంవారిని పీఠాధిపతిగా నియమించాడు ఆ వీరకల్లులు, వీరాచారపీఠం ఉన్నదే వీరులగుడి (వీర్లదేవాలయం). ఈ గుడి నాగులేటి నదిఒడ్డున ఉంది. యుద్ధంలో మరణించిన వీరులకు దైవత్వాన్ని ఆపాదించి, వారు ఉపయోగించిన ఆయధాలకు పూజలు చేసి ఉత్సవాలు జరపటం అనే సాంప్రదాయం ప్రపంచంలో రోమ్ తరువాత ఒక్క కారంపూడిలోని వీరగుడిలోనే జరుగుతుంది. 12వ శతాబ్దంనాటి వీర్లదేవాలయం (కారంపూడి) పల్నాటి చారిత్రక చిహ్నాలలో ఒకటి.

ఈ వీర్ల గుడికి సాంప్రదాయికంగా చారిత్రకంగా పిడుగు వంశం వారు ధర్మకర్తలుగా ఉండి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. అంతేకాక ఈ పీఠాధిపతి ఇటీవలి కాలందాకా ఉన్న పిడుగు ఆంజనేయప్రసాద్ గారు

విస్తృతంగా పర్యటిస్తూ వీర సంప్రదాయాన్ని వ్యాప్తం చేస్తుండేవారు. ఇప్పుడు ఆయన మనుమడు పిడుగు తరుణ్ చెన్నకేశవ్ అనే యువకుడు కారెంపూడి వీరుల పీఠానికి పీఠాధిపతిగా ఉన్నాడు. ఈ వీరగాథని ప్రచారం చేయడానికి పల్నాటి వీర విద్యావంతులు అనే మాలవారు వంశపారంపర్యంగా కథ చెప్తారు. అలాగే పిచ్చుకుంటి వారు కూడా పలనాటి వీరకథని వారి పిచ్చుకుంటి కళారూపంలో విస్తృతంగా ప్రచారం చేస్తారు. బ్రహ్మనాయుడు, ఐతమ్మ, బాలచంద్రుడు, మాంచాల, నాగమ్మ, అలరాజు, పేరమ్మ, నలగామరాజు, మలిదేవరాజు, మాలకన్నమదాసు ఈ పాత్రలు తెలుగునాట నేటికీ మరువలేని చారిత్రక పాత్రలుగా చారిత్రక వ్యక్తులుగా ఆరాధ్య దేవతలుగా జానపద సంప్రదాయంలో నిలిచారు.

పల్నాటి వీర చరిత్ర పల్నాటి మహేతిహాసం మన దేశంలోనేకాక అంతర్జాతీయంగా గుర్తింపునకు వచ్చింది. ఝిన్ రోఘేర్ అనే అమెరికాకు చెందిన పరిశోధకుడు పల్నాడు ప్రాంతానికి వచ్చి కొన్ని సంవత్సరాలు పరిశోధన చేసి ది ఎపిక్ ఆఫ్ పల్నాడు అనే గ్రంథాన్ని రచించాడు.

జానపద ఆధ్యాత్మికతలో వీరారాధన సంప్రదాయంలో పల్నాటి వీర చరిత్ర చారిత్రాత్మకమైనది పురాతనమైనది. ఇక్కడ అంకమ్మ ఆరాధన ఇంకా పురాతనమైనది. ఈ పల్నాటి వీరులు కూడా ఇక్కడి అంకమ్మని కొలిచారు.

**వీరారాధన వీరగల్లులు :** రెండు తెలుగు రాష్ట్రాలలోనే కాదు దక్షిణ భారతదేశం అంతా కూడా వీరకల్లులు కనిపిస్తాయి. చాలా గ్రామాలలో వీరకల్లులు ఏదో ఒక రూపంలో కనిపిస్తాయి. ఒక వీరుడు కత్తితో ఉన్న శిల్పం కావచ్చు. లేదా వీరుడు కత్తితో తన తలను ఉత్తరించుకుంటున్న దృశ్యం కావచ్చు. రాతిమీద మురల్ పద్ధతిలో శిల్పాన్ని చెక్కిన వీరశిలలు ప్రతిచోట చాలా విస్తృతంగా మనకు కనిపిస్తున్నాయి. ఈ వీరులు యుద్ధంలో వీరమరణం పొందినవారు మాత్రమేకాదు. కొందరు వీరులు ఆత్మాహుతి చేసుకొని కూడా వీరులుగా ఆరాధన పూజలు అందుకుంటున్నారు. ఆచార్య నాయని

కృష్ణకుమారి గారు ఇలాంటి వీరులను కొందరిని ప్రస్తావించారు. రెండు విధాలుగా ఎలా ఉన్నారో ఇక్కడ చూద్దాం.

ఒక రాజు చెఱువు తవ్వించాడు. శ్రామికులకు బంగారం ఇస్తానని చెప్పి చివరికి పని ముగిసిన తర్వాత వెండి నాణాలు ఇచ్చాడు. వారు పట్టరాని కోపంతో రాజుపైన నిరసనతో ఆ రాజు ఎదుటనే తలలు కోసుకొని మరణించారు. అక్కడ వీరశిలలై వెలిసి పూజలందుకుంటున్నారు.

ఒక రాజు సేవలో హరిజనులు యుద్ధ సమయంలో అసామాన్య పరాక్రమాన్ని చూపించి రాజుకు జయాన్ని అందించారు. కానీ ఆరాజు వీరికి ఇవ్వవలసిన మర్యాద ఇవ్వకపోవడంతో ఆ రాజు ఎదురుగానే తలలు కోసుకున్నారు. తర్వాత వీరశిలలై వీరపూజలు అందుకుంటున్నారు. ఇలాంటి వీరులు కూడా ఉన్నారు.[22] ఇలాంటి జానపద కథల్ని బ్రిటిషు అధికారులు అయిన వారు దక్షిణాదిలోని జానపద దేవతల పైన పరిశోధన చేసిన గ్రామదేవతలపైన పరిశోధన చేసిన Henry Whithead, Elmoreలు సేకరించి వారి గ్రంథాలలో ప్రచురించారు.

దొంగలు సరే అత్యంత దయనీయంగా చంపబడినవారు జానపదుల సానుభూతిని అందుకొని వారిపైన పాటలు కట్టి పాడుకునేలాగా చేసినవారున్నారు. సింహాచలం కొండపైన ఆలయంలో దొంగతనానికి పాల్పడిన దొంగలు తర్వాత కొన్ని సంవత్సరాలకు దొరికి పోలీసు కాల్పులలో చనిపోయిన తర్వాత వారిపైన విపరీతమైన సానుభూతి కలిగివారిపైన జానపదగేయాలు పుట్టాయి. ఈ గేయాన్ని కట్టి వారిపైన పాడుకోవడంలోనే జానపదుల భక్తి ప్రపత్తులు కనిపిస్తాయి.

శివునికి ఆత్మహింసా పద్ధతిలో తమ తలపందు కొట్టి ఇచ్చిన వీరభక్తులు కూడా వీరశిలలై పూజలు అందుకుంటున్న శిలలు కొన్ని గ్రామాలలో మనకు కనిపిస్తాయి.

జనంకోసం పాటుపడి వారికోసం యుద్ధాలు చేసి లేదా వేర్వేరు రూపాలలో త్యాగాలు చేసిన వ్యక్తులు యుద్ధంలో కాని వేటలో కాని మరణించిన సందర్భాలలో వారిని దేవుళ్ళుగా చేసి ఆరాధించే సంప్రదాయం జానపద సంప్రదాయంలో ఉంది. ఇలాంటి వాటికి చాలా ఉదాహరణలు చూపించవచ్చు.

మహబూబ్ నగర్ జిల్లాలో ఉన్న కురుమూర్తి గురించి ఇంతకుముందు ప్రస్తావించాము. కురుమన్న అనే వ్యక్తి ఆ గ్రామ ప్రజల కోసం నిరంతనంగా పనిచేశాడు. వారికి వచ్చిన వ్యాధులు పశువులకు వచ్చిన వ్యాధులు అన్నింటికి చికిత్స చేసేవాడు ఎవరికి ఏ కష్టం వచ్చినా కూడా స్పందించి చుట్టుపక్కల ఊర్లవారికి కూడా సేవ చేసేవాడు. ఇలాంటి వ్యక్తి తమ కుటుంబసభ్యులు చేసిన కుళ్ళు కుతంత్రాల కారణంగా మరణించాడు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలందరి సానుభూతిని పొంది దేవుడుగా ఆరాధించబడ్డాడు. ఆయన పేరుతోనే కురుమూర్తి అని ఆ గ్రామానికి పేరు స్థిరపడింది. ఆయనే కురుమూర్తి కొండపైనున్న వేంకటేశ్వరస్వామిలో లీనమయ్యాడని ప్రజలు నమ్ముతారు. ఈ కురుమూర్తి ఉత్సవాలు నేటికి జరుగుతున్నాయి.

మహబూబ్‌నగర్ జిల్లాలోనే ఉన్న మరొక వీరుడు పండుగ శాయన్న ఇతను పందొమ్మిదో శతాబ్దంలో ఉండి బ్రిటిషు వారిచేత గజదొంగగా గుర్తించబడి వారి కాల్పులకు బలయ్యాడు. ఈయన కాపుకులస్థుడు అని ఆయన గేయగాథ చెబుతుంది. ఆయన పెద్దపెద్ద జమీందారులను ప్రజలను పీడించి దోచుకునే దొరలను దోచేవాడు వారి ధాన్యం బండ్లు పోతుంటే దాడిచేసి ధాన్యాన్ని లాక్కొని పేదప్రజలకు పంచేవాడు. ఆయన తుపాకి పట్టుకొని తిరిగేవాడు. తనకు కొంతమంది అనుచరులను కూడా తయారు చేసుకున్నాడు. బ్రిటిషు వారు ఈయన చేసే ఈ దురాగతాలను చూచి ఇది చివరికి తమ ప్రభుత్వంపైన కూడా తిరుగుబాటుగా మారుతుందని ఈయనను గజదొంగగా చిత్రించి చంపేశారు. ఈయన సమాధి నేటికి కూడా తీర్థస్థలంగా మారి జానపదుల పూజలు అందుకుంటున్నది.

**సర్వాయి పాపడు :** సర్వాయి పాపన్న నేటి జనగామ జిల్లాకు చెందిన వీరుడు ఇక్కడ ఈయన కోట శిథిలాలు కనిపిస్తాయి. ఈయనకు గ్రామదేవతల గుడుల లాగా అక్కడక్కడ గ్రామాలలో గుడులు వెలిసాయి నేటికీ జానపదుల పూజలందుకుంటున్నాడు. ఈయన నిజాం నవాబును ఎదిరించిన వీరుడుగా ఒక్కరోజు గోలకొండ కోటను పాలించినవాడుగా జానపద చారిత్రక కథలలోకి ఎక్కాడు. గౌడ వంశస్థుడైన ఈయన వీరుడుగా మారి రాజరికాన్ని వారి అరాచకాలను ఎదరించి వారి ఆగ్రహానికి గురయ్యాడు. కథల్లో ఏడు గడియలు ఏలాడని ఏడురోజులు ఏలాడని కూడా గేయగాథలు చెబుతున్నాయి. మల్లంపల్లి సోమశేఖర శర్మగారు ఆయన చరిత్రను తవ్వి తీశారు. ఆచార్య రామరాజుగారు చారిత్రక గేయాల వర్గీకరణలో పాపడి చరిత్రను గురించి చెప్పారు. తర్వాతి కాలంలో ఆధునిక కాలంలో చాలాచోట్ల సర్వాయి పాపడి విగ్రహాలు వెలిశాయి. ఆయనను కుల దేవతగా పూజించడం నేటికి స్థిరపడింది. ఒక సామాజిక వర్గానికి ఈయన దేవుడుగా కనిపిస్తాడు.

**బొబ్బిలి రాజుల వీరం :** బొబ్బిలి వీరుల శౌర్యగాథలు తెలుగునేల అంతా వ్యాపించినవి. బుర్రకథ కళారూపంలోను, నాటకం రూపంలోను సినిమా రూపంలోను వీరి వీరగాథ చాలా వ్యాప్తి చెందినది. బొబ్బిలి వీరులకు గుడులుకట్టి పూజించడం లేకపోయినా కూడా ఆ ప్రాంతంలోని విస్తృత ప్రజానీకంలో వీరులుగానే ఆరాధించబడుతున్నారు. జానపదుల ఆధ్యాత్మికతలో బొబ్బిలివీరుల స్మరణ గాఢంగానే ఉంది. తమ శక్తి చాలదని తెలిసినా శత్రువు పాశ్చాత్య దేశాలనుండి తెచ్చిన ఫిరంగుల ముందు తుపాకుల ముందు తమ కరవాలాలు నిలవలేవని తెలిసినా శత్రువును ఎదురొడ్డి పోరాడి వీరమరణం పొందిన బొబ్బిలి వీరులను ఆప్రాంతం ప్రజలు ఆదరభావంతోనే కాదు వీరారాధన భావంతో ఆరాధిస్తారు. పూజలకు ఆరాధనకు ఉన్న తేడా గమనించదగినది.

అల్లూరి సీతారామరాజు సమాధిని పూజించడం ఆ ప్రాంతం వారిలో కనిపించింది. ఒక స్వాతంత్ర్య సమరవీరుడుగా ఆయన తెలుగు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచినా, జానపద సంప్రదాయంలో ఆయనను గురించిన వీరుడుగా ఉన్నా, కాళికా ఉపాసకుడు అని పులిమీద ఎక్కి స్వారీ చేసేవాడని జానపద సాహిత్యంలో సంప్రదాయంలో చెప్పుకుంటున్నా అక్కడి వారే ఆయనను పూజిస్తారు. ఇతర ప్రాంతాలలో అనుముల బ్రహ్మారెడ్డి, సదాశివరెడ్డి, బంగారు తిమ్మరాజు ఇలా ఆరాధించబడే వీరులలో కొందరు.

## జానపదుల ఆధ్యాత్మికతలో మానవదైవాలు

జానపద మనస్తత్వం కొంత అమాయకత ఉంటుంది. ఇక్కడ అమాయకత అంటే ఏదైనా మహిమ ఉన్నది అని భావిస్తే అతిత్వరగా ఆకర్షితులౌతారు. అంటే తార్కికంగా ఆలోచించడం. ఇది సాధ్యమా? కాదా? అని విచికిత్స చేయడం, ఉండదు. ఒక వ్యక్తికి మహిమలు ఉన్నాయని ఒక వ్యక్తి ద్వారా ఒక గ్రామానికి తెలిసినా ఒక గ్రామం నుండి విషయం వంద గ్రామాలకు వ్యాపిస్తుంది. అంతేకాదు ఒక ప్రాంతం నుండి వేరువేరు ప్రాంతాలకు ఇలాంటి వార్తలు వ్యాపించడం ఏ సమాచార వ్యవస్థలు లేని కాలంలోనే జరిగేది. ఒక వ్యక్తి స్వామీజీగా మారాడని ఆయన ఎన్నో మహిమలు చూపిస్తున్నాడని ఆయనను పూజిస్తే భక్తులకు అనుకున్న కోరికలు తీరున్నాయని జానపదుల మనస్సులలోనికి ఒక విషయం వ్యాపిస్తే ఇక ఆ వ్యక్తి ఆడ కాని మగకాని దేవత లేదా దేవుడు ఆయిపోతారు. కలియుగంలోనే కళ్ళ ఎదుటే రక్తమాంసాలతో ఉన్న వ్యక్తులను దేవుళ్ళుగా ఆరాధించే సంప్రదాయం జానపదులలో చాలా వ్యాప్తంగా ఉన్నది. నాగరీకులలో విద్యావంతులలో కూడా ఇలాంటి సమ్మకాలు ఉన్నప్పటికీ జాసపదులలో ఉన్న సమ్మకాల వ్యవస్థ చాలా బలంగా ఉంటుంది.

ఒకప్పుడు మనుషుల మధ్యన మనిషిగా తిరిగి ఆధ్యాత్మిక బోధనలు చేసిన వారు కొన్ని మహిమలను చూపినవారు పోతులూరి వీరబ్రహ్మం

గారు, సిద్ధప్పగారు, రాఘవేంద్రస్వామి ఇంకా అలాంటి ఎందరో యోగులు వారి కాలంలోనే దేవుళ్ళుగా పూజలు అందుకున్నారు. వందల సంవత్సరాలు గడిచినా ఇంకా గుడులతో పూజారి వ్యవస్థతో పూజలు అందుకుంటూనే ఉన్నారు.

**Endnotes**

1. రామరాజు బిరుదురాజు, 1978, తెలుగు జానపద గేయ సాహిత్యము, హైదరాబాదు, జానపదవిజ్ఞాన ప్రచురణలు, పుట 1.
2. భగవద్గీత యథాతథము, 1984, భక్తియోగము, భక్తివేదాంత ట్రస్టు, పుట 519.
3. స్వామి యతీశ్వరానంద, 2021, ధ్యానము ఆధ్యాత్మిక జీవనము, హైదరాబాదు, రామకృష్ణ మఠము, పుటలు 32–36.
4. IBID, p. 34-35.
5. IBID, p. 35.
6. IBID, p. 36.
7. IBID, p. 36.
8. భగవద్గీత యథాతథము, 1984, భక్తియోగము, భక్తివేదాంత ట్రస్టు, పుట 518–19.
9. స్వామి వివేకానంద, అను స్వామి చిరంతనానంద, 2021, భక్తియోగం, హైదరాబాదు, రామకృష్ణమఠం, పుటలు 1–2.
10. శ్రీ మద్భాగవతము 7.5.23
11. శ్రీ పోతన బమ్మెర, 1983, శ్రీ మహాభాగవతము, రెండవ సంపుటము, సప్తమస్కంధము, హైదారాబాదు, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ, పుట 25, పద్యం 167.

12. John R. Hinnells, 2007, A Handbook of Ancient Religions, New York : Cambridge University Press, p. 8.

13. IBID, p. 8-9.

14. Funk & Wagnalls, 1972, Standard Dictionary of Folklore Mythology and Legend : New York, HarperSan Francisco, P. 377.

15. ఇక్కడ 'భూతకోలకు' సంబంధించిన సమాచారాన్ని ఈ ఫోటోను ప్రొ॥ ఎస్.ఏ. కృష్ణయ్య అందించారు. వీరు దక్షిణ కర్ణాటక ఉడిపిలో నివసిస్తారు. వీరు ప్రత్యేకమైన జానపద సంస్థను ఒక దాన్ని నిర్వహిస్తున్నారు.

16. 'తెయ్యం'కు సంబంధించి ఇక్కడ రాసిన సమాచారంలో ఎక్కువ భాగం. నా మిత్రుడు ప్రముఖ మలయాళ జానపద పరిశోధకుడు డా॥ వి. జయరాజన్ ఒక వ్యాసరూపంలో అందించిన సమాచారాన్ని ఆధారంగా చేసుకొని రచించాను.

17. కృష్ణకుమారి నాయని, 1977, తెలుగు జానపద గేయగాథలు, హైదరాబాదు, స్వీయ ప్రచురణ, పుట 137.

18. IBID, p. 139.

19. IBID, p. 155.

20. సత్యనారాయణ విశ్వనాథ, 2016, వేయిపడగలు, విజయవాడ, శ్రీ విశ్వనాథ పబ్లికేషన్స్, పుటలు 2-4.

21. కృష్ణకుమారి నాయని, 1977, జానపద గేయగాథలు, హైదరాబాదు, ఆంధ్రసారస్వత పరిషత్తు, పుటలు 190-191.

22. IBID, p. 260.

* * *